# కథా మంజరి

పది కథల సమాహారం



**కథామార్గదర్శి**

జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకట రావు
ప్రచురణ కర్త

**డిసెంబర్ 2021 సంచిక**

© Copyright 2020 - Editorial Board Kathamanjari

కథ



# సుస్వాగతం

# కథామంజరి శ్రావ్య సంచిక

ఈ సంచికలో 'గళ' సహకారం అందించిన కళాకారులు –

- శ్రీ పప్పు భోగారావు గారు
- శ్రీ వెంపటి కామేశ్వర రావు గారు
- శ్రీ భువనపల్లి రంగనాథం గారు
- శ్రీమతి కరవది సరస్వతి గారు

## ఈ నెల శ్రావ్య సంచిక కోసం

**ఇక్కడ నొక్కండి**

# ఇదీ వరస


| సంఖ్య | విషయం | | పేజీ |
|---|---|---|---|
| I | మా జట్టు | | i |
| II | కృతజ్ఞతలు | | ii |
| III | కథాకీయం | | iii |
| IV | విశిష్ట అతిథి | | vii |
| V | కథా మార్గదర్శి | | X |
| | **కథలు** | | |
| సంఖ్య | కథ పేరు | రచన | పేజీ |
| 1 | ఇచ్చి చూడు | సింహప్రసాద్ | 1 |
| 2 | పూజాఫలం | పెనుమాక నాగేశ్వరరావు | 7 |
| 3 | చిల్డ్రన్ వితౌట్ నేమ్స్ | రాపాక కామేశ్వరరావు | 12 |
| 4 | రహస్యం | డా. లక్ష్మీ రాఘువ | 17 |
| 5 | ఆవలి ఒడ్డు | కోయిలాడ రామ్మోహనరావు | 21 |
| 6 | ఈ పని చాలు నాకు | పొత్తూరి విజయలక్ష్మి | 24 |
| 7 | ప్రమాదాల అంచులలో | ఘుండికోట విశ్వనాథం | 29 |
| 8 | లక్ష్యం | చిత్రవెంకటేష్ | 35 |
| 9 | శివాలయం గూడు | సి. వి. శాస్త్రి | 42 |
| 10 | ముందు సూపు | ముద్దూరి నరసింహ మూర్తి | 47 |
| అలవోకగా కథని నడిపించి, శైలితో మెప్పించే రంగనాయకమ్మగారి కథలలో మరో ఆణిముత్యం | | | |
| 11 | ఆశ్చర్యం | రంగనాయకమ్మ | 50 |
| 12 | ప్రత్యేక వ్యాసం | ఎల్ ఆర్ స్వామి | 55 |



# మా జట్టు

సాంకేతిక సహకారం

harbinger PUBLISHING

బొమ్మలు

శ్రీ కొయిలాడ రామ్మోహన రావు

శ్రీ కొచ్చెర్ల వి ఆర్

శ్రీ 'వసంత' కృష్ణ

సంపాదక సహకారం

శ్రీ ఎం ఎ పద్మనాభ రావు


శ్రీ కృపాకర్ పోతుల

# కృతజ్ఞతలు


## ఈ సంచిక దాతలు

**శ్రీ షేక్ బాబర్ గారు**

**శ్రీమతి నీలోఫర్ గారు**







# కథాకీయం

తెలుగు కథ పుట్టినప్పటినుంచి కాలానుగుణంగా రకరకాల మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా వ్యవహారిక భాషా ఉద్యమం ప్రారంభం తర్వాత, తెలుగు కథ గ్రాంధికంతో పాటు ఎదిగి, సుమారుగా ఏభై సంవత్సరాల తర్వాత, గ్రాంధిక భాష కథల కంటే, పై మెట్టు ఎక్కి శిఖరాగ్రం చేరింది. అంతర్జాతీయ స్థాయిలో చోటు సంపాదించింది. సామాజిక, సాంఘిక, కుటుంబ సమస్యల నుంచి పరిశోధక విషయాలు, సైన్సు, ఫిక్షన్, హాస్యం, విప్లవం.... ఒకటేమిటి.. తెలుగు రచయితలు స్పృశించని అంశం లేదనే చెప్పాలి.

రచయితలు వారి వారి అనుభూతి, అనుభవాలతో కథలు గాని, కవితలు గాని రాసేవారు. చెప్పదలిచిన విషయాన్ని అన్ని కోణాలలో నిశితంగా అలోచించి రాసేవారు. అంతకంటే ఎక్కువగా గ్రంథ పఠనం చేసేవారు. అందుకే వారి కథలు చదివినప్పుడు, మనకి దృశ్యం కనబడుతుంది. సుమారుగా 2000 సంవత్సరం వరకు ఈ "కథ" బాగానే నడిచింది. ఒక తరం రచయితల తర్వాత మరో తరం రచయితలు పుట్టుకొచ్చి, రచనలు చేసే జిజ్ఞాసని పుణికి పుచ్చుకుని, తెలుగు కథని ఓ శతాబ్దకాలం చిరంజీవిగానే నిలబెట్టారు. కొత్త కొత్త రచయితలు అన్ని తరాల్లో పుట్టుకొచ్చారు. ఆయా కాలాలలో పిన్నవయసు నుంచే రచయిత కావాలనే ఓ ఉత్సాహం ఉండేది. అలనాటి గురజాడ వారి తరం నుంచి, చాసో, రావి శాస్త్రి, పాలగుమ్మి,... మొన్నటి ముళ్లపూడి, గొల్లపూడి వరకు, అంచెలంచెలుగా తరాలు మారినా సరే, కథ సజీవంగా, కాలానుగుణంగా ఉంది. ఇప్పటికీ వయసు మీరినా సరే, విహారి, ద్విభాష్యం, వసుంధర, మల్లాది, యండమూరి వంటి మేటి రచయితల కలాల నుంచి తెలుగు కథ అందంగా తయారవుతునే ఉంది.

తెలుగు భాష, మాట, పలుకుబడి, పట్టు పదాలు, మాటలు.., తెలుగువారి జీవితాలు, ఆయా కాలాలలో కనిపించే మంచి, చెడు, సామాజిక పరిస్థితులు.. అలా అన్ని కథ ద్వారానే ఒక తరం నుంచి ఇంకో తరానికి బట్వాడా అయ్యేవి. ఆనాటి కథా రచయితలు, రాయడానికి ముందు.. . రాసే విషయం మీద అనుభూతి, అనుభవం, పరిశీలన, ముఖ్యంగా అనంతమైన పుస్తకపఠన, శ్రమ, వెనుక చేసే కృషి, ఆలోచనలు.., చేసిన తర్వాతే కథలను రాసేవారు. అందుకే అలనాటి కథలు నేటికి అజరామరంగా నిలిచాయి. ఆ కాగితం చిరిగినా, గ్రంధాలయాలు మూతపడినా, పుస్తకాలు మటుమాయం అయినా సరే, సుమారుగా ఎక్కువ శాతం నాటి మేటి కథలు డిజిటల్ వ్యవస్థలో నిక్షిప్తమై ఉన్నాయి. ఇంత వరకు కథకి "మంచే" జరిగింది.
కాని వర్తమాన కాలంలోని అసలు విషయాలను ఆలోచిస్తే...

ప్రస్తుతం కథలు రాస్తున్న రచయితల సరాసరి వయసు చూస్తే సుమారు తొంబై శాతం మంది అరవై పై చిలుకు వయసువారే ఉన్నారు. మిగతావారిలో  నలభై.. అరవై వయసు వారే ఉన్నారు. పాతిక, ముప్పై సంవత్సరాల లోపు వయసున్న రచయితలు సుమారుగా లేరనే చెప్పాలి. ఉన్నా లెక్క పెట్టడానికి చేతి వేళ్లు చాలు!!  మారిన పరిస్థితులలో సాంకేతిక పరిజ్ఞానం చోటు చేసుకుని, సుమారుగా పత్రికలన్నీ మూత పడినా, అంతర్జాలంలో పైన చెప్పిన వారి కథలు వీరవిహారం చేస్తున్నాయి. పాఠకుల సంఖ్య క్రమేపీ తగ్గుతున్నా.. రచయితలు, రచనల కొరత లేదనే చెప్పాలి. కథల్లో కాలానుగుణంగా చోటు చేసుకున్న సామాజిక పరిస్థితుల్నుంచి, సాంకేతిక విషయాల వరకు, వాస్తవ స్థితిగతులకు అద్దం పట్టే కథలు వస్తున్నాయి. ఇంత వరకు బాగానే ఉంది. కానీ రచయితలలో క్రితం తరం చూపించిన నిబద్ధత, సామాజిక స్ఫూర్తి తగ్గిపోతున్నాయి. ఒక కథ రాసే ముందు పడే కష్టం అంటే..  గ్రంథ పఠనం, సాహిత్యం మీద అవగాహన... ఇత్యాదులు ఏమి లేకుండానే కథలు రాసేస్తున్నారు. అందుకే మంచి కథల శాతం తగ్గుముఖం పట్టింది.

కాని.. రేపటి పరిస్థితి ఏమిటి?

ఒక్కసారి ఈనాటి పరిస్థితిని గమనిస్తే, తెలుగు కథకి చాల గడ్డురోజులు కనబడుతున్నాయి. యువతలో తెలుగు చదివేవారు, రాసేవారు కనబడటం లేదు. అనుభవాలు, అనుభూతులను రుచి చూసే వారే లేరు. అసలు రుచి చూడ్డానికి టైము ఉండటం లేదు. ఒకవేళ టైము ఉన్నా.. ఆ మాటలకి అర్థం కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయి. ప్రకృతిని అనుభవించడం, సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకోవడం.. వంటి గుణాలు మనిషికి దూరం అవుతున్నాయి.  ఇంతకంటే పెద్ద ప్రమాదం .. తెలుగు భాషని మరుగున పడేసే ప్రయత్నాలు ప్రభుత్వమే చేపట్టింది.  మరి ఇలాంటి పరిస్థితులలో తెలుగు కథ, కవిత రేపు ఉంటాయా? ఉండాలంటే ఎం చెయ్యాలి?

ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన తెలుగులో చేస్తూ, వారికి పాఠాలతో పాటు కథలు చెపుతూ, కనీసం ఐదో తరగతి స్థాయిలో వ్యాసాలు రాయించాలి. ఇది ఒకప్పుడు మన విద్యావ్యవస్థలో ఉండేది. రానురాను ఆ వ్యవస్థ మూల పడిపోయింది. అలాగే ఇంట్లో పెద్దవాళ్ళు, ఆ వయసులో పిల్లలకి కథలు చెపుతూ, వాళ్ళచేత చెప్పిస్తూ, కథల మీద ఆసక్తి, వాటి ప్రభావం వారి మీద కనబడేలా ప్రయత్నాలు చెయ్యాలి. ఈ ప్రక్రియ వలన నడవడిక, మంచి అలవాట్లు కూడా పిల్లలకి వస్తాయి. అవి అబ్బుతాయాని అడిగితే.. ఋజువు, తార్కాణం మన ముందు తరాల వాళ్లే! అలా వారికి కథ మీద ఆసక్తి కలిగిస్తే, కొంతవరకు ఈ సమస్యకి పరిష్కారం కనబడుతుంది.

కాని మారిన సాంకేతిక, కాలమాన పరిస్థితులలో.. ఈ పద్ధతి వలన ప్రయోజనం ఇరవై ముప్పై శాతం కంటే ఎక్కువ ఉండకపోవచ్చు!

పూర్తి శాతం మార్పు కావాలంటే మేథోమథనం జరగాలి!

ఇక్కడో విషయాన్ని మనం గమనించాలి. సాహిత్యానికి తోబుట్టువు సంగీతం. అయితే సుమారుగా శాస్త్రీయ సంగీతానికి 1900 నుంచి 1980 వరకు మన తెలుగు ప్రాంతాల్లో ఆదరణ అంతంత మాత్రమే ఉండేది. ముఖ్యంగా సంగీతానికి ఊపిరినిచ్చే కృతులు, కీర్తనలన్నీ తెలుగు భాషలో ఉన్నాసరే, సంగీతం చాల కొద్దిపాటి జనాన్నే, ముఖ్యంగా పండితులనే ఆకర్షించేది. కొన్ని సామాజిక వర్గాల వారే సంగీతాన్ని ఆదరించే వారు. వారే సంగీతాన్ని అభ్యసించేవారు. తెలుగు వారి కంటే తమిళీయులు సంగీతానికి ఎక్కువ ఆకర్షితులై, ప్రాధాన్యత ఇచ్చి, పెంచి పోషించారు, పోషిస్తున్నారు కూడా. ప్రస్తుతం తెలుగుభాషలో ఉన్న కృతులు, కీర్తనలని, తమిళ భాషలోకి తర్జుమా చేసో, కొత్తవి రాసో.. మొత్తం మీద తెలుగు భాషకి గండికొట్టే ప్రయత్నాలు ఉన్నాయి. సరే.. ఆ విషయం పక్కన పెడితే, మన తెలుగువారిలో కూడా అనూహ్యంగా సంగీతం మీద మక్కువ, ఆదరణ 1980 తర్వాత పెరిగింది. కారణం.. ఓ విధంగా సినిమాల ప్రభావం. అందులో 'శంకరాభరణం' సినిమా.. తెలుగువారి ఆలోచనా సరళి పైన ప్రభావం చూపించింది. ముఖ్యంగా పిల్లలకి సంగీతం నేర్పాలనే ఆలోచనలు చోటు చేసుకున్నాయి. దానికితోడు టివి కార్యక్రమాలు బాగా సహకరించాయి. ఇప్పుడు వేల సంఖ్యలో పిల్లలు సంగీతాన్ని అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం సహకరించక పోయినా సరే, ప్రవేటు రంగంలో వస్తున్న ఆదరణ.. మరో వంద సంవత్సరాల వరకు సంగీతానికి ఢోకా లేని పరిస్థితులు నేడు కనబడుతున్నాయి. ఒకప్పుడు సంగీతం జీవనానికి ఓ అలంటనగా ఉండేది గాని, ఈ రోజు పూర్తిగా, సంగీతమే జీవనాధారంగా కూడా మనిషి జీవితాలను ఆదుకుంటోంది.

ఆ పరిస్థితి సాహిత్యానికి కనబడటం లేదు. ఈ దుస్థితి నుంచి బయటపడే అలోచనలు చెయ్యాలి. ఇది తెలుగుజాతి మనుగడే కాదు, యావత్తు మనిషి మనుగడకు అవసరం.

ఆ ఆలోచనలు చేస్తే, మన ముందు ఈ ప్రశ్నలు కనబడతాయి.

నేటి కథని రేపటికి అందించే మార్గాలు ఏమిటి?

నేటి తరం వాళ్ళల్లో కథలు రాసే ఓ జిజ్ఞాస కలిగించే మార్గం ఏమిటి?

ప్రాథమిక విద్యావ్యవస్థలో తగిన ప్రాధాన్యత కల్పిస్తే, రచనలు చేసే అభిరుచి మెదడులో చోటు చేసుకుంటుందా?

సంగీతానికి రియాల్టీ షో ల ద్వారా చాలా ఆదరణ వచ్చినట్టు, రచనలు చేయడానికి అలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయా? ఉపయోగపడితే వాటి రూపకల్పన చేయడానికి ఎవరు ముందుకు రావాలి?

అసలు మనం మన మాతృభాషలో చదువుకోకపోయినా సరే.. మనం ఇంట్లో మాట్లాడుకునే భాషతో, తెలుగు భాష, సాహిత్యం నిలబడి బట్ట కడుతుందా? ఈ వాదనలో పస ఎంతుంది? పిల్లలు ఇంట్లో కూడా తెలుగులో మాట్లాడితే సహించలేని ఇంగ్లీషు స్కూళ్ళు, తెలుగు మాట్లాడినా, లిపి రాక ఆ మాటల్ని ఇంగ్లీషులో రాసుకునే ఔత్సాహికులు తిరుగాడే ఈ నేల మీద.. మన భాషకి ఢోకా లేదనే వాదనలు నేతిబీరకాయ వ్యవహారం కాదా??

ఇవన్నీ తెలుగు మాట్లాడే ప్రతీవాడి ముందు ఉన్న ప్రశ్నలు. అయితే ఏ ఒక్కరి వలననో, ఇది సాధ్యమయే విషయం కాదు!

తెలుగు కథని నిలబెట్టడానికి ఈ సమస్యల మీద మేధోమథనం జరగాలి. ఇదో ఉద్యమంలా సాగితే గాని, తెలుగు కథకి రేపు అనేది కనబడటం లేదు.  ఈ, తెలుగుజాతిని మనసారా వేడుకుంటున్నది.. ఒక్కటే తెలుగు భాషని, తెలుగు కథని నిలబెట్టండి. రేపటి మానవాళి ఉనికికి, జీవనానికి ఇవాళ ఊపిరి పోయ్యండి! స్వస్తి!!

{2020 అక్టోబర్ 10-11 తేదీలలో 'వంగూరి ఫౌండేషన్, అమెరికా' వారు అంతర్జాలం లో నిర్వహించిన ఏడవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో భవదీయుని ప్రసంగ పాఠం.}

**సంపాదకులు**

# విశిష్ట అతిథి



## శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి గారు

విజయా వారి "మిస్సమ్మ" సినిమా గురించి తెలియని వారు గాని, చూడని తెలుగువారు గాని ఉండరు. జనరంజకమైన ఆ అద్భుతమైన సినిమాని ఓ నాటకంగా ప్రదర్శిస్తే ఎలావుంటుందనే ఓ వినూత్నమైన ఆలోచన రావడమే ఊహాకందని విషయం! ఆ మెరుపు మెరవగానే, కావలసిన అనుమతులు, దిగుమతులు గట్రా ముగించి 'స్టేజ్ ప్లే' రాయడం, రాసింది అమెరికాలోని తెలుగువారి "సరసిజ థియేటర్" ద్వారా, న్యూయార్క్ లో జరిగిన ఇంటర్నేషనల్ థియేటర్ ఫెస్టివల్లో ప్రదర్శించడం, ప్రదర్శించిన ఆ తెలుగు నాటకం ఆబాలగోపాలాన్ని ఆకట్టుకోవడం, అక్కడ ఆకట్టుకుని యూట్యూబ్ లో నిరంతరం ఆదరణ పొందుతుండటం.. సామాన్య విషయం కాదు. ఆ ఆలోచనలకి వెనుక ముందు ఉండీ, అక్షర రూపం ఇచ్చి, రంగస్థలానికి అందించే సాహసం చేసి, విజయదుంధుభి మ్రోగించిన తెలుగు మేటి రచయిత్రి శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి గారు. ఆ సాహసం వెనుక రెండు వందల నాటకాలు రచించిన అనుభవం, పాతిక వరకు నవలలు, వందల్లో కథలు కురిపించి, ఆబాలవృద్ధాన్ని అలరించిన అపారమైన రచనానుభవం ఉంది. ఇవే కాకుండా.. రేడియో, రంగస్థల నాటకాలు, టివి సీరియల్స్, కాలమ్స్... ఇలా ఒకటేమిటి.. సవ్యసాచిలా తెలుగు సాహిత్య ప్రక్రియలలో కలం తిప్పి, ఆరితేరిన రచయిత్రి శ్రీమతి విజయలక్ష్మి గారు.

"మా నాన్నగారు కీ.శే. ఏ.ఎల్. నరసింహారావు గారు జర్నలిస్టు, రాయిస్ట్ కూడా. మా ఇంటినిండా పుస్తకాలుండేవి. మా అమ్మగారు సాధరణ గృహిణే.. కాని పుస్తకాలు విపరీతంగా చదివేవారు. అలా నాకూ చిన్నప్పుడు ఇంట్లో ఉన్న వాతావరణం వలన చదవడం అలవాటయింది. కాని వారపత్రికలు, నవల్లు చదువుతుంటే ఇంట్లో దెబ్బలాడేవారు... స్కూలు చదువులు పాడవుతాయని! వాటిని క్లాసు పుస్తకాల్లో పెట్టుకుని చదివేదాన్ని. ఇలా మా కుటుంబ వారసత్వంగా రచనలు చేయడం వచ్చిందనుకుంటాను.

పదహారో ఏటే రాయడం అలవడింది!" అంటూ తన రచనా వ్యాసంగానికి ఎక్కడ బీజం పడిందో చెప్తారు శ్రీమతి విజయలక్ష్మి గారు.

జన్మభూమి తెనాలి.. పెరిగి, పెద్దై, పబ్లిక్ రిలేషన్స్ లో డిగ్రీ చదివింది హైదరాబాదులో! ఆ తర్వాత తెలంగాణా రాష్ట్రప్రభుత్వ జలమండలిలో ఉద్యోగం చేసి, అధికార హోదాలో పదవీ విరమణ చేసి, హైదరాబాద్ లోనే స్థిరపడ్డారు.

"నాకు ఏదైనా కథావస్తువు దొరికినప్పుడు, బాగా ఆలోచించి కథ రాస్తాను. ఆ కథ మొదలు, నడత, ముగింపు.. ఇత్యాది విషయాలని జాగ్రత్తగా చూస్తాను. ఆ కథ పూర్తిగా నాకు సంతృప్తిని తీసుకొచ్చేవరకు ఎక్కడకి పంపను. అందుకే పోటీలకి కథలు ప్రత్యేకంగా రాయను!" అంటూ కథ మీద తనకున్న నిబద్ధత గురించి చక్కగా వివరిస్తారు. లక్కపిడతలు, మేరీ ఆవాజ్ సునో, వానప్రస్థం, సెంటి మెంటు, నిర్ణయం, మాతృభాష, మహానటుడు, గర్భగుడి, దొంగకోళ్లు, అ ఆ ఇ ఈ... వంటి కథలతో, అపూరూప కథలు, అపూర్వ కథలు, ఒప్పందం, ఆనాటి చెలిమి ఒక కల.. మొదలగు కథా సంపుటాలు వెలువరించారు.

"చిన్నప్పుడు మా నాన్నగారితో నాటకాలు చూడ్డానికి వెళ్లేదాన్ని ఆ నాటకాలు చూస్తూ తన్మయం చెందడమే కాకుండా, అక్కడ వినబడే చప్పట్లు నన్ను చాలా ఉత్తేజపరచాయని చెప్పాలి. ఆ ఉత్తేజమే నాటకాలు రాయడానికి దోహదపడింది. కథకు ఉన్న పరిధి చిన్నది. నాటకం అంటే పాత్రలద్వారా రంగస్థలం మీద కథని సంభాషణలతో చెప్పించడం.. ఇది కష్టం, కాని నాకిష్టం! అందుకే ప్రయత్నం చేసా... విజయం సాధించాను! ఈ విషయంలో కళాకృష్ణగారు నాకు శిక్షణ ఇచ్చారు. చెప్పవలసిన విషయం, సమయం, స్థలం, హావభావలద్వారా సంభాషణలు చెప్పించడం... ఇలా నాటకం రాయడంలో ఎన్నో కోణాలు చూసుకోవాలి! ఆ కోణాల్లో ఆలోచించి, అలవాటు పడి, ఎన్నో నాటక ప్రదర్శనలు చూసి, ఆకళింపు చేసుకుని నాటకాలు రాసాను!" అంటూ తన నాటక రచనల ప్రస్థానం గురించి చెప్పుకొస్తారు. ఈ రకంగా తెలుగులో నాటకాలు రాసిన రచయిత్రులని వేళ్ళ మీద లెక్కెట్టుకోవచ్చు. ఆ కోవలో... ఉత్తరం, స్పర్శ, మ్యాచ్ ఫిక్సింగ్, రంగస్థలం, మేమూ మనుషులమే, మిస్సమ్మ, అనగనగా ఓ రాజకుమారి, ద్రౌపది, హ్యాంగ్ మీ ప్లీజ్, వంటి విజయలక్ష్మిగారు రచించిన రెండువందల పై చిలుకు నాటకాలతో పలు నాటకసంపుటలు కూడా వెలువడ్డాయి. ఇందులో మ్యాచ్ ఫిక్సింగ్ నాటకం గొప్ప హాస్య నాటికగా వందల్లో ప్రదర్శనలు జరుపుకుంది. దత్తపుత్రుడు, మహావృక్షం, అమావాస్య తార, తెల్లగులాబి, శ్రీకారం, రెప్పపాటు నీడలు.. మొదలగు నవలలతో పాటు, టీవి ధారావాహికలు, టెలి ఫిలిమ్స్, వంటివి ఎన్నో.. విజయలక్ష్మి గారి కలంనుంచి జాలువారినవే. వీరి అనేక కథలు కన్నడ, హిందీ, ఇంగ్లీషు, తమిళ భాషల్లోకి అనువదించబడ్డాయి. ఉత్తమ రచయిత్రిగా, ఉత్తమ నాటక రచయిత్రిగా చాలా పురస్కారాలు వచ్చాయి. "లేఖిని" రచయిత్రుల వేదిక ముఖ్య కార్యదర్శిగా, సరసిజ థియేటర్ వ్యవస్థాపక అధ్యక్షురాలిగా ఇతరత్ర ఎప్పుడూ క్రియశీలక కార్యక్రమాలలో బిజీగా ఉండే విజయలక్ష్మి గారు.."యువరచయితలు సమకాలీన సమాజాన్ని అధ్యయనం

చేయాలి, సమాజానికి హితం చేసేలా రచనలు చెయ్యాలి, చెడులోంచి మంచి చూపాలి, చెడుని పాఠకుడిపై రుద్దకూడదు. రంగనాయకమ్మ గారి రచనల ద్వారా, ఆమె సృష్టించిన పాత్రల ద్వారా ప్రేరణపొంది ఎంతోమంది రచయితలు పుట్టారు... నేను కూడా! తెలుగు కథ, తెలుగు సాహిత్యం నిలబడి పదికాలాల పాటు మనిషి ఉనికిని కాపాడాలంటే మంచి రచనలు చేయ్యాలి. పోటీలు మంచివే, కాని పోటీల వలన ఉత్తమ రచనలు రావడం మాట అటుంచి, 'ఉత్త' రచనలు, 'ఉత్తమ' రచనలుగా నమ్మించే ప్రమాదం ఇప్పుడు కనబడుతోంది. ఇది మంచి పరిణామం కాదని యువరచయితలు గుర్తుంచుకోవాలి!" అంటూ సున్నితంగా సూచనలు చేస్తారు.

ఇలా.. ఎంత చెప్పుకున్నా ఇంకా చెప్పవలసిన ఎన్నో గొప్ప గుణాలున్న శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి గారు "కథామంజరి" కోరిన తడవుగా పెద్దమనసుతో ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసి, ముప్పాళ రంగనాయకమ్మ గారి గురించి వివరణాత్మకమైన వ్యాసాన్ని అందించినందులకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. మరిన్ని కథలు, నవలలు, నాటకాలతో తెలుగు సాహితీ ప్రియులను చిరకాలం అలరింపగలరని ఆశిస్తున్నాం

**కథామంజరి బృందం**

## కథా మార్గదర్శి



# రంగనాయకమ్మ గారు

చలం నుంచి నేటి తరం రచయితల దాకా ఎందరో స్త్రీ అభ్యుదయానికి, స్త్రీ స్వేచ్ఛా, స్వాతంత్ర్యం కోసం తమ రచనల ద్వారా కృషిచేసిన సాహితీ మూర్తులలో కేవలం రచయితలే కాదు, రచయిత్రులు కూడా అనేక మంది ఉన్నారు. అలాంటి వారిలో, నాటి ఛాందస భావజాల వ్యవస్థ మీద తిరుగుబాటు చేసిన అభ్యుదయ రచయిత్రి ముప్పాళ రంగనాయకమ్మగారు అగ్రశ్రేణిలో నిలబడతారు. స్త్రీ అస్తిత్వవాద , అభ్యుదయవాద రచయిత్రి రంగనాయకమ్మ నాటి నుంచి నేటి వరకు తను నమ్మిన సిద్ధాంతాల పట్ల బలంగా, స్థిరంగా నిలబడి రాజీలేని రచయిత్రిగా ఆధునిక సాహిత్యంలో మకుటాయమానంగా నిలిచారు. ఒక దశాబ్దంలో ఆధునిక యువతులెందరికో ఆమె ప్రేరణ...ఆమె ఒక మార్గదర్శి.. ఇంటికి మాత్రం పరిమితమైపోయి, సంప్రదాయాలు, ఆచారాల సంకెళ్ళలో నిరంకుశంగా నలిగిపోయిన నాటి యువతులకు ఆమె ఒక కరదీపిక.

మార్క్స్ భావజాలాన్ని అణువణువూ జీర్ణం చేసుకుని, మార్క్సిజం వ్యాప్తి చేయడానికి శాయశక్తులా కృషిచేసిన గొప్ప ఆధునిక భావాలుకల రచయిత్రి. ఆమెని స్త్రీలు ఎంతగా అభిమానించారో, కొందరు పురుషులు కూడా అంతే అభిమానించారు. కొందరు ఆమె రచనలు విశృంఖలత్వాన్ని ప్రేరేపిస్తున్నాయి అని, ఆమె రచనల ప్రభావంతో భార్యలు తమ మీద తిరగబడుతున్నారని ప్రతిఘటించడం కూడా జరిగింది. ఆమె రచనల పట్ల, ప్రశంసలను ఎంత హుందాగా స్వీకరించారో, విమర్శలను కూడా అంతే హుందాగా

స్వీకరించారు. తానూ చెప్పదలచుకున్న విషయాలను కుండ బద్దలు కొట్టినట్టు నిర్మొహమాటంగా చెప్పి "అమ్మో! ఆవిడతో జాగ్రత్తగా మాట్లాడాలి" అని విమర్శకులను కూడా కించిత్తు వణికించేలా చేసిన రచయిత్రి ఆమె. .

నిజానికి సమాజాన్ని మార్చాలన్నా, తీర్చి దిద్దాలన్నా ఒకే ఒక ఆయుధం సాహిత్యం.. కథ, నవల, నాటకం ఇవి సమాజం మీద చూపించే ప్రభావం అసాధారణం అన్న వాస్తవం మనకి నాటి మాలపల్లి, కన్యాశుల్కం, వరవిక్రయం లాంటి నవలల ద్వారా మాత్రమే కాక ఆధునిక స్త్రీ సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో రంగనాయకమ్మ రచనలు ఆధునిక స్త్రీల మీద అంతులేని ప్రభావం చూపాయి అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

స్త్రీలు విద్యావంతులై, గడపదాటి ఉద్యోగాల పేరుతొ బయట ప్రపంచాన్ని చూడడం ప్రారంభించిన కొత్తల్లో లభించిన స్వేచ్ఛతో కొంచెం ఉక్కిరిబిక్కిరి అయారు.. ఉద్యోగం చేయడానికి లభించిన స్వేచ్ఛ పరిపూర్ణం కాలేదు.. ఆర్ధికపరమైన మరికొన్ని నిబంధనలు ఆమె నిబంధనల లిస్టులో చేరాయి. అదనపు బాధ్యతలు ఆమె భుజాల మీద చేరాయి. జీవితంలో సుఖం, శాంతి మృగ్యం అయాయి.. ఆ సమయంలో తనకేం కావాలి? తనేం చేయాలి? తనకి లభించినది నిజంగా స్వేచ్ఛనా! స్వేచ్ఛ పేరుతొ మరింత నియంత్రణ మొదలైందా! గృహిణిగా, తల్లిగా మోస్తున్న బాధ్యతల్లో ఉద్యోగ బాధ్యత కూడా చేరిందా! ఇలాంటి ఒక సంకట స్థితిని ఆమె ఎదుర్కొంది. అలాంటి పరిస్థితుల్లో స్త్రీని చైతన్యవంతం చేస్తూ, ఆమెని అభ్యుదయపథం వైపు చేయిపట్టి నడిపించిన రచయిత్రి రంగనాయకమ్మ.

నేను రంగనాయకమ్మ గారి కథలు చాలా తక్కువగా చదివాను.. నాకు తెలిసి నవలా రచయిత్రిగానే ఆవిడ సుప్రసిద్ధురాలు. ముఖ్యంగా నాటి కులవ్యవస్థ మీద ఎక్కు పెట్టిన బాణం " బలిపీఠం" సృష్టించిన సంచలనం మామూలు సంచలనం కాదు. అలాగే స్త్రీ వ్యక్తిత్వాన్ని ప్రశ్నించిన నవల రచయిత్రి... చదువుకున్న అమ్మాయి ఒక సనాతన సంప్రదాయాల మధ్య అనాగరికంగా జీవిస్తున్న మనుషుల మధ్యలోకి కోడలుగా వచ్చినా, ఆ చదువుకున్న యువతి ఆ ఇంట్లో తెచ్చిన సంస్కరణలు నేపథ్యంగా వచ్చిన నవల 'చదువుకున్న కమల'. ఆనాటి, ముఖ్యంగా బ్రాహ్మణ కుటుంబాల మనస్తత్వాలు, జీవన విధానం ఎంతో వాస్తవికంగా చిత్రించిన నవల.. అలాగే కృష్ణవేణి, నర్తకి, అంధకారంలో .. ఒకటేమిటి ఆ రోజుల్లో ఆమె రాసిన ప్రతి నవల ఒక సంచలనం..

స్త్రీ స్వేచ్ఛకీ, సంప్రదాయాలకి, ఆర్థిక స్వావలంబనకి ఘర్షణ మొదలైంది.. సనాతన, ఆధునిక భావజాల ఘర్షణ, కుటుంబానికి, వ్యక్తిగత ఎదుగుదలకి మధ్య ఘర్షణ. ఇలాంటి ఘర్షణ నిండిన స్త్రీల జీవితాల్లోని సమస్యలకు తన రచనల ద్వారా పరిష్కారాలు ఇచ్చి, స్త్రీని అభ్యుదయం వైపు నడిపించిన రచయిత్రి

రంగనాయకమ్మ. ఆవిడ నవలల్లో చర్చలు చాలా పదునుగా ఉంటాయి.. సంభాషణలు చురకత్తుల్లా ఉంటాయి. అలాగే ఆవిడ చక్కటి హాస్యం కూడా రాయగలరని 'స్వీట్ హోమ్' నవల చదివితే తెలుస్తుంది. ఆవిడ రాసిన 'ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది' అనే పెద్ద కథ కూడా సున్నితమైన హాస్యాన్ని అందించింది. ముఖ్యంగా మా ఊళ్ళో గాలి దేవుడు వచ్చి వాకిళ్ళు ఊడిచి వెళ్తాడు.. వానదేవుడు కళ్ళాపి చల్లుతాడు అని స్నేహితురాలు మరో స్నేహితురాలితో చెప్పినపుడు, ముగ్గు దేవుడు వచ్చి ముగ్గేసి వెళ్తాడా అని ఆ స్నేహితురాలు అడగడం నేను మర్చిపోలేనిది.

రంగనాయకమ్మ చదువుకున్నది ఎస్ ఎస్ ఎల్సీ అయినా ఆమె విషయ పరిజ్ఞానం, అపారం .. ఆమె ప్రేమకథలు లేదా సంసారపక్షమైన రచనలు చేసే సాధారణ రచయిత్రి కాదు.. చదివిన దాన్ని లోతుగా అర్ధం చేసుకుని, విశ్లేషించుకుంటూ అందులోని సారాంశాన్ని జీవితానికి అన్వయింప చేసుకునే వివేకాత్మక రచనలు చేసారు.. నీతి కథలు కాదు... కానీ అంతర్గతమైన, అర్ధవంతమైన సందేశం కథలో లీలగా కనిపించి, మనసులని సున్నితంగా తట్టి లేపేవి. అలాంటి రచయిత్రి నాకు అభిమాన రచయిత్రే కాదు... నా మార్గదర్శకురాలు కూడా.. ఆమె రచనల ప్రభావం నా మీద ఎంత ఉందో నాకు మాత్రమే తెలుసు.

శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి

***0***

## దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



# ఇచ్చిచూడు

సింహప్రసాద్

మేఘునని కలిసి, అటోఇటో తేల్చుకోడానికి బయలుదేరాను.
కారు బయటికి తీస్తూ యథాలాపంగా పక్కింటి వరండాలోకి చూశాను.
రోజులాసే పెద్దాయన నావంకే చూస్తున్నాడు. ఆ చూపులో ఎలాంటి భావం వున్నట్టు అన్పించదు. మరెందుకలా చూస్తుంటాడు? ఏదైనా కావాలేమో అడిగితే?
అబ్సర్డ్. డూప్లెక్స్‌లో ఒంటికాయ సొంటికొమ్ములా వుంటున్నాడు. నౌకర్లూ, చాకర్లూ వున్నారు. రిచ్ మ్యాన్ అని తెలుస్తూనే వుంది. అతడికి కావల్సిందేదైనా సరే చిటికెలో తెప్పించుకోగల సామర్థ్యం వుంది. ఒకవేళ అతడికేమైనా కావల్సినా, తనేం ఇవ్వగలడు! అతడికి లేనిది నా దగ్గర చచ్చినా వుండదు!
నాకు తెలీకుండానే నిట్టూర్చి గేరు మార్చాను.
'ఎన్నడూ లేనిది ఆయన గురించెందుకిలా ఆలోచిస్తున్నాను? ఎప్పుడూ హడావిడిగా వెళ్ళే నేను, మేఘున నుంచి ఎలాంటి సమాధానం వస్తుందోనని టెన్షన్‌గా వున్నందునా? పోనిద్దూ!'

ప్రయాణ సన్నాహంలో వుంది మేఘున. నిజంగానే ముంబై వెళ్తోందన్నమాట.
నన్ను చూస్తూనే పలకరింపుగా నవ్వి వచ్చింది. ఆమె నవ్వు వెన్నెల్లా హాయిగా వుంటుంది. ఆమె ముఖంలో కోపం విసుగు ఎన్నడూ చూళ్ళేదు. ఏసమయంలో చూసినా ఆమె కళ్ళల్లో అభిమానం, ఆప్యాయత చిందులేస్తుంటాయి. ఆమెలో ఏదో తెలీని ఆకర్షణ వుంది. ఎలాంటి వారినైనా మెస్మరైజ్ చేసే శక్తి వుంది! అసలందుకనే ఆమెను ప్రేమించాను!
బాల్కనీలో కూర్చుని, టీ తాగుతుండగా అన్నాను. "నీ డెసిషన్ కోసం వచ్చాను. పాజిటివ్‌గా వుంటుందని ఎక్స్‌పెక్ట్ చేస్తున్నాను!"
నా వంక సూటిగా చూసింది. గంభీరంగా వుందామె చూపు. కలవరపడ్డాను. ఇది కొత్తగా వుంది. కొంపతీసి కోన్‌కిస్కాగాడ్నెవడ్నో ప్రేమించానని చెప్పదు కదా?!
"నీ ప్రేమని కాదనటం లేదు రిషీ. నువ్వంటే నాకు ఇష్టమే. కాని పెళ్లికి ఇష్టమొక్కటే చాలదు"

“మరింకేం కావాలేంటి?” వ్యంగ్యంగా నవ్వబోయి మింగేశాను. “నాకు జాబ్ వుంది. మంచి ఆదాయం వుంది. ఈ మధ్యే డూప్లెక్స్ కొన్న సంగతీ నీకు తెలుసు. వీటన్నిటినీ మించి ఎలిజిబుల్ బ్యాచిలర్ని. ఇంకేం కావాలంటావ్?” నా స్వరంలో కించిత్తు విసుగు ధ్వనించింది.

ఒక నిర్ణయానికొస్తున్నట్టు తల పంకించి అంది. “అమ్మాయిలు అందంగా వుంటే చాలు అబ్బాయిలు ప్రేమించెయ్యగలరు. మేం అబ్బాయిల్లో అందంకన్నా, వ్యక్తిత్వానికి ప్రిఫరెన్స్ ఇస్తాం. ప్రత్యేక లక్షణాలు చూస్తాం. సూదంటురాయిలా ఆకర్షించే ఒక సుగుణం, ఒక ప్రత్యేకత, స్పార్క్‌లా వెలిగేదీ, హీరోయిక్‌గా అన్పించేదీ వుండాలని ఆశిస్తాం”

“అవి నాలో లేవంటావ్?” అవమానంగా ఫీలవుతూ అడిగాను.

“ఉన్నాయి. నీలోనే కాదు చాలా మందిలో వున్నాయి. వాళ్ళెవర్లో లేనిది నీలో ఏముంది? నిన్నే ఎందుకు ఎన్నుకోవాలి? నీలో ఏం స్పెషాల్టీ వుందని?”

నవ్వాను.

“నిన్ను గాఢంగా ప్రేమిస్తున్నాను. అది చాలదూ! నీ కాలు కందకుండా చూసుకుంటాను. రోజూ, రోజా పూలతో పూజ చేస్తాను. నీకెలాంటి కష్టం రానివ్వనని, నీ కంట కన్నీటి చుక్క ఒలకనివ్వనని హామీ ఇస్తున్నాను”

“బీప్రాక్టికల్ మ్యాన్…” నవ్వింది.

పెదవి కొరుక్కున్నాను. “సినిమాల్లోలా నలుగురు రౌడీల్ని చితగ్గొట్టాలా?”

“అలాంటి పనికి పోలీసులున్నార్లే”

“ఏదైనా గొప్ప సాహసం చేయాలా?”

“నువ్వు తోటరాముడివీ కాదు, నేను రాకుమారినీ కాదు” పెదవి విరిచి నవ్వింది.

“నవ్వితే కాదు. ఇంకేం చేయాలనుకుంటున్నావో సూటిగా చెప్పు”

“ఇవ్వటం, దానం చేయడం, సాయపడటం లాంటిదేదైనా నీకు తెలుసా రిషీ, సంపాదించడం కన్నా దానం చెయ్యడం నాలుగు రెట్లు ఎక్కువ కష్టమంట!”

“ఎడం చేత్తో దానాలు చెయ్యడానికి నా దగ్గరేం మూటలు మూల్గటం లేదు. అప్పు చేసి ఇల్లు కొన్నానని మర్చి పోకు”

“జస్ట్ ఎగ్జాంపుల్‌గా చెప్పాను. డబ్బే కాదు నీ దగ్గర అధికంగా వున్నది, అవసరం లేనిది ఏదైనా ఇవ్వొచ్చు. నీకీ సంగతి తెలుసా? మనకి ఏం వచ్చిందో దానితో బతుకుతామట. మనం ఏం ఇచ్చామో దానితో జీవిస్తామట!”

“కొటేషన్ బావుందిగాని, నీ ఆలోచనల్లో క్లారిటీ వుంటే నాకు క్లియర్ కట్‌గా చెప్పు. నాలో వుందో లేదో, నాకు సాధ్యమవుతుందో లేదో వెంటనే చెప్పేస్తాను”

“ఇవ్వడానికి మనస్సుండాలి గాని ఏదైనా, ఎలాగైనా ఇవ్వొచ్చు. ఇతరులకు ఉపయోగపడేదేదైనా ఇవ్వొచ్చు. మాట సాయం చేయొచ్చు. కష్టాల్లో ఆదుకోవచ్చు. ఓదార్పునివ్వొచ్చు. మంచి పనికి సపోర్టుగా నిలవ్వొచ్చు. డొనేట్, షేర్, శాక్రిఫైస్, హేండోవర్, గివింగ్ - విలువైంది, ఉపయోగపడేది ఏదైనాసరే, ఎలా ఇచ్చినా ఒకేనే. ఏదో ఒకటి రెండు సార్లు ఇచ్చి చేతులు దులుపుకోవడం కాదు. అదో అలవాటుగా లక్షణంగా విశిష్టగుణంగా అలవర్చుకోవాలి. మన దగ్గర నిరుపయోగంగా పడివున్నది మరొకరి ప్రాణావసరం తీర్చొచ్చు కదా!”

సర్రున లేచి నిలబడ్డాను “సో.. నా ప్రపోజల్ తిరస్కరిస్తున్నావు”

“ఎందుకలా కన్‌క్లూజన్‌కి వచ్చేస్తావు? నా అభిప్రాయం గురించి సీరియస్‌గా ఆలోచించొచ్చుగా!”

“చించడానికి ఇంకేం మిగల్లేదు. ‘నాక్కాబోయే భర్త జోవియల్‌గా ఉండాలి. ఎప్పుడూ నవ్విస్తూ నన్ను మంచి మూడ్‌లో ఉంచాలి. అబద్ధాలు చెప్పకూడదు’ అంటూ ఇంత పొడుగు కబుర్లు చెప్పే నటీమణుల్లా మాట్లాడుతున్నావు. అలా అన్నవాళ్ళు రెండో పెళ్లివాడ్నో, నడివయస్సు దాటిన వ్యాపారవేత్తనో చేసుకున్నారనీ, రెండు మూడేళ్ళకే ఆ పెళ్ళిళ్ళు పెటాకులయ్యాయని నువ్వు గుర్తిస్తే మంచిది. కలలు వేరు. కబుర్లు వేరు. వాస్తవం వేరు!” ఉక్రోష పడ్డాను.

“వాళ్ళ సంగతి మనకనవసరం. నీలోని ఫలానా క్వాలిటీకి ఇంప్రెస్ అయ్యానని జీవితాంతం సంతృప్తి పడాలి. అలాంటిది అలవర్చుకోడానికి ప్రయత్నించకూడదూ! నా కోసమే కాదు.., అది నువ్వు ఉన్నతుడిగా ఎదగడానికీ ఉపయోగిస్తుంది!”

“మనిషనే వాడెవడికీ అన్ని గుణాలు సాధ్యం కాదు. నేను కాదు, నువ్వే ప్రాక్టికల్‌గా ఆలోచించట్లేదు!”

“రాముడికి పదహారు కళ్యాణ గుణాలున్నాయిట!”

“అవి పుక్కిటి పురాణాల్లే! సారీ మేఘనా. నీ గొంతెమ్మ కోర్కెలు తీర్చడం నాకు సాధ్యం కాదు బై..!”

విసురుగా వచ్చేశాను. ఆమె నిలువునా ఆశ్చర్యపోయి వుంటుందని వుహించగలను. మెల్లగా నేనేంటో తనే తెలుసుకుంటుందిలే!

నిజానికి ఆమెకలాంటి షాక అవసరమే. తనేదో ఆకాశంలోంచి స్పెషల్‌గా దిగి వచ్చాననుకొంటోంది పాపం!! ఎక్సైటింగ్ క్వాలిటీ వుండాలిట! తనకేం వున్నాయో!

అందమైన రూపం, చదువు, ఉద్యోగం తప్ప ఇంకేమున్నాయి? ఫోటోల కోసం, పబ్లిసిటీ కోసం అడపా దడపా సామాజికసేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ వుంటుందేమో. అదేం గొప్ప! పైసా విలువ లేని పని! తనకు మాలిన ధర్మం!

మనస్సు అస్థిరంగా వుంది. అటోఇటో ఎటో తిరిగి తిరిగి ఇంటికెళ్ళాను. కారు పార్కుచేసి పక్కింటి పెద్దాయన వంక చూశాను. గార్డెన్లో ఒక్కడూ పేము కుర్చీలో కూర్చుని నావంక ఆశగా చూస్తున్నాడు.

ఒకడుగు అటు వేసి, కారణం తెలుసుకుంటే? క్షణకాలం వూగిసలాడాను.

కాస్సేపు పిచ్చాపాటీ మాట్లాడితే, మనస్సరస్సులో మేఘన విసిరిన రాయి తాలూకు అలలు శాంతించి ప్రశాంత పడొచ్చనిపించింది.
గేటు తీసుకుని లోపలికెళ్తుంటే, పెద్దాయన సంభ్రమానికి లోనయ్యాడు. అపనమ్మకంగా చూసి, లోపలికెళ్ళి మరో కుర్చీ తెచ్చివేశాడు.
'కూర్చోవోయ్!" అన్నాడు.
"ఇంత పెద్ద ఇంట్లో మీరొక్కరే ఉంటున్నారా?"
తలాడించాడు. "ఒంటరితనాన్ని మించిన శాపంలేదు. అదీ ముదిమిలో"
"బామ్మగారు...."
"కారు యాక్సిడెంట్లో...!" ఆయన గొంతు వణికింది. కళ్ళు చెమర్చాయి.
"అయామ్ సారీ"
"సారీ ఎందుకు. నా బాధలకు నువ్వేం కారణం కాదుగా!"
"అఫ్కోర్స్..."
"ఎవరి బాధలకూ కారణం కాకుండా బతగ్గలిగినవాడే ఉన్నతుడు, ఉత్తముడు!"
ఉలిక్కిపడ్డాను. నిటారుగా అయ్యాను. ఈయనా మేఘనలానే మాట్లాడుతున్నాడు. ఇవాళ నాముఖం చూస్తే అందరికీ సుత్తి వేయాలన్పిస్తోందేమో!
లోపలికెళ్ళి మంచినీళ్ళ సీసా, బిస్కెట్ ప్యాకెట్లూ తెచ్చాడు.
"మీ పిల్లలు...."
"ఒకబ్బాయి. అమెరికాలో సెటిలయ్యాడు"
"అక్కడే అతడితో కలిసి వుండొచ్చుగా?"
"ఉండొచ్చు. కొన్నాళ్ళు ఉన్నాను. కానీ తొమ్మిదింటికల్లా మొగుడూ పెళ్లాలు ఆఫీసుకి వెళ్ళిపోతారు. రాత్రి ఎనిమిదివరకూ తిరిగిరారు. కాస్సేపు టీవీ, మరి కాస్సేపు ఖాళీ రోడ్డూ చూస్తూ కూర్చోవాలి. ఇక్కడైతే బంధువులో, మిత్రులో అప్పుడప్పుడైనా వచ్చి పలకరిస్తారని వచ్చేశాను!"
సానుభూతిగా చూస్తూ అన్నాను. "నేను బయటికెళ్ళేప్పుడూ, వచ్చేప్పుడూ నా వంక అదోలా ఎందుకు చూస్తుంటారో కనుక్కుందామని వచ్చాను. నేను, మీ అబ్బాయిలా వుంటానా?"
తల అడ్డంగా వూపి, "బిచ్చగాడిలా ఆశగా చూస్తుంటానా?" అన్నాడు.
"అహహ. అబ్బెబ్బే..." తడబడ్డాను.
"నువ్వేమనుకున్నా సరే, కరెక్టుగా చెప్పాలంటే అది నిజమేనయ్యా. వాళ్ళవి ఆకలిచూపులు. నావి ఆర్తి చూపులు!"
"మీకు బాధేంటి?! కర్మకాలి మీ బాధకి నేనేమీ కారణం కాదు కదా?" కొద్దిసేపటి క్రితం అతడన్న మాటల్ని గుర్తు చేసుకుంటూ అడిగాను.

“కాదు కాదు. ఒక్కోసారి బాగా ఆలస్యమైనా తరచూ ఆఫీసు నుంచి త్వరగానే వచ్చేస్తుంటావు. కాస్సేపు నాతో స్పెండ్ చేయొచ్చుగా అని ఆశ పడ్తుంటాను. నీ తోనే కాదులే. ఈ పక్కవారితో, ఎదురింటి వారితోనూ అలాగే చూస్తాను, ఎవరి వ్యాపకాలు వారివి. ఎవరి పనులు వారివి. అందరివీ బిజీ లైఫ్‌లే. పక్క వారి వంక తొంగి చూసే టైమూ లేదూ, మనస్సూ లేదు!” నిట్టూర్చాడు.

“యూ మీన్... మీకు కాలక్షేపంగాక...!”

నిలువుగా తలాడించాడు.

“ఓస్. ఈ మాత్రానికేనా అంత ఇదై పోతున్నారు. ఆఫీసు నుంచి పెందలకాడే వచ్చేసినప్పుడల్లా మీ ఇంటికొచ్చి మీతో కాస్సేపు కూర్చుంటాస్లెండి. కంపెనీ దొరికితే నాకూ హ్యాపీయేగా!”

గబుక్కున లేచొచ్చి నా చేతులు పట్టుకున్నాడు “దేవుడు పంపినట్లుగా వచ్చావు నాయనా!” భావోద్వేగంతో వూగిపోయాడు.

“ఛా...ఛా. ఈ మాత్రానికేనా తాతయ్యగారూ!! మీరిలా కూర్చోండి చెబుతా!” ఆయన్ని పట్టుకుని కుర్చీలో కూర్చోబెట్టాను. ఆ క్షణంలో ఆయన మా తాతయ్యేమో అన్పించింది. మా ఇద్దరు తాతలూ నా చిన్నప్పుడే చనిపోయారు. ఒకర్నైతే ఫోటోలోనే చూశాను!

నా కళ్ళల్లో సన్నని కన్నీటిపొర కదిలింది. ‘నావారు’ అనుకుంటే చాలు అనుబంధం తీగలా చుట్టేస్తుంది కాబోలు!

మేం నిజంగా తాతా మనవళ్ళమై పోయాం. తీరిక చిక్కినప్పుడల్లా వెళ్తున్నాను. ఆయన అనుభవాలు వింటూ ఆలోచనలు పంచుకుంటున్నాను. క్యారమ్స్, చెస్ ఆడుతున్నాం. బలవంతపెట్టి మరీ ఆయన జ్ఞాపకాల్ని కాగితం మీద పెట్టిస్తున్నాను.

ఆయనలో వచ్చిన మార్పు ` ముఖ్యంగా చురుకుదనం, ఉత్తేజం చూస్తోంటే నాకే ఎంతో చిత్రంగా వుంది. మనిషికి ఇంకో మనిషి తోడుకన్నా గొప్ప టానిక్ వుండదేమో!

అంత కంటే చిత్రంగా నా ఆలోచనల్లోనూ మార్పు - పరిపక్వత రాసాగింది!

ఆయన అనుభవాలు నాకు పాఠాలవుతున్నాయేమో!

ఆరోజున మేం కబుర్లూ, నవ్వులూ కలబోసుకొంటోంటే మేఘన లోపలికొచ్చింది.

నా వంక యమాశ్చర్యంగా “ఈ ఇంట్లోంచి నీ గొంతు విన్పించి....”

“ఈమె మేఘన. నా ఫ్రెండ్ తాతయ్యా” పరిచయం చేశాను.

“ఇక్కడేం చేస్తున్నావు రిషీ?” సాలోచనగా మా ఇద్దరి వంకా చూస్తూ అడిగింది.

“టైం పాస్ చేస్తున్నాను!”

"కాదమ్మాయ్. నాకు టైమ్ దానం చేస్తున్నాడు. నాలాంటివాళ్ళకి కాలాన్ని దానం చేయడం నవదానాల్లో వుందో లేదో తెలీదు గాని, అదెంతో మహత్తరమైందని నాకూ, నా బోటి వాళ్ళకూ మాత్రమే తెలుసు!"

"కాలాన్ని సద్వినియోగ పరచడమే కాదు తాతయ్యగారూ, తనకి తెలీకుండానే ప్రేమాభిమానాలు పంచాడు. మీకు మానసిక ఊరట, తృప్తి కలిగించాడు. కన్సర్న్ చూపి ఉత్సాహపరిచాడు. ఇప్పుడు మా రిషికి ఇచ్చుటలో ఉన్న ఆనందం అనుభవంలోకొచ్చింది!"

ఆమె కళ్ళల్లో మెరుపులు మెరిశాయి. దాని ప్రతిధ్వని నా గుండెల్లో గుడి గంటల్లా మోగాయి!

***0***

**దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**



# పూజా ఫలం

## పెనుమాక నాగేశ్వరరావు

రామారావుకి దేవుడంటే భయమా, భక్తా అనడిగితే సూటిగా సమాధానం చెప్పలేని పరిస్థితి. అయితే సోమవారం శివాలయానికి, మంగళవారం ఆంజనేయస్వామి ఆలయానికి, బుధవారం వినాయకుని గుడికి, గురువారం సాయిబాబా మందిరానికి, శుక్రవారం మహాలక్ష్మీ అమ్మవారి గుడికి, శనివారం వెంకటేశ్వరుని ఆలయానికి వెళ్ళి ప్రదక్షిణాలు చేయటం అలవాటు చేసుకున్నాడు. ఆదివారం మాత్రం ఇంటికి పరిమితమవుతూ తనకు తోచిన విధంగా దేవుడిని స్మరించుకుంటూ వుంటాడు.

'ఉద్యోగం పురుషలక్షణం' అని కదా అంటారు. కానీ ఇప్పుడు ఆడవారు మాత్రం వూరకనే వుంటున్నారా? ఉద్యోగాల్లో వారికి కోటాలు కూడా కేటాయించారు కదా! అందుకే రామారావు తనకు ఉద్యోగం రావాలని కోరుకోవటమే కాకుండా, ఉద్యోగస్తురాలయిన మనిషి తనకు భార్యగా దొరకాలని కూడా దేవుడ్ని కోరుకోవటం తన తెలివిగా అనుకుంటాడు. దేవుడిని అడిగేదేదో తెలివిగా అడగాలనేది రామారావు మనసులో మాట. అడగనిదే అమ్మాయినా పెట్టదు కాబట్టి అడగటం తప్పు కాదంటాడు.

'దేవుడు నా మొర అలకించాడు. ఓ చిరుద్యోగం చూపించాడు' అని తాను ఉద్యోగంలో చేరిన మొదటిరోజే వినాయకుడి గుడికి వెళ్ళి ఓ కొబ్బరికాయ కొట్టాడు. అష్టోత్తరం పూజ చేయించాడు. గుడి ఆవరణలోనే వున్న నందివర్ధనం చెట్టు నుంచి ఎవరూ చూడకుండా రెండు పూలు కోసి అర్చకుడి చేతిలో వున్న పళ్ళెంలో పెట్టాడు.

కొబ్బరిచిప్ప ఇంటికి తీసుకువెళ్లి వాళ్ళ అమ్మకి ఇచ్చి ఇడ్లీలోకి చెట్నీ చేయమని అందులో కొబ్బరి బాగా వేయమని చెప్పాడు. తినబోయే కొబ్బరి పచ్చడి రుచిని వూహించుకుంటూ తన్మయుడైపోసాగాడు రామారావు.

ప్రతిరోజు రామారావు ఉదయాన్నే నిద్ర లేస్తాడు. పూజ కోసం పక్క వాళ్ళ చెట్ల నుంచి రహస్యంగా పూలు కోసుకోవటం అతని దినచర్య. అంతే కాదు వాకింగ్ కు వెళుతూ ఓ క్యారీ బ్యాగ్ జేబులో పెట్టుకు పోతాడు. దారిలో కనపడిన మొక్కల పూలన్నీ కోసుకుంటాడు. అవి రోడ్డు పక్కవైనా, ఇళ్ల ముందువైనా

లెక్కచేయడు. అప్పుడప్పుడు సాయంత్రాలు మనసు పుడితే ఎక్కడైనా పురాణ ప్రవచనాలు వినటానికి కూడా గుడులకు వెళుతుంటాడు.

పూలు కోసుకునేటప్పుడు ఏ ఇంటి వాళ్లయినా వారించినా, ఇతని వంక చూసినా కోపంగా తిట్టుకుంటూ వెళ్లిపోవటం రామారావుకు అలవాటైపోయింది. 'పూజకు నాలుగు పూవులు కోసుకుందామంటే వాళ్ళ ఆస్తులన్నీ కాజేస్తున్నట్లు ముఖాలు మాడ్చుకుంటారు వీళ్ళ ముఖాలు తగలేయ్యా' అనుకుంటాడు, 'మంచి పనికి సహకరిస్తే పుణ్యమే కానీ పాపం కాదుగా... ఏమిటో మరి ఈ మనుషుల మనస్తత్వం' అనుకుంటాడు. వాళ్ళ మీద జాలి పడతాడు కూడా.

ఓ సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వెళుతూ రామాలయంలో నుంచి మైకులో వినబడుతున్న పురాణ ప్రవచనం చెవినపడింది. ఇంటికివెళ్లి చేసే పనేమీ లేకపోవటంతో, గుడి ప్రాంగణంలోకి నడిచాడు రామారావు. వక్తగారి గొంతు శ్రావ్యంగా వినబడటం కూడా అతని మనసు అటుగా లాగటానికి మరో కారణం. కొంచం దూరంగానయినా ప్రవచనం బాగా వినపడే చోటు నిర్ణయించుకుని మరీ కుర్చీ ఎంచుకుని కూర్చున్నాడు. కుర్చీలోనుంచే ఆలయంలో కనిపిస్తున్న దేవునికి 'హలో' అన్నట్లు ఓ నమస్కార బాణం వదిలాడు. ప్రసాదాలు పంచే ప్రాంతం వైపు ఓ సారి దృష్టి సారించాడు. గిన్నెలు సర్దుకోవటం గమనించి మిన్నకుండిపోయాడు.

"మీరు ఒక్క విషయం జాగ్రత్తగా వినండి!" అని ఓ క్షణం ఆగిన ఉపన్యాసకుని వైపు చాలా మందిలాగానే రామారావు కూడా ఆసక్తిగా చూస్తూ చెవులు రిక్కించాడు.

"పక్క వాళ్ళని అడక్కుండా వాళ్ళ చెట్ల పూవులు కోసుకోవడం దొంగతనమే అవుతుంది. అందుకు శిక్ష ఏమిటో తెలుసా... వచ్చే జన్మలో భయంకరమైన అడవిలో కోతిలా పుడతారు. అందుకని కోసుకున్నప్పుడల్లా అడిగి కోసుకోవాలి. ఒకవేళ వాళ్ళు అనుమతిచ్చినా, నీవు ఆ పూలతో చేసే పూజ వల్ల పొందే పుణ్యంలో సగం, ఆ మొక్కల యజమానికి పోతుంది. ఈ మాటలు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువే గరుడపురాణంలో పంచమాధ్యాయం, పదునాల్గవ శ్లోకంలో గరుడునికి చెప్పటం జరిగింది."

తామూల ఫల పుష్పాది హర్తాస్యా ద్వానరో వనే!
ఉపానత్తృణ కార్పసహర్తాస్సా న్మేష యోనిషు!!

'తాంబూలము, ఫలములు, పుష్పములు మొదలగు వాటిని అపహరించినవాడు అడవిలో కోతిగానూ ... గడ్డి, ప్రత్తి మొదలగువాటిని దొంగిలించినవాడు మేకగాను పుడతారు మళ్ళీ జన్మలో... అని దీని అర్థం."

"నిజానికి ఆ మొక్కల యజమానికి కూడా మొత్తం పూలు కోసే అధికారం లేదు. దేముని పూజకోసమని మొక్కని ప్రార్థించి కొన్ని పూవులే కోసుకోవాలి. అన్నిపూలు కోసేసి మొక్కల్ని బోసిగా వుంచడం

మహాపాపం." చెప్పటం ఆపి ప్రాంగణం అంతా కలియచూశాడాయన. రకరకాల ముఖాల్లో అనేకరకాల రంగులు కనిపించినై ఆయనకు.

ఆ మాటలు విని ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు రామారావు. 'తను పూలు కోసుకునే ఇళ్ళల్లోనే ఓ ఇంట్లో వుంటున్నాడా ఆ ప్రవచన కర్త...?' సందేహం కలిగింది. 'అయినా తను రావడం చూసి ఈ మాటలు చెప్పటం లేదు కదా' అనుకోగానే మనసంతా అలజడితో నిండిపోయింది. 'ఆ శతకోటి లింగాల్లో నేనో....'అనుకుని, పెదవులు చప్పరించి కూర్చున్నాడు.

పూజ చేస్తే పుణ్యం రావాలి. దానివల్ల మోక్షం కలగాలి. లేదూ కనీసం ఈసారి జన్మ ఇంకా పుణ్యం చేసుకునే జన్మ అయివుండాలి. కానీ పరాయి వాళ్ళ పూలు కోసి పూజ చేస్తే, పుణ్యం రాకపోగా రాబోయే జన్మలో జంతువుగా జన్మించాలని చెబుతున్నాయి పురాణాలు.

'రహదారి పక్కన వుండే మొక్కలకి పూసే పూలు ఎవ్వరివీ కాదుగదా! అవి కోసుకుంటే పాపం ఏముంటుంది? ఒకవేళ ఎవరైనా అవి సర్కారు వారివి అని డొంక తిరుగుడుగా మాట్లాడితే...అసలు సర్కారువారికి పాపపుణ్యాలు, దయాదాక్షిణ్యాలు, ధర్మాధర్మాలు వున్నాయా, వుంటాయా? భూకబ్జాలు, లంచాలు, మాఫియాలు, వగైరాలతో మునిగితేలే వారికి వీటితో సంబంధమేమిటి?' అనుకున్నాడు రామారావు. 'వాళ్ళకి రాజ్యాంగమే లెక్కలేదు, ఇక దేవుడ్ని ....' అని కూడా అనుకున్నాడు.

అలాంటప్పుడు అక్కడా ఇక్కడా పూలు అడక్కుండా తెచ్చుకుని పూజలు చేయటం అవసరమా అని ఆలోచనలో పడ్డాడు. పైగా తాను చేసే పూజలకు వచ్చే పుణ్యంలో సగం ఆ చెట్టు యజమానికి పోతుందనే విషయం విన్నాక, ఇక పూజలు చేయటం అనవసరం అనుకున్నాడు. కష్టం ఒకరిది, ఫలితం మరొకరిదా? సమంజసంగా తోచలేదు రామారావుకి. తాను చేసే పూజాఫలం ఎవడో ముక్కూమొహం తెలియని వాడికి వెళ్ళటం ....అదెక్కడి న్యాయం అనిపించింది.

అయినా ఒక్కసారిగా పూజలు మానేయటానికి మనసు రాక, తీరాల్సిన కోరికలు ఇంకా పెండింగ్ లోనే వున్నందువల్లా పూలే లేకుండా పూజ చేయకూడదా ఏమిటి?.. అని తనకు తానే ప్రశ్నించుకున్నాడు. చేయవచ్చు.. అని తనకు తనే సమాధానపరుచుకున్నాడు. 'కొండంత దేవుడికి కొండంత పత్రి పెట్టగలమా' అనే నానుడి సరిగ్గా ఆ సమయానికి గుర్తుకు వచ్చి తేలిగ్గా వూపిరి తీసుకున్నాడు. మనోపుష్పంతో పూజ చేసేయటానికి నిర్ణయించుకున్నాడు. ఆ రోజు నుంచి వాకింగుకు వెళ్ళేటప్పుడు జేబులో క్యారీ బ్యాగ్ పెట్టుకోవటం మాత్రం మానేయలేకపోతున్నాడు. అలవాటైన ప్రాణం అచ్చొచ్చిన చేతివాటం. అంతటితో ప్రవచనానికి తనే స్వస్తి పలికి ఇంటిముఖం పట్టాడు.

మొదటి నెల జీతం అందుకోగానే శివాలయానికి వెళ్ళి, ఆ రోజు సోమవారం కూడా, స్వామికి అభిషేకం చేయించాడు. నుదుటన విభూతి ధరించాడు. తీర్థ ప్రసాదాలు స్వీకరించి, ఇంటికి, అటు తర్వాత ఇంటి నుంచి ఆఫీసుకు వెళ్ళాడు. ముచ్చటగా మూడు నెలలు పూర్తయినై. నాలుగవ నెల మూడవ శనివారం ఓ రోజు

ఆఫీసుకు వెళుతుండగా ఓ అందమైన ఆడమనిషి రామారావు కంటపడింది.  లవ్ యట్ ఫస్ట్ సైట్ అనకపోయినా, మొదటి చూపుతోనే ఆమె ఉద్యోగస్థురాలయితే పెళ్లి చేసుకుంటే బాగానే వుంటుందనే భావనయితే కలిగింది. కులగోత్రాలు, ఆస్తులు, అంతస్తులు వగైరాలన్నీ సరిపోతే, అన్నింటికీ మించి వారిద్దరి జాతకాలు సరిపోతే వివాహం చేసుకోవటానికి, అందం పరంగా అతనికేమీ అభ్యంతరమే కనిపించలేదు. మనసులో ఆమె రూపం నిండిపోయింది.

నాలుగు రోజుల్లో ఆమె ఉద్యోగస్థురాలని తెలుసుకున్నాడు. ఏ ఆఫీసులోనో కూడా కనుక్కున్నాడు. జీతం వగైరా విషయాలు రాబట్టాడు. ఇకపోతే అసలు విషయం ఆమె కులం వగైరా వివరాలు ఎలా ఎవరి దగ్గర్నుంచి తెలుసుకోవాలా అని ఆలోచించాడు. మనసుంటే మార్గం వుండకపోతుందా! కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడకన్న చందంగా అలా అలా అన్ని వివరాలు సేకరించాడు రామారావు. ఆర్థికపరమైన అంశాల్లో అన్నీ తనకు సంతృప్తిగానే వున్నై. ఇకపోతే ఇంట్లో,  విషయం చెప్పి ఓ అడుగు ముందుకు వేయాలని నిర్ణయించుకున్న రామారావు ముందుగా మహాలక్ష్మీ అమ్మవారి గుడికి వెళ్ళాడు.  ఆ రోజు శుక్రవారం.

తంతే బూరెల బుట్టలో పడటం అంటారే.... సరిగ్గా రామారావు తనని ఎవరూ తన్నకుండానే ఏకంగా అరిశల  గంపలో పడ్డట్టు ఆమె కూడా అదే సమయానికి ఆ గుడిలోకే అడుగుపెట్టింది. పక్కనే చెల్లియో, చల్లకో కాదు గాని,  చెలియే  వుంది. ఇద్దరూ మాట్లాడుకుంటూ, ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ గుడిలోకి అడుగు పెట్టారు.
'ఆడబోయిన తీర్థం ఎదురవ్వటం' అంటే ఇదేనా అన్నట్లు ఎలాగోలా ఆమెతో మాట కలిపి స్నేహబీజం నాటాలనుకున్నాడు. పూలసజ్జతో వయ్యారంగా నడుస్తున్న ఆమె వెనకాలే అడుగులో అడుగు వేసుకుంటూ అర్ధనిమీలిత నేత్రాలతో, ఒకింత భక్తిభావం ముఖంలో కనిపించేటట్లు జాగ్రత్తలు తీసుకుంటూ ఆమెను అనుసరించసాగాడు రామారావు.  చూపులు కలిసినై, మాటలు కలిసినై, జాతకాలు కలిసినై, గమ్మత్తుగా పేర్లు కూడా కలిసినై. ఇక  మనసులు కలవాలి, మనువులు కుదరాలి.  మూడు ముడులు పడాలి, ఏడు  అడుగులు నడవాలి, అప్పగింతలు జరగాలి, గృహప్రవేశం కావాలి, అంతే!

కళ్యాణం వచ్చినా కక్కు వచ్చినా ఆగదని వూరకనే చెప్పారా పెద్దలు! అన్నీ జరిగినై. సీత, రామారావు భార్య అయింది. అతని ఇంటికి దీపం అయింది. అతను ఆమె కంటికి వెలుగయ్యాడు. ఇద్దరి మనసులు పరవశించినై. తనువులు పులకించినై. కొత్త కాపురం మొదలయ్యింది.

ఒకే గూటి పక్షులు అన్నట్లు సీతక్కూడా రామారావుకు లాగానే దేవుడు, పూజలు, గుడి గోపురంలతో పాటు ఉపవాసాలు, నోములు, వ్రతాలు అంటే శ్రద్ధ గల మనిషే. అందుకే పెళ్లి అయ్యాక కూడా రామారావు దినచర్య

యధాప్రకారం మార్నింగ్ వాక్ తోనే ప్రారంభం అవుతుంది. వాకింగ్ లో ఎప్పటిలాగానే క్యారీ బ్యాగ్ తో పూలు తేవటం, దేవుడికి అలంకరించటం జరిగిపోతున్నది. సీతకూడా ఆ విషయంగా ఏమీ పట్టించుకోలేదు. రామారావు ఇదివరలా రోజూ గుడులకు వెళ్లకపోయినా, సీతతో కలసి శుక్రవారం మాత్రం మహాలక్ష్మి అమ్మవారి గుడికి, శనివారం తను ఒక్కడే వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్ళటం అలవాటు చేసుకున్నాడు. ఎప్పుడయినా కుదిరితే ఆ గుడికి కూడా ఇద్దరూ వెళుతుంటారు.

ఓ పండుగ రోజు సాయంత్రం ఆలుమగలిద్దరూ గుడికివెళ్లారు. ప్రదక్షిణాలు, ప్రణామాలు, తీర్ధప్రసాదాలు వగైరాలన్నీ పూర్తయ్యాక, ప్రవచనం జరగబోతున్నదని తెలుసుకుని వెళ్ళి కూర్చున్నారు. ప్రవచనకర్త గంభీరంగా వేదికపైన ఆసీనులై వున్నారు. ప్రార్ధనతో ప్రారంభమయిన ప్రవచనం అనర్గళంగా సాగిపోతున్నది. అందరూ శ్రద్ధగా వింటున్నారు. అందరితో పాటు రామారావు దంపతులు కూడా .

"భార్యా భర్తలిద్దరిలో పూజాఫలాలు ఎలా వుంటయ్యో చెబుతున్నా గమనించండి. గృహ యజమానే దినసరి పూజ చేయటం ఉత్తమం. అలాగని ఆడువారు చేయకూడదనో, చేయనక్కరలేదనో కాదు సుమా. కానీ భర్త చేసే పూజాఫలంలో భార్యకు సగం పుణ్యం దక్కుతుంది కానీ, భార్య చేసే పూజా ఫలితంలో భర్తకి దక్కేది ఏమీ వుండదు. అది శాస్త్రం చెబుతున్న మాట." అని ఓ దీర్ఘ నిట్టూర్పు విడిచారు ఆయన.

'బాగుంది. నేను రోజూ చేసే పూజలో సగమేమో ఆ పూల చెట్ల యజమానులకా! మరో సగం నా భార్యకా! ఔరా ఇంకెందుకు నాకీ శ్రమ ' మనసులోనే వాపోయాడు రామారావు

ఫలితం ఆశించకుండా కదా పూజలు చేయమన్నాడు దేవుడు. పోనీలే. నా పూజాఫలం సగం పూలచెట్ల వారికి, మిగిలిన సగం నా భార్య సీతకు, పోనీ వాళ్ళిద్దరికీ పుణ్యం సంపాదించిపెట్టిన పుణ్యమైనా నాకు రాకపోతుందా. నా పూజలు వూరికె పోవుగదా... అని తనకుతానే సమాధానం చెప్పుకుని రోజూ యధావిధిగా పూజలు కొనసాగిస్తున్నాడు రామారావు.

రామారావు ఆలోచనకి అమాయకత్వానికి, నిష్కల్మష హృదయానికి సంతోషపడ్డ రాముడు...అదే దేముడు సుఖీభవ అంటూ రామారావుని దీవిస్తూనేవున్నాడు. రామారావు పూలు కోస్తూనేవున్నాడు. పూజలు చేస్తూనే వున్నాడు. 'వచ్చే జన్మలో కోతిగా పుడతానేమో' అని అప్పుడప్పుడు అనిపించినా, నాలుక చప్పరించి వదిలేస్తున్నాడు. 'కోతినుంచేగా మనిషి పుట్టాడంటారు...' అని మళ్ళీ అనుకుంటున్నాడు! ఇంకో ఆరు జన్మలు సీతే నా భార్య అనుకుని ఆనందపడుతున్నాడు. తన సంతోషమే స్వర్గము కదా!

***0***

## దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# చిల్డ్రన్ వితౌట్ నేమ్స్

రాపాక కామేశ్వర రావు



"ఒరేయ్ రాము రెండు టీ పెట్రా...మన టీ ఎలా ఉండాలో నీకు తెలుసు కదా! అల్లం, యాలక్కాయ పడాలి!" చక్రపాణి హుకుం జారీ చేసాడు.

"అలాగే బాబు! నా చిన్నప్పటి నుండి మిమ్మల్ని చూస్తున్నాను. మీ మాటకు తిరుగు లేదు!" అన్నాడు రాము.

చక్రపాణి మా ఊరి పంచాయతి ఆఫీసులో శానిటరీ ఇనస్పెక్టర్. నా చిన్ననాటి స్నేహితుడు. మనిషి మంచివాడే గాని, మాట దురుసుగా ఉంటుంది. నేను రిటైర్ అయిన తరువాత మా స్వగ్రామముకు వెళ్ళి సెటిల్ అయిపోయాను. చక్రపాణి సర్వీసు ఇంకా ఆరు నెలలుంది. ఒక రోజు సాయంత్రం ఇద్దరం కలిసి టీ తాగడానికి "రాము టిఫిన్ సెంటర్" కు వెళ్ళాం.

"ఈయనెవరో తెలుసా? నీవు పోల్చుకోవడం కష్టమేలే. రిటైర్డు స్టేట్ బేంక్ మేనేజర్ భానుమూర్తి గారు. నలభై ఏళ్ళు ఎక్కడెక్కడో తిరిగిన తరువాత, మళ్ళీ మన ఊరికి వచ్చారు!" నన్ను చూపించి చక్రపాణి పరిచయం చేసాడు రాముకి.

"ఒరేయ్ భాను, రాము గుర్తున్నాడురా?" అని నన్ను అడిగాడు చక్రపాణి.

"ఎవరు? మన వెంకట్రావ్ టీ కొట్టులో హెల్పర్ గా ఉండేవాడు ఆ రామునా?" అడిగాను నేను.

"నీవు రాము పేరుని బాగానే గుర్తు పెట్టుకున్నావన్నమాట!" అన్నాడు చక్రపాణి.

నలభై ఏళ్ళ క్రితం మా ఊరిలో ఒక చిన్న టీ కొట్టులో హెల్పర్ గా ఉన్న రాము పేరును నేను గుర్తెలా పెట్టుకున్నానా అని మీ సందేహం కదా?

***

"ఒరేయ్ వెంకట్రావ్ రెండు టీ పెట్రా... అల్లం యాలక్కాయలు పడార్రోయ్" చక్రపాణి టీ ఆర్డర్ ఇచ్చాడు. చక్రపాణి అప్పటికే మా ఊరి పంచాయతి ఆఫీసులో శానిటరీ మేస్త్రి జాబ్ లో చేరాడు. నేనింకా బేంక్ జాబ్ కోసం పోటీ పరీక్షలు రాస్తున్నాను.

వెంకట్రావ్ టీ కొట్టు ఒక చిన్న పాకలో ఉండేది. ఆయన సంసార సాగర మథనంకూడ అందులోనే. ఒక సగం మాసిన తెల్ల పంచె లుంగిలాగ చుట్టుకునేవాడు. పైన అంగ వస్త్రం ఉండేది కాదు. ఆ పాకలోనే చిన్న తడక అడ్డు పెట్టి తన వైవాహిక జీవితం గడిపేవాడు.

వెంకట్రావ్ కు టీ పెట్టడంలో మంచి నైపుణ్యం ఉంది. ఆయన భార్య సహాయంతో చేసిన టిఫిన్స్ తక్కువ ధరకు ఇచ్చేవాడు. ఎక్కువగా దిగువ తరగతి వారు మరియు నాలాంటి నిరుద్యోగులు అక్కడికి వెళ్ళేవారు. నేను చక్రపాణితో కలసి అప్పుడప్పుడు టీ కోసం అక్కడికి వెళ్ళేవాడిని.
"ఇదేమిటి ఇంత చిన్న పిల్లవాడు గ్లాసులు ప్లేట్లు కడుగుతున్నాడు, పిల్లలతో పని చెయ్యించడం నేరం కదా?" అడిగాను. ఆ కుర్రవాడిని చూస్తె అయిదారేళ్ళకంటె ఎక్కువ వయసు లేదు. అప్పటికి దేశంలో బాలకార్మిక నిషేధముకు సమగ్ర చట్టాలు రాకున్నా వివిధ చట్టాల ద్వారా "బాలలతో పని చెయ్యించడం నేరం" అన్న విషయం ఎక్కడో చదివింది నాకు గుర్తొచ్చి ఆ మాట అన్నాను.
"ఒరేయ్ లేబర్ ఆఫీసర్ కు చెప్పి బొక్కలో తొయ్యించేస్తానురా జాగ్రత్త! తమాషా చేస్తున్నావా?" కొత్తగా వచ్చిన అధికారముతో రెచ్చిపోతున్నాడు చక్రపాణి.
"బాబ్బాబు, నా మాట వినండి. నెల క్రితం నేను సిమ్మాచలం నుండి జనతా ఎక్స్‌ప్రెస్ లో వస్తుంటె, ఈ పిల్లవాడు రైలుబోగీ క్లీన్ చేస్తు కనబడ్డాడు. నీపేరేమిటి? అని అడిగాను. తెలియదన్నాడు. ఏ ఊరో .. అమ్మా, నాన్న ఎవరో తెలియదన్నాడు. సరే అలా గాలికి వదిలేసే కంటె చేరదీస్తె బాగుంటుందనే ఆలోచనతో ఆ పిల్లవాడిని నాతో రమ్మన్నాను. అభం శుభం తెలియని పిల్లవాడు. ఎలా ఈ లోకంలోకి వచ్చాడో, ఎందుకు వచ్చాడో ఆ సిమ్మాదిరప్పన్నకే తెలియాలి. నేను, నా భార్య కష్టపడితేగాని మాకు జరగదు. మాకు తోడుగా ఉంటాడని తెచ్చుకున్నాం. మాకు ఇంకా పిల్లలు కలగలేదు. వాడికి మేము అండగా ఉండాలనే అనుకున్నాం. వీడికి 'రాము' అని పేరు పెట్టాం. ఈ నెలలో బడులు తెరవగానే వీడిని చేర్పిస్తాను. దయుంచి ఎవరికి చెప్పకండి. మీకు పుణ్యముంటాది." వేడుకోలుగా అన్నాడు వెంకట్రావ్.
నేను ఆ కుర్రాడిని దగ్గరకు పిలిచి "నీ పేరేంట్రా" అని అడిగాను. వాడు బెరుకు బెరుకుగా నా దగ్గరికి వచ్చి "రాము" అని ముక్తసరిగా అన్నాడు.

***

ఆ నెలలో బడులు తెరవగానే మాట నిలబెట్టుకున్నాడు వెంకట్రావ్. అన్ని పండించిన వాడికే అన్నం కరువైన ఈ రోజుల్లో, ఒక అనామక బాలుణ్ణి ఆదరించి వాడి బాగోగులు చూడ్డమంటె వెంకట్రావ్ లాంటి వాళ్ళకు కష్టమే. ఏదో మాకు వీలైనంత సాయం చేద్దామనుకుని చక్రపాణి, నేను ఇద్దరం కలసి రాముకు పలక, బలపం, ఒకటవ తరగతి తెలుగు వాచకము మరియు రెండు జతల బట్టలు కొనిచ్చాం.

అప్పటినుండి ఇలాంటి పిల్లలకోసం ఏదైన చెయ్యాలన్న కోరిక నాలో పెరిగింది.

ఆ తరువాత కొన్ని నెలల లోపునే నాకు బేంక్ ఉద్యోగం రావడం వలన నేను మా ఊరు విడిచిపెట్టాల్సి వచ్చింది. అప్పుడప్పుడు చక్రపాణితో మాటలాడినప్పుడు రాము విషయాలు చెబుతుండేవాడు.

రాము పదవ తరగతి పాస్ అయినప్పుడు చక్రపాణి నాతో చెప్పాడు. "ఇంక పై చదువులకు వెళ్ళాలంటె ఖర్చుతో కూడుకున్న విషయమని, అందుకే మానేస్తానని అది కాక వెంకట్రావ్ ఆరోగ్యం క్షీణించడం వలన ఆయనకి తోడుగా ఉంటానని" చెప్పాడట రాము.

తరువాత చక్రపాణి శానిటరీ ఇనస్పెక్టర్ గా ప్రమోషన్ రావడముతో కొన్నాళ్ళు మా ఊరు విడిచి వెళ్ళిపోయాడు. ఆ తరువాత రాము విషయాలు మాకు తెలియలేదు. సర్వీసు చివరి రోజులలో చక్రపాణి మళ్ళీ మా ఊరికి బదిలీపై వెళ్ళాడు.

***

కాలక్రమంలో వెంకట్రావ్ దంపతుల టీ కొట్టు "రాము టిఫిన్ సెంటర్" గా మారింది. పాక స్థానములో ఒక డాబా కట్టారు. వెంకట్రావ్ మరియు ఆయన భార్య ఈ మధ్యనే పరలోక ప్రాప్తి పొందారు.

టిఫిన్ సెంటర్ చాల శుభ్రముగ ఉంది. ఇప్పుడు నాలాంటి వాళ్ళు కూడ అక్కడికి వస్తున్నారు. కాని నలబయ్యేళ్ళ క్రితం వెంకట్రావ్ టీ కొట్టులో నేను చూసిన దృశ్యం మళ్ళీ నా కళ్ళకు కనిపించింది.

"ఇదేమిటి రాము, చిన్నపిల్లాడితో పని చెయ్యిస్తున్నావు" అని అడిగాను.

"వీడే కాదు సార్, ఇంకో ముగ్గురున్నారు. వీళ్ళంతా అనాథలే సార్! నేను ఎలా పెరిగానో నాకు గుర్తుంది సార్!" అని అన్నాడు.

"వీరిద్దరు, మా హోటల్ కు ప్రతిరోజు పాలు పోసే నరసమ్మ పిల్లలు. ఈ పక్కనే ఉన్న బూరగాం వీళ్ళ సొంతూరు. చదువుకోలేదు. పాల అమ్మకంలో తల్లికి సాయపడేవారు. నరసమ్మకు మాయదారి కేన్సర్ రోగం వచ్చి అయిదేళ్ళ క్రితం చనిపోయింది. నా అనే వాళ్ళెవరూలేరు. అప్పటికి పెద్దవాడి వయస్సు ఎనిమిది, చిన్నవాడి వయస్సు ఆరు." ఇద్దరు పిల్లల్ని చూపిస్తు నాకు చెప్పాడు. ఒకడు టిఫిన్స్ అందిస్తున్నాడు. ఇంకొకడు టేబుల్స్ తుడుస్తున్నాడు.

"తాను దూర సందు లేదు మెడకో డోలు అన్నట్టుందిరా" అన్నాడు చక్రపాణి. ఇంకా ఏదో అనబోతుండగా వద్దని నేను వారించాను.
"పెద్దవాడికి రాత్రి బడిలో చేర్పించాను. రెండవ వాడు పగటి పూట బడికి వెళ్తాడు. సాయంత్రం పూట మాకు హెల్ప్ చేస్తాడు." రాము కొనసాగించాడు.

ఇంకో ఇద్దర్ని చూపించి "వీళ్ళు ఊరూరు తిరిగి పూసలు అమ్మే సంచార జీవులు. ఒక్కొక్క ఊరిలో కొన్ని రోజులు ఉండి పూసలు, పూసల గొలుసులు, సవరాలు, హెయిర్ పిన్నులు మొదలైనవి అమ్ముతారు. వీళ్ళు జన స్రవంతిలో భాగమే అయినా జనాభా లెక్కల్లో ఉండరు. ఎందుకంటే ఎప్పుడు ఏ ఊరిలో ఉంటారో తెలియదు. అడ్రస్ లేని మనుషులు. చివరిగా వీరి అమ్మ బరంపురం బస్ స్టాండులో పూసల దండలు అమ్మేదట. అక్కడి నుండి ఇంకో చోటుకు వెళ్ళడానికి ఒక రోజు రాత్రి పూట కోనార్క ఎక్స్ ప్రెస్ ట్రైన్ ఎక్కి వెళ్తుండగా, ట్రైన్ మన ఊరి స్టేషన్ లో ఉన్నప్పుడు, టిటి టికెట్ అడుగుతాడని భయపడి, వీళ్ళ అమ్మతో పాటు దిగి వేరె బోగీకి మారుదామనుకున్నారు. వీళ్ళమ్మ వేరే బోగీలో ఎక్కింది, కాని ట్రైన్ కదిలిపోవడం వలన వీళ్ళు ఎక్కలేక పోయారట.   రైల్వే స్టేషన్ నుండి ఊరిలోకి వచ్చి మన హోటల్ ముందున్న మెట్లపై పడుకొని ఉండగా తెల్లవారి నేను చూసాను. వీళ్ళు ఎక్కడివారో తెలియదు. మన భాష కూడ రాదు. ఒడిసా వాళ్ళు అయ్యుంటారు. మన హోటల్ కు వచ్చిన వాళ్ళలో కొందరు ఒడియాలో అడిగితే పై విషయాలన్నీ చెప్పారు. ఇప్పటికి పదేళ్ళయింది. అప్పటికి వీళ్ళ వయస్సు ఇంచుమించు ఏడు ఏళ్ళు, అయిదేళ్లూ ఉంటాయి. వీళ్ళు కూడ నరసమ్మ పిల్లల లాగే పెద్ద వాడు రాత్రి బడికి వెళ్తాడు. చిన్న వాడు ప్రతిరోజు పగటి పూట బడికి వెళ్తాడు."
"నీకు ఎంతమంది పిల్లలు రాము?" అడిగాను ఉత్సుకతతో.
"నాకు నలుగురు పిల్లలు సార్" అన్నాడు రాము.
"ఏమిటీ, ఎనిమిది మందిని పోషిస్తున్నావా?"
"ఎనిమిది మందేమిటి సార్. ఈ నలుగురే నా పిల్లలు, నేను పెళ్ళి చేసుకోలేదు సార్"
" అరె, ఏం?"
"పెళ్ళి లేకుండానే దేవుడు నాకు నలుగురు పిల్లల్ని ఇచ్చాడు సార్, ఇంకా పెళ్ళెందుకు సార్"
"వీళ్ళందరిని ఎలా పోషిస్తున్నావు?" అని అడిగాను.
దానికి ఒక చిరునవ్వు నవ్వాడు రాము. "నారు పోసే వాడు నీరు పొయ్యక మానడు కదా సార్! వీళ్ళందరూ కష్టపడతారు సార్. వాళ్ళ కష్టం వారు తింటున్నారు. నేను పోషించేదేముంది!"

చిన్నప్పుడు వెంకట్రావ్ టీ కొట్టులో చూసిన ఒక అనామకుడు రాము, ఈ రోజు నా కన్న ఎంతో ఎత్తులో ఉన్నట్టు నాకనిపించాడు.

ఆ రాత్రి పడుకునేటప్పుడు నా మెదడులో ఇదే విషయమై ఎడ తెగని ఆలోచనా స్రవంతి.
"ఆటపాటలతో చదువుతో హాయిగా గడపాల్సిన బాల్యం ఇలా బాలకార్మిక వ్యవస్థ కోరల్లో చిక్కుకుంది. దీన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం ఎన్ని చట్టాలు చేసినా, వాటిని అమలు చేయడంలో వైఫల్యం మరియు బాలలకు వసతులు కల్పించడానికి సరిపడ్డ నిధులు కేటాయించక పోవడం వలన ఇది ఒక సామాజిక రుగ్మతలా సమాజాన్ని పీడిస్తోంది. రాము ఆ పిల్లల్ని చేరదీయకుండా వదిలేసి ఉంటే, భవిష్యత్తులో వీళ్ళు సంఘువిద్రోహక శక్తులుగా మారవచ్చు. ప్రభుత్వంతో పాటు పౌరసమాజం కూడ బాధ్యత వహించాలని రాము నాకు జ్ఞాన బోధ చేసినట్లనిపించింది."


నలుగురు అనాథ బాలల్ని తన పిల్లలుగా భావించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న రాము "అనామకుడు" కాదు. "ఒరేయ్ రాము" కూడ కాదు. కృషి, పట్టుదలతో జీవితములో ఎంతో ఎదిగాడు. నిస్వార్థం, దయాగుణం అలవర్చుకున్న సేవాతత్పరుడు. నాకు రోల్ మోడల్. దిశా నిర్దేశకుడు.

రాము స్ఫూర్తితో నేను అనతి కాలంలోనే నా చిన్ననాటి మిత్రులందరి సహకారముతో ఒక అనాథ పిల్లల ఆశ్రమాన్ని స్థాపించాను. నా కల నెరవేరింది.

ఆ రోజు జరగబోయే సభకు అధ్యక్షత వహించమని అడగ్గానే మా ఊరి ఎం ఎల్ ఏ గారు సరేనన్నారు. ప్రారంభోత్సవానికి ఇంకా కొద్ది సేపుంది. ఆహుతులందరు గుసగుసలాడుకుంటున్నారు. "మన ఎం ఎల్ ఏ గారు కూడ వచ్చేసారు. ఇంకా రిబ్బన్ కటింగ్ జరగడం లేదేమిటి" అని.
ఇంతలో ప్రత్యేక అతిథిని నా ఫ్రండ్ చక్రపాణి తన కారులో తీసుకు వచ్చాడు.
"హోం ఫొర్ చిల్డ్రెన్ విథౌట్ నేమ్స్" ఇంగ్లీషులో నియాన్ సైన్ బోర్డ్ తళతళ మెరుస్తుంది.
ప్రత్యేక అతిథిని చూసి అందరు ఆశ్చర్య పోయారు.
మొహమాట పడుతూ రిబ్బన్ కట్ చేస్తున్నా రాముని చూస్తూనే అందరు చేతులు ఒక్కసారి మారుమ్రోగాయి.

***0***

# దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ






డా. లక్ష్మీ రాఘవ

నారాయణ బయట నుండే "అయ్యగారూ "అని గట్టిగా పిలిచినాడు ఇంటి గేటు దగ్గర.

కరోనా కాలం అని జాగ్రత్తగా వున్న అయ్యగారు అనబడే రామచంద్ర, బయటకు వచ్చి వసారాలో నిలబడి "ఎవరూ?" అన్నాడు.

నారాయణ గేటు లోపలకు వచ్చి నిలబడి, "అయ్యా నేను నారాయణ! ఏకాంబరం కొడుకు రాజు తిరపతి నుండి ఫోను చేసినాడు. ఏకాంబరం కరోనా ఆస్పత్రిలో వున్నారుట, మీతో ఒకసారి మాట్లాడాతానని శానా పట్టింపుగా వున్నాడట. మీ ఫోను నెంబరు అడిగినాడు ..."

"నాతో మాట్లాడాలా? ఎందుకూ ?"

"ఏమో తెలియదు అయ్యా...మీరు నెంబరు రాసిస్తే చెప్తాను!"

"సాయంకాలం రా చెప్తా!" అని రామచంద్ర లోపలకి వెళ్ళినాడు

కరోనా వచ్చి తిరపతికి పోయిన ఆచారి ఏకాంబరానికి తనతో ఏమి పని? దుడ్లు కావాలని అడుగుతాడా? ఏమయివుంటుంది విషయం?... ఆలోచించసాగాడు.

ఇంతలో భార్య పద్మావతి స్టీలు గ్లాసులో టీ తెచ్చి ఇస్తూ "ఎవరు మీతో మాట్లాడింది?" అని అడిగింది.

ఏకాంబరం సంగతి చెప్పినాడు. ఆయన అనుమానం గ్రహించి "ఏకాంబరం శానా ఖచ్చితమైన మనిషి. దుడ్లు కోసం అయివుండదు. రెండేళ్లప్పుడు అత్తగారి కమ్మలు మెరుగు పెట్టి ఇమ్మంటే రెండు రోజుల్లో తీసుకు వచ్చినాడు.'ఆకమ్మలు తాను అమ్మగారికి చేసి ఇచ్చినవేనని, మెరుగు పెట్టినందుకు ఏమీ తీసుకోలేదు కూడా! మనమరాలు పుట్టినప్పుడు కూడా లోలక్కులు ఎంత బాగా చేసినాడో గుర్తుందా? కూలి కూడా ఎక్కువ తీసుకోడు. ఒకసారి ఏకాంబరానిదే ఫోను నెంబరు ఇవ్వమని, మీరే ఫోనులో మాట్లాడకూడదా... దానికి ఇంత యోచన ఎందుకు?"

పద్మావతి చెప్పింది బాగానే వుందనిపించింది.

'ఒకసారి తానే ఫోను చేస్తే సరి' అని నారాయణకు చెప్పి పంపినాడు ఆ సాయంకాలం.

నారాయణను అడిగి ఏకాంబరం కొడుకు ఫోను నెంబరు తీసుకున్నాడు.

మర్నాడు పొద్దున్నే వీలుకాక సాయంకాలం ఆ ఫోనుకి చేశాడు. వెంటనే రాజు తీసుకున్నాడు.
"మధ్యాహ్నం కొంచెం బాగలేకపోతే, ఇంకా లోపలికి తీసకపోయినారు అయ్యా. అక్కడ నేను కూడా పోలేను. బయటే వుండాల. ఫోను కూడా వుండదు." అన్నాడు.
"అయ్యో! ఎట్లా వుందో చెప్పు నాకు. బాగయినాక మాట్లాడించు. ఎందుకో నాతో ఒకసారి మాట్లాడాల అని అన్నాడంట కదా"
"అవును అయ్యా, తగ్గిందని క్వారంటయిన్ సెక్షన్ లో వున్నప్పుడు నాలుగు రోజులు ఒకటే పోరు. 'ఒకసారి అయ్యగారితో మాట్లాడాల. ఈ కరోనాతో ఏమైపోతానో' అని. నేనే తిట్టినా, 'ఏమీకాదు ఇంటికి వచ్చినాక చూడచ్చులే' అని.. వినలా! పోనీ నాతో చెప్పు, నేను చెప్పతా అయ్యగారితో అంటే వినలా, నేనే చెప్పాల, నీకు చెప్పను' అన్నాడు.."
"సరే ఇప్పుడు చేసేదేముంది...వాడి వార్డు నెంబర్ వివరాలు చెప్పితే నేను తిరపతిలో ఎవరితోనైనా చెప్పిస్తా బాగా చూసుకోమని."
"అట్లాగే అయ్యా. మీకు వివరాలు చెప్పతా " అని పెట్టేసినాడు రాజు.

ఏకాంబరం ఏ విషయం చెప్పదలుచుకున్నాడో తెలుసుకోవడానికైనా వాడు కోలుకోవాలి అనుకుంటూ తన ప్రయత్నాలు తాను చేయడం చేశారు రామచంద్ర.
కానీ ఒక కంసాలి తనతోనే చెప్పాలనుకున్న విషయం ఏమిటీ అన్న ఆసక్తి ఎక్కువైంది.. ఎంతగా ఆలోచించినా ఏకాంబరం ఎందుకు అలా అన్నాడు? కంసాలికి మా కుటుంబంతో పని ఏముంటుంది..నగలు చేయించుకోవడం తప్ప?? నమ్మకంగా చేస్తాడు అని అమ్మ ఎప్పుడూ ఏకాంబరంను పిలిచేది దేనికైనా.. ఆ తరువాత ఫాషన్లు మారి సిటీలలో నేరుగా షాపుకు వెళ్ళి కొనడం అలవాటైంది.
తను ఏకాంబరంను చూసి కూడా చాలా రోజులైంది. ఇప్పుడు ఇదేమిటీ? అందులోనూ కరోనా టైమ్ లో!... జవాబు లేని ప్రశ్నగా మిగిలింది.

ఆ రోజే పద్మావతి ఇనప్పెట్టి తెరిచి వస్తువులు సర్దుతూవుంటే గుర్తుకు వచ్చింది. నాయన వీలునామా ఒకసారి చూడాలనిపించి.. భార్యకు చెప్పాడు "వీలునామా పేపర్లు ఒకసారి ఇవ్వు" అని.
తనకూ, తమ్ముడు విశ్వనాధానికీ అన్నీ సమానంగా పంచినా, కాస్త గొడవకు దారితీసిన ఆ వాక్యాన్ని మరోసారి చూద్దామని అన్పించి చదివాడు పెద్దగా.. "నగలు అన్నీ సమానంగా మీ ఇద్దరికీ పంచాక, మనింట్లో తరాలుగా వస్తున్న ఒక అపురూప వజ్రం వుంది. ఒక్కటే అవటం వలన దానిని కాపాడుకోవాలి"

పక్కనే వున్న భార్య పద్మావతి “వజ్రం ఎక్కడ వున్నది అందరం వెదికాము కదా.. అప్పుడే దొరకలేదు! ఎక్కడ దాచారు అన్నదీ రాసి వుండచ్చు మామగారు. మనమే ఏదో చేశామని విశ్వనాధం భార్య కమలకు అనుమానమూ, కోపం కూడా వచ్చింది.”
“ఎందుకూ విశ్వనాధం కూడా అన్నాడు’ ‘సరిగ్గా వెదికారా?’ అని. ఇంతవరకూ నామీద ఎప్పుడూ, ఏ విషయంలోనూ అనుమానం లేదు వాడికి…అందుకే కదా, ఆ రోజు ఇద్దరము కూర్చుని అన్నీ డబ్బీలూ వెదికాము, తరాలుగా వచ్చింది అంటే పోగొట్టుకోకూడదు… పైగా విలువ కలదీ.. జాగ్రత్తగా దాచి వుండాలి అనుకున్నాం కానీ దొరకలేదు.. వీలునామాలో ఫలానా చోట వుంది అని రాసి వుంటే ఇంత తంటా వుండేది కాదు. బహుశా అది విభజన చేయలేము అని ఉమ్మడిగానే వుండాలి అని వదిలేశాడా? అయినా ఇప్పుడు ఆలోచించి లాభం ఏమిటీ ?” అని పేపర్లు వెనక్కి ఇచ్చి లేచాడు రామచంద్ర.
భోజనం అయ్యాక మధ్యాహ్నం కాస్త నడుమ వాల్చడం అలవాటుతో తన గదిలో విశ్రాంతిగా పడుకున్నాడు రామచంద్ర. ఎందుకో అమ్మ గుర్తుకు వచ్చింది. దేవుడి మీద విపరీతమైన భక్తి అమ్మకు. ఎన్ని పూజలు చేసేదో.. చిన్నప్పటి జ్ఞాపకాలు మనసును కదిలించాయి.

ఒక్కసారిగా ఫ్లాష్ లాగా బుర్ర లో ఒక వెలుగు .. ‘ఏకాంబరం కంసాలి కదా. అమ్మ ఆ కాలంలో నగలు చేయించేది ఇతడి దగ్గరే .. బహుశా ఏ నగలోనో వజ్రం అమ్మ పెట్టించి చేయించిందా? అది చెప్పాలనే ఏకాంబరం నాతో ఏదో చెప్పాలని అంటున్నాడా??? ఏమో … అందుకేనేమో’ ఆలోచన రాగానే దిగ్గున లేచి కూర్చున్నాడు రామచంద్ర.
ఫోను తీసుకుని రాజుకు ఫోను చేశాడు ఎత్తగానే “హలో రాజు, ఏకాంబరం ఎట్లా వున్నాడు??” ఆత్రుతగా అడిగాడు.
“ఈ రోజు కొంచెం మేలయిందంట అయ్యా. రెండు రోజుల్లో మళ్ళీ టెస్ట్ చేసి, నెగటివ్ అని వస్తే ఇంటికి తీసుకెళ్లవచ్చు” సంతోషంగా చెప్పాడు రాజు.
“నెగెటివ్ వస్తే చెప్పు నాతో ఒకసారి మాట్లాడించు..”అన్నాడు.
“అట్లాగేనేయ్యా”
కరోనా వచ్చినా తట్టుకోగల శక్తి ఎనభై ఏళ్ల ఏకాంబరంకు వుండటం ఆశ్చర్యం అనిపించింది. ‘రాగి సంగటి తిని బతికినోళ్ళం మాకేమీ రాదు’ అని పల్లెలో అనటం నిజంగా అవునేమో అనిపించింది ఆక్షణంలో.
మూడు రోజుల తరువాత ఏకాంబరంతో రామచంద్ర మాట్లాడినాడు.
“అయ్యా మీతో మాట్లాడకుండా చచ్చిపోకూడదనే బయట పడేసినాడు దేవుడు నన్ను…”
“ఏలా వున్నావు ఏకాంబరం, నీవు బాగయి ఇంటికి వస్తా వున్నావు. చాలా సంతోషంగా వుంది..”

“అయ్యా, నా ఇసయం తరువాత.  ముందు మీకు చెప్పాలనుకున్నది చెప్పేస్తా.. వుండండి కొంచెం మూలగా నిలుచుకుంటా.. ఎవరూ ఇనకూడని మాట అది ..” ఆ మాటలకు ఇంకా ఎంతో ఉత్కంఠ కలిగింది రామచంద్రకు.

“అయ్యా, ఇంటా వున్నారు కదా. మీ ఇంట్లో నగల పనులు అన్నీ నా చేతనే చేయిచ్చేవాళ్ళు పెద్దమ్మగారు. ఆమెకు నా మీద శానా నమ్మకం. కొన్నేళ్ల కింద నన్ను పిలవనంపితే పోయినా. నన్ను లోపల ఒక గదిలోకి పిలచకపోయినారు. ‘ఏకాంబరం ఒక ముఖ్యమైన పనిబడింది నీతో…నీమీద నమ్మకంతో ఈ పని ఒప్పజెప్పుతున్నా. అయ్యగారికి కూడా తెలియకూడదు. అందుకే ఆయన వూరికి పోయినాడని ఈ దినం నిన్ను పిలవనంపినా..”

“చెప్పండి అమ్మగారూ… మీరు ఏమి చెప్పినా చేసి పెడతా”

“మాయింట్లో వున్న వెండి కృష్ణుడి విగ్రహానికి కృష్ణాష్టమి రోజున పూజకు బంగారు కిరీటం పెడతాము. దానిలో మా ఇంట  వున్న ఒక అపురూపమైన వజ్రం వుంది. అది నా చేతిలో నుండి కిందపడి వజ్రం వూడింది. కిరీటమూ, వజ్రమూ ఇస్తా. నీవు జాగ్రత్తగా అతికి ఇస్తావా? ఆ వజ్రం తరతరాలుగా మా ఇంట వుందట. వీళ్ళ తాతగారు ఇలా కిరీటం చేసి పెట్టినారు. ఎవరికి ఇచ్చినా వజ్రం మార్చేస్తారేమోనని భయం. అందుకే నీకు ఇస్తావున్నా చూడు. సరిగా అతికించగలవా చెప్పు” అని రెండూ నా చేతిలో పెట్టినారు. అది నిజంగా అపురూపమైన వజ్రం. ఆమె కోరిన విధంగా పొదిగి చెయ్యచ్చు అనిపించి అదే మాట చెప్పినా’ ఎవరికీ తెలియగూడదు అని మరీ మరీ చెప్పి నా చేత బెట్టింది అమ్మగారు. నాకు ఇచ్చిన దాన్ని అతి జాగ్రత్తగా..మంచిగా పొదిగి రెండు రోజుల్లో ఇచ్చేసినా. ఎవరికీ చెప్పద్దు అన్నది కనక వూరుకున్నా. ఇప్పుడు అయ్యగారూ, అమ్మగారూ కాలం చేసినాక మీ చేతికి వచ్చి వుండాదేమో. ఎప్పుడు దానికి ఏమైనా దగ్గర వుండి రిపేరు చేయించుకోండి అయ్యా…ఇప్పటికాలం అందరినీ నమ్మేతట్టు లేదు. నాకు తెలిసిన ఈ ఇషయాన్ని మీకు చెప్పేసి చావాలి అనుకున్నా.. ఏమీ అనుకోబాకండయ్యా.. ఇప్పుడు అందరూ నాలాగ నమ్మకంగా పని చేస్తారని లేదు. అని ఎచ్చరిస్తామని.. కరోనా వచ్చినాక ఎప్పుడు బోతామో  తెలీదు అనిపించి, నాకు మాత్రమే తెలిసిన  కొన్ని ఇషయాలు చెప్పాల్సిన వాళ్ళకు చెప్పుతా వుంటే మీ ఇంటికి నేను అమ్మ మాటతో రహస్యంగా చేసిన పని ఇది. అని మీతో చెప్పాలనుకున్నా.” ఏకాంబరం ఆపి ఒక నిముషం వూపిరి పీల్చుకున్నాడు.

రామచంద్రకు సంతోషంతో ఏకాంబరానికి చేతులెత్తి నమస్కారం పెట్టాలనిపించింది ఆక్షణంలో…కుటుంబంలో వచ్చిన మనస్పర్థలు తొలగిపోతున్నందుకు…

కరోనా రావటమేమో కానీ.. ఇలా కొన్ని నిజాలని బయటకు రప్పించి రహస్యాలు బయటపడేలా చేస్తూంది అనొచ్చా?

***0***

దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



# ఆవలి ఒడ్డు

కోయిలాడ రామమోహనరావు

"ఒరే హేమంత్... అమెరికా నుంచి విజయ్ వచ్చేసాడట, నీకు తెలుసా?" అని అనంత్ అడిగాడు దార్లో కలిసినప్పుడు.

అడ్డంగా తలూపాను. 'నిన్ననే ఫ్లైట్ దిగాడట' అంటుంటే, నాకు చాలా చిరాకొచ్చింది.

'ఏమిటో అంతగొప్ప? ఆకాశం నుంచి ఊడిపడ్డట్టు చెపుతాడేమిటి?' అనుకొని, నా విసుగును దాచుకుంటూ, వాడి మాటలు వింటున్నాను.

"మంచి రంగు వచ్చాడు. దబ్బపండులా మెరిసిపోతున్నాడు" అంటుంటే నాకు మండు కొచ్చింది. మెల్లిగా వాడి నుంచి తప్పించుకొని అక్కడినుంచి బయట పడ్డాను.

విజయ్ నాకు బాల్య స్నేహితుడు. మూడు సంవత్సరాల క్రితం రిటైర్ అయ్యాడు. ఆరు నెలలు అమెరికాలో, ఆరు నెలలు ఇండియాలో ఉంటూ వస్తున్నాడు. మా పిల్లలు ఇండియాలోనే ఉండడం వల్ల, నాకు వాడిలా అమెరికా వెళ్ళే ఛాన్స్ ఎప్పుడూ రాలేదు. వాడు చీటికి మాటికి అమెరికా వెళ్లి వచ్చేస్తుంటే నాకు చాలా బాధగానూ, జెలసిగానూ ఉంది. 'అరే! వాడు నా ఫ్రెండ్. వాడి మీద పడి ఏడవడమేమిటి?' అని నన్ను నేను నిందించుకుంటాను అప్పుడప్పుడు. అయితే ఆ మార్పు తాత్కాలికమే. కుక్క తోక వంకరన్నట్లు, కొంతసేపటికి మళ్ళా మామూలే. అమెరికా నుంచి వచ్చినప్పుడల్లా కొత్త, కొత్త బట్టలేసుకుంటూ, 'మా అల్లుడిచ్చాడు, నా కొడుకిచ్చాడు, నా కూతురు, నా కోడలిచ్చారు' అంటూ కొత్త కొత్త వస్తువులెన్నో చూపుతుంటే మనసు కుత కుతలాడేది.

చిన్నప్పటి నుంచి నాకన్నా వాడొక మెట్టు పైనే ఉండేవాడు. పీజీ లో సీట్ రాక, నేను డిగ్రీతో చదువు ఆపేసి, ఉన్న ఊరిలోనే ఉద్యోగంలో చేరిపోతే, వాడు పీజీ చేసి బొంబాయి, ఢిల్లీ లాంటి మహానగరాలలో పెద్ద పోస్టులలో పనిచేసే అదృష్టాన్ని దక్కించుకున్నాడు. మా పిల్లలు ఏ విదేశాలకు వెళ్లలేక, మన రాష్ట్రంలోనే సెటిల్ అయిపోతే, వాడి కూతురు, కొడుకు అమెరికాలాంటి పెద్ద దేశంలో ఒకే చోట స్థిరపడ్డారు. వాళ్లు పోటీపడి టిక్కట్లు తీస్తూ విజయ్ ని, వాడి భార్యని రప్పించుకుంటున్నారు. ఇక్కడ మేము కాలుష్యంతోను, అశుభ్రతతోను, స్వల్ప సౌకర్యాలతోనూ బతుకుతుంటే, వాడక్కడ సకల సౌకర్యాలతో వెలిగి

పోతున్నాడు. 'ఇంత వయసొచ్చాక కూడా నేనిలా సంకుచితంగా ఆలోచిస్తున్నానేమిటి?' అని అప్పుడప్పుడనిపించినా, నా మనసు నా కంట్రోల్ లో ఉండటం లేదు.
నేను ఇంట్లో లేనప్పుడు వాడు రెండు సార్లు వచ్చి వెళ్లాడని తెలిసి, వెళ్లకపోతే బాగోదని వాడింటికి వెళ్లి కలిసాను. నన్ను చూడగానే వాడి ముఖం వెలిగిపోయింది. ఆ వెలుగు చూడగానే కొంచెం సిగ్గుపడి, నా భావాలు బయటపడకుండా జాగ్రత్త పడ్డాను. వాడు చెపుతున్న అమెరికా విశేషాలు ఆసక్తిగా వింటున్నట్లు నటించి, కాస్సేపు కూర్చొని వచ్చేసాను.

***

వాడొచ్చి ఆరు నెలలయిపోయింది కాబోలు, మళ్ళీ అమెరికా ప్రయాణ సన్నాహాలు మొదలెట్టాడు. మరో నాలుగు రోజులలో బయల్దేరుతాడు అనుకుంటున్న సమయంలో మా ఇంటికొచ్చి,
"రారా అలా గోదారి గట్టుకెళ్లి వద్దాం" అంటూ బయల్దేరదీసాడు. వాడి వెంట బయలుదేరాను మౌనంగా.
ఇద్దరం ఇసుక తిన్నెల మీద కూర్చున్నాక, వాడేమైనా చెపుతాడేమోనని ఆసక్తిగా చూసాను. వాడేమి మాట్లాడలేదు. వాడిని చూస్తే 'చాలా దుఃఖాన్ని దిగమింగి కూర్చున్నట్లున్నాడు' అనిపించింది. వాడికి అంత కష్టం ఏమొచ్చిందో నాకు అర్ధం కాలేదు. వాణ్ణి అలా చూస్తుంటే నాకు చాలా జాలేసింది. భుజం పట్టుకొని అడిగాను, "ఏమైందిరా అలా ఉన్నావు?" అంటూ. దాంతో ఒక్కసారిగా వాడు బరస్ట్ అయిపోయి వల వలా ఏడ్చేశాడు. నేనెంతో కదిలిపోయాను. ఈ వయసులో, చిన్న పిల్లాడిలా ఏడుస్తున్న వాడిని ఓదార్చడం నా వల్ల కాలేదు. నా కళ్ళమ్మట నీళ్లు గిర్రున తిరిగాయి.
వాడు తేరుకునేసరికి పావుగంట పైనే పట్టింది.
"ఏం బతుకురా నాది? ఈ వయసులో మాకీ శిక్ష ఏమిటిరా? ఇంకెన్నాళ్ళురా?"అంటూ ఉపోద్ఘాతం ఏమీ లేకుండా మొదలెట్టే సరికి, నాకేమి అర్ధంకాక ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాను.
"సారీ నీకు నా విషయలేవీ చెప్పలేదు కదూ? ఈ రోజు నీకంతా చెప్పి, నా బరువు దించుకుందామనుకుంటున్నాను. నీతోసహా అందరూ నేను అమెరికాలో ఉంటూ రాజభోగం అనుభవిస్తున్నాననుకుంటున్నారు కదూ? ఆ అభిప్రాయం తప్పురా. అక్కడ మేము రాజకీయ ఖైదీలం రా. నిజం...మాకు అక్కడ సకల సదుపాయాలు ఉంటాయి, జైల్లో ఉన్న రాజకీయ నాయకులలాగ! కానీ బయటకెళ్లే స్వేచ్ఛ ఉండదు.. ఇదొక్కటే కాదు, గుండెలు పిండే బాధలెన్నో నన్ను తినేస్తున్నాయి. ఇవన్నీ నీకు చెప్పుకుంటేగాని నాకు మనశ్శాంతి కలగదు. చిన్నప్పటి నుంచి నేను చాలా మిస్ అయిపోయానురా. మా అమ్మా, నాన్న అంటే నాకెంత ఇష్టమో నీకు తెలుసు కదా! కానీ వాళ్ళతో ఎంత కాలం గడపగలిగాను? చదువు, ఉద్యోగం వాళ్ల నుంచి నన్ను దూరం చేసేసాయి. వాళ్లకు దగ్గరగా వచ్చేయాలని ట్రాన్స్ఫర్ కోసం ఎంత ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మరో దురదృష్టమేమిటంటే, నేనెంతో ప్రేమించే పిల్లలు కూడా అమెరికా వెళ్లి కూర్చున్నారు. వాళ్ళను వదల్లేక, మనవళ్ని, మనవరాళ్ళని దూరం చేసుకోలేక, మేమే తిరగాల్సి వస్తుంది. ఆఫీసులో గొడ్డు చాకిరి చేసి

వస్తున్న కొడుకు, కూతురు కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నామని, మనవలతోను, మనవరాళ్లతోను గడుపుతున్నామని తృప్తి పడినా, పెద్దవాళ్ళు ఆఫీసులకు, పిల్లలు స్కూళ్లకు వెళ్లిపోయినపుడు, ఎంత బోర్ కొట్టేస్తుందో మీరు ఊహించలేరు. అప్పుడనిపిస్తుంది, మేము రాజకీయ ఖైదీలమేనని. అదో రకమైన మనస్తత్వం గల అల్లుడు, పిసినారి కొడుకు మా బతుకులను మరింత నరకం చేస్తున్నారు.

అమెరికా నుంచి వచ్చినప్పుడల్లా కొత్త బట్టలేసుకుని పోజ్ కొడుతున్నానని, మీరు జోకులేసేవారు గుర్తుందా? ఆ షర్ట్ లన్నీ మా అల్లుడు ఒకసారి వాడి వదిలేసినవే. చెప్పానుగా అతనొక టైప్ అని. అలా వేస్ట్ చెయ్యడం ఇష్టం లేక, నేనే వేసుకుంటాను. మేము తీసుకువెళ్ళిన వస్తువులు కూడా వాళ్ళు నిర్లక్ష్యంగా వదిలేసినవే. పెద్ద స్టేటస్ లో బ్రతికిన మా ఆవిడ, అక్కడ ఆయాలాగా, పనిమనిషిలాగా, వంటమనిషిలా పనిచేస్తూ కష్టపడుతుంటే ఎంత బాధగా ఉంటుందో ఆలోచించరా? కూతురు కష్టపడుతుందని, సర్వీస్ చేస్తే సరిపోతుందా! కోడలికి కూడా చెయ్యాలి కదా! అలా అక్కడా ఇక్కడా నలిగిపోతున్నాయిరా మా బతుకులు. ఇవన్నీ ఎవరికి చెప్పుకోగలం? అందుకే నీకు చెపితే కొంత భారం తగ్గుతుందని తాపత్రయపడుతున్నాను.

మరో విషయం... ఈ మూడేళ్లలో మాకు చూపించింది, ఒక్క నయగరా ఫాల్స్, రెండు నేషనల్ పార్కులే అంటే నమ్ముతావా! మేమంటే వాళ్లకు అంతే కన్సర్న్. వాళ్ల మీద ప్రేమతో ఇవన్నీ భరించక తప్పటం లేదు. భగవంతుడు నీకిచ్చినంత సుఖమైన జీవితాన్ని నాకెందుకివ్వలేదు.. అని నేనెన్ని సార్లు అనుకున్నానో నాకే తెలియదు." అంటుంటే షాక్ తిన్నట్లయింది నాకు! రెండు నిముషాలు మౌనంగా ఉండిపోయాడు. నాకేం మాటలు రాలేదు.

తిరిగి.. చెమ్మగిల్లిన కళ్ళని తుడుచుకుంటూ మళ్ళీ అన్నాడు. "నువ్వు చాలా అదృష్టవంతుడివి. అమ్మా, నాన్నలుండే స్వంత ఊరిలో ఉద్యోగం. పిల్లలు కూడా నీకు అందుబాటులో ఉండేలా సెటిల్ అయ్యారు. ఎప్పుడు కావాలిస్తే అప్పుడొచ్చి వాలతారు. పోస్లే, నా ప్రాణమిత్రుడికయినా ఆ అదృష్టం దక్కిందనుకుంటూ పొంగిపోతూ ఉంటాను" అంటుంటే, అపరాధ భావనతో నాకు దుఃఖం ఆగలేదు.

పశ్చాత్తాపంతో కుమిలిపోతూ, కన్నీళ్లు ధారాపాతంగా వచ్చేస్తుంటే, వాడి గురించే ఏడ్చేస్తున్నాననుకొని వాడు అల్లాడిపోతుంటే సిగ్గుతో చచ్చాను. ఈ సారి నన్ను ఓదార్చడం వాడి తరం కాలేదు.

'ఊరుకోరా, నా గురించి బాధపడకు అంటూ ఓదార్చుతున్న పిచ్చివాడినేమనాలి!' అనుకుంటూ మామూలు పరిస్థితికి రావడానికి ప్రయత్నించాను. నా కన్నీళ్లతో నాలోని కల్మషమంతా కరిగిపోయి, మనసు తేటగా మారింది. తృప్తిగా ఊపిరి పీల్చాను. నా ప్రాణమిత్రుణ్ణి మనసారా కౌగలించుకున్నాను.

వాడి కష్టం నేను తీర్చలేను. కానీ, పరిస్థితులను తట్టుకునే నైతిక ధైర్యాన్ని ఇవ్వగలను. ఆ సమర్థత నాకుందనే నమ్మకం నాకుంది. 'వాడి సమస్యలకు పరిష్కారం గురించి కూడా తీవ్రంగా ఆలోచించే ప్రయత్నం చేస్తాను. ఏదో ఒక మార్గం దొరక్కపోదు. ఇకపై వాడినిలా వదిలేయను. వాడికి నేనున్నాను' అనుకోగానే, ఎంతో రిలీఫ్ గా ఫీలయ్యాను.

***0***

## దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ



# ఈ పని చాలు నాకు

పొత్తూరి విజయలక్ష్మి

సాయంత్రం ఆరు గంటలు అయింది .

పని ముగించి బయట పడింది సీత. రోడ్డు మీదకు వచ్చి సిగ్నల్ దాకా నడిచి యెడమ వైపుకి తిరిగి చూసింది. ఎమరాల్డ్ స్వీట్ షాప్ దగ్గర ఆటో ఆపుకుని కూచున్న మూర్తిని చూసి ప్రాణం లేచి వచ్చింది. గబ గబ అడుగులు వెయ్యాలని ప్రయత్నించింది. ఆ వేళ మరీ బరువుగా ఉన్నాయి సంచులు. మూర్తి సీతను చూడగానే చెయ్యి వూపాడు. వచ్చి అలసటగా ఆటో ఎక్కింది. ఆటో స్టార్ట్ చేసాడు. సిగ్నల్ దాకా వచ్చి ఎడమవైపుకు తిరిగి ధర్నాచౌక్ దాటి, చివరి దాకా వెళ్లి ఆ జంక్షన్ లో యెడమ వైపు వున్న ఓ సందు దగ్గర ఆపాడు. ఆటో దిగింది సీత.

"లడ్డూలు వున్నాయి మూర్తీ ... ఇవ్వనా?" అని అడిగింది.

"వద్దులే" అనేసి వెళ్ళిపోయాడు.

సీతను చూడగానే రోడ్డు పక్కన ఆడుకుంటున్న పిల్లలు పరిగెత్తుకు వచ్చారు. సంచి తీసి గారెలు, బూరెలు లడ్డూలు వాళ్లకి సమానంగా పంచింది. సందులోకి వెళ్ళింది. పక్షి గూళ్ళలాగా ఉన్నాయి అక్కడ ఇళ్లు. ఓ గది ముందు ఆగి తాళం తీసి లోపలికి వెళ్ళింది. చిన్న గది. లైట్ వేసుకొని చాప పరుచుకొని అలసటగా నడుము వాల్చింది.

'సీతా' అంటూ వచ్చింది రాణి.

"ఆ సంచి లో ఉంది తీసుకో!" అంది సీత.

"నాకు చేత కాదులే... నువ్వే ఇవ్వు!" అన్నది రాణి.

లేచి కవరు తీసి ప్లాస్టిక్ గ్లాసులో వున్న అల్లం పచ్చడి రాణికి ఇచ్చింది. రాణి కడుపుతో వుంది. అల్లం పచ్చడి అంటే చాలా ఇష్టం. ఆమె మొగుడు సైకిల్ మీద చిన్న సమోసాలు అమ్ముతాడు. వస్తూ నాలుగు సమోసాలు పొట్లం కట్టి పట్టుకొచ్చింది రాణి .

"ఇదుగో తీసుకో." అంది

"అక్కడ పెట్టు తర్వాత తింటాను!" అని మళ్లీ పడుకుంది.

సీతకు నలభై దాటాయి. గూని వుంది. వాళ్ళు అప్పట్లో పల్లెటూళ్ళో వుండేవాళ్ళు. మొదటి సంతానం సీత. ఆ పేరు పెట్టాడు తండ్రి. 'సీత పేరు పెడితే కష్టాలు వస్తాయిట వద్దురా' అని తల్లి చెప్పినా వినిపించుకోలేదు.

పుట్టుకతోనే అవకరం. ఇంకా ఏం కష్టాలు వస్తాయిలే అనేశాడు. సీతకు ఏడాది వయసు వచ్చేసరికి పేరుకు ముందు 'గూని' ఒక బిరుదులాగా వచ్చి చేరింది. ఆ తర్వాత ఒక మగపిల్లవాడు ఒక ఆడపిల్ల పుట్టారు ఆయనకి. వాళ్ళు బాగానే ఉన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని సంసారం వాళ్ళది. పిల్లలు పెరిగి పెద్దవాళ్ళు అయ్యారు. సీత తప్ప మిగిలిన ఇద్దరూ పెళ్లి చేసుకుని వాళ్ళ బతుకులు వాళ్ళు బతుకుతున్నారు. సీత జీవితం గురించి దిగులు పట్టుకుంది తల్లిదండ్రులకు. ఎవడో ఒకడిని చూసి పెళ్లి చేద్దామనుకున్నారు. కానీ సీత వద్దు అంటే వద్దంది.

"నాకు తోడుగా వుంటాడని నా మెడకు ఓ గుది బండలా ఎవరినో తగిలించి నాకు మరిన్ని సమస్యలు తెచ్చి పెట్టకండి" అన్నది.

అదీ నిజమే అని వూరుకున్నారు. కొంత కాలానికి తల్లి పోయింది. తండ్రి కొడుకు దగ్గరకు వెళ్ళాడు. అక్కని వచ్చి తమ దగ్గర వుండమని తమ్ముడు, చెల్లెలు చెప్పారు. గానీ సీత అందుకు ఒప్పుకోలేదు

ఇది ఒక రోజుతో పోయే వ్యవహారం కాదు జీవితాంతం ఉండే సమస్య. ఇంకొకరి మీద ఆధారపడటం మంచిది కాదు.

"ఏదో పని చేసుకుంటూ బతకడానికి ప్రయత్నం చేస్తాను. చేతకాకపోతే అప్పుడే వస్తాను" అని చెప్పింది.

బరువు పనులు చేయగల శక్తి లేదు. చదువు సంధ్య ముందే లేదు. కాబట్టి జీవనం సాగించడం కష్టమే. కానీ అసాధ్యం మాత్రం కాదు. అందుకే సీత ప్రయత్నం ఫలించింది. ఓ ఫలహారాల బండి దగ్గర పని దొరికింది. వారం రోజులు అక్కడ పని చేసిందో లేదో సత్యారావు పరిచయమయ్యాడు. అతనికి అర్జెంటుగా ఒక మనిషి కావాలి. అందుకే 'ఇంతకంటే ఎక్కువ జీతం వచ్చే పని ఇప్పిస్తాను వస్తావా?' అని అడిగాడు.

వెంటనే అంగీకరించింది. పని ఇప్పించాడు.

అతనికి మనిషి అవసరం చాలా ఉంది. బోలెడంత పని ఉంటుంది. అక్కడ పనిచేసే మనుషులు స్థిరంగా వుండరు. ఇంకెక్కడైనా పని దొరకగానే జారుకుంటారు. కానీ సీత మాత్రం నాలుగేళ్లుగా అక్కడే పని చేస్తోంది.

లోయర్ ట్యాంక్ బండ్ దగ్గర ఉంది భారత్ సేవాశ్రమం. అనునిత్యం అపరకర్మలు జరుగుతూ ఉంటాయి. అక్కడ పని చేస్తాడు సత్యారావు. పనివాళ్ళు అందరి మీద అజమాయిషీ.. జీతం బాగానే ముడుతుంది.

"నీకు పదిహేను వందలు జీతం ఇస్తాను. అదీకాక పదో, పాతికో ముడుతూనే వుంటాయి." అన్నాడు.

మహానగరంలో నెలకు పదేహేను వందల సంపాదనతో ఒక మనిషి బతకడం కష్టం. కానీ సీత బాగానే బతుకుతోంది.

ఇందిరా పార్కుకి అటుపక్క ఓ సందులో గది సత్యారావే మాట్లాడి పెట్టాడు. ఇద్దరు వుండచ్చుఆ గదిలో. అద్దె పన్నెండు వందలు. చెరో ఆరు వందలు పడుతుంది.. సీత వెళ్ళేసరికే ఒక అమ్మాయి వుంది ఆగదిలో. కృష్ణకుమారి. రామకృష్ణ మఠం రోడ్డులో ఉన్న ఒక హాస్పిటల్ లో ఆయాగా పనిచేసేది. కొన్నాళ్ల తర్వాత

గది ఖాళీ చేసి వెళ్ళిపోయింది. నాలుగు ఇళ్లలో పని చేసుకునే యాదమ్మ, ఆకు కూరలు అమ్ముకునే రాములమ్మ, అట్లా ఎంతో మంది వచ్చారు. వెళ్ళి పోయారు.

సీత మాత్రం నాలుగేళ్లుగా అక్కడే స్థిరంగా వుంది. ప్రస్తుతం ఒక్కతే ఉంది. ఫస్టునించీ ఇంకో మనిషి వస్తుందని చెప్పాడు ఇంటి ఓనరు.

పొద్దున్నే లేచి, స్నానం చేసి, గది తాళం వేసి, బయటికి వచ్చి ఖాళీ కడుపుతోనే బయలుదేరి వెళ్తుంది. లోయర్ ట్యాంక్ బండ్ రోడ్డులో కాస్త దూరం వెళ్లేసరికి, ఆ పక్కనే ఉన్న డంపింగ్ యార్డ్ నుంచి భరించలేని దుర్వాసన. కడుపులో తిప్పటం. ఒక్కోసారి వాంతి వస్తుంది.

సాధ్యమైనంత వేగంగా నడుస్తూ గమ్యం చేరుతుంది. సత్యారావు కాఫీ ఇప్పిస్తాడు. కాఫీ తాగి పనిలోకి దిగుతుంది సీత. ఎవరు ఏ పని చెప్పినా చెయ్యటమే సీత పని.

సేవాశ్రమంలో ప్రతి రోజు కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. ఒకటి కాదు. ఆరేడు పార్టీలు వస్తాయి. తడి బట్టలు, దర్భలు, నల్ల నువ్వులు, పిండాలు, దానాలు. అదో రకమైన వాతావరణం.

అరవై దాటిన పెద్ద కొడుకు కర్మ చేస్తూ ఉంటే, పక్కన కూర్చున్న తమ్ముళ్ళు యజ్ఞోపవీతం సవ్యం అపసవ్యం చేసుకుంటూ ఉంటే ఆ దృశ్యం బాగానే ఉంటుంది. పక్కన బంధువులు కుర్చీల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ మధ్య మధ్యలో పోయిన ఆ వ్యక్తిని తలచుకుని, అదృష్టవంతుడు అనుకుంటూ... మధ్య మధ్యలో కాఫీ తాగుతూ వుంటారు.

ఇంకొన్ని సందర్భాలలో ముప్పై దాటిన వ్యక్తి కర్మ చేస్తూ ఉంటాడు. లోపల గదిలో అతని తల్లి కూర్చుని ఏడుస్తూ ఉంటుంది. తోటి వాళ్ళందరూ ఆవిడని ఓదారుస్తూ ఉంటారు. 'అయ్యో పాపం! వంటరి అయిపోయింది' అని మనసు చివుక్కుమంటుంది.

ఇంకొన్ని సార్లు హృదయ విదారకంగా ఉంటుంది పరిస్థితి. బాధ్యతలు తీరని వ్యక్తి వెళ్ళిపోతే, పూర్తిగా ప్రపంచజ్ఞానం లేని కొడుకు కర్మ చేస్తూ ఉంటాడు. అతనికి సహాయంగా పక్కనే మేనమామ లేదా పెద్ద తండ్రి ఉంటారు. ఆడవాళ్ళంతా ఏడుస్తూ వుంటారు.

మనుషులు మారటమే తప్పించి అవే దృశ్యాలు.

అటువంటి చోట పగలంతా ఏదో పని చేస్తూనే వుంటుంది సీత. కాఫీ ఇవ్వటం. కప్పులు తీయటం. సరుకులు, సామాన్లు అందించటం, చిమ్మటం, తడిగుడ్డతో తుడవడం, గోదానం సమయంలో పేడ ఎత్తటం, అదీ ఇదీ.. అని తేడా లేకుండా చేసుకు పోతుంది.

అయిదు గంటలకు పని అయిపోతుంది. అన్నీ సర్దుకుని బయట పడేసరికి కాస్త అటు ఇటుగా ఆరు గంటలు అవుతుంది. రాగానే చెంబెడు నీళ్లుపోసుకుని పడుకుంటుంది..

కానీ ఆ రోజు మనసంతా చేదుగా అయిపోయింది. ఆ దృశ్యం తల్చుకుంటే కడుపులో మంట.

పాపం పాతికేళ్లు కూడా లేవు ఆవిడకి. బైక్ ప్రమాదంలో పోయాడు భర్త. ఓ పసివాడు... పదో నెల! వాడి మీద కర్తృత్వం పెట్టి, పోయిన వాడి సోదరుడు కర్మ చేశాడు. ఆశీర్వచనం అయ్యాక అక్షింతలు జల్లాలని

తల్లి దగ్గర పాలు తాగుతున్న  పసివాడిని తీసికెళ్ళి కొత్తబట్టలు పెట్టారు.  కడుపు నిండక వాడు ఏడుపు. కడుపు మంటతో అక్కడున్న వాళ్ళు ఏడుపు.

ఓ మూల బల్లమీద టీ పెట్టుకుని నిలబడిన సీత తట్టుకోలేక పోయింది. అక్కడ నుండి పారిపోవాలని పించింది.  అలా పారిపోయే అవకాశం లేదు.

వాళ్ళు కాస్త తేరుకున్న తరువాత టీ ఇచ్చింది అందరికీ.  ఆ కప్పులన్నీ ఏరి పారేయటంతో ఆ పూట  పని ముగిసింది. మేడ దిగి కిందికి వచ్చింది. అక్కడ  కూచుని ఉన్నాడు సత్యారావు.

'ఇక నేను వెళ్తాను' అంది.  తలాడించి కొంత డబ్బు ఆమె చేతుల్లో పెట్టాడు.  ఇదుగో అని ఓ ప్లాస్టిక్ కవర్లు ఇచ్చాడు.  అదంతా రోజూ జరిగేదే.

మూర్తి ఆటోలో ఇంటికి వచ్చి పడింది.

ఆవేళ ఆకలీ లేదు. నిద్రా పట్టలేదు.   ఆ పని మానేద్దామా..  దీని బదులు,  పెళ్లిళ్లలో క్యాటరింగ్ చేసే వాళ్ళ దగ్గర పనిలో కుదిరితే సరిపోతుంది.  ప్రయత్నిస్తే పని దొరక్కపోదు అనిపించింది.  లేచి స్నానం చేసి గదిలో ఓ మూల గూట్లో ఉన్న దేవుడి ఫోటోకి దండం పెట్టుకుని, ఒక అగరువత్తి వెలిగించింది.  తలుపు చప్పుడు అయ్యింది.  'తీసే ఉంది రా' అన్నది.  తలుపు తోసుకుని వచ్చింది లక్ష్మి.

"ఏం తీసుకొచ్చావు?" అంటూ ప్లాస్టిక్ కవర్ తీసి చూసింది.

పులిహోర, నూపొడి, రెండు రకాల పచ్చళ్లు, మామిడికాయ పప్పు ఉన్నాయి. ఇద్దరికి సరిపడ అన్నం వుంది. అన్నీ తీసుకు పో" అంది సీత.

"మరి నువ్వేం తింటావ్?" అని అడిగింది లక్ష్మి

"నాకు ఆకలి లేదు. ఇందాక రాణి సమోసాలు తెచ్చిపెట్టింది. ఆకలేస్తే తింటాలే!" అనేసింది సీత.

ఆ పదార్థాలన్నీ పట్టుకువెళ్లి, పావుగంట తర్వాత తిరిగి వచ్చింది లక్ష్మి.  రెండు చపాతీలు, వేడి బంగాళదుంప కూర తెచ్చింది

"ఇదిగో...  ఇవి తిను.  ఏమి తినకపోతే నీరస పడిపోవూ! రేపు పనికి పోవద్దా!" అని మంచినీళ్లు కూడా ఇచ్చి, ఆ కబురూ ఈ కబురూ చెప్తూ కూర్చుంది.

మధ్యాహ్నం కూడా భోజనం చేయలేదు. వేడి చపాతీలు చూడగానే ఆకలి అనిపించింది. ఆవురావురుమంటూ తినేసింది సీత.  'ఇక పడుకో' అని వెళ్ళిపోయింది లక్ష్మి.

చాప మీద పడుకుని మళ్లీ ఆలోచించింది సీత.

తను వుంటున్నది ఒక బస్తీ.   నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది అని సీత అందరి చేత మంచి అనిపించుకుంది. తను పనిచేసే చోట, ప్రతిరోజు బోలెడన్ని ఆహార పదార్థాలు మిగిలిపోతుంటాయి.  అవి పని వాళ్లకి పంచేస్తారు.  అవన్నీ తీసుకొచ్చి అందరికీ పంచుతుంది.  కొంతమంది చావు భోజనం అని తీసుకోరు గాని, పట్టింపులేని వాళ్ళు పరుగున వస్తారు.  అపురూపంగా తీసుకువెళ్తారు.  చిన్న పిల్లలు సీత కోసం ఎదురు చూస్తూ వుంటారు.  గారెలు, అప్పాలు, ఒక్కోసారి లడ్డూలు, బాదుషాలు తెస్తుంది.  వేవిళ్ల తల్లి అల్లం

పచ్చడి కోసం ఆశపడితే, మంచంలో వున్న ముసలమ్మ నోటికి రుచిగా పులిహోర కోసం ఆశపడుతుంది. వాళ్ళ కోసం అవతల వాళ్ళు ఇచ్చింది వద్దనకుండా బరువైనా మోసుకు వస్తుంది .

రోజు అదే తిండి తిని సీతకు మొహం మొత్తి పోయింది. కాబట్టి పగలుపూట మజ్జిగ అన్నం తింటుంది. సీత సంగతి తెలిసిన చుట్టుపక్కల వాళ్ళు అక్కడే రోడ్డు మీద ఉన్న బండిమీద నుంచి ఓ ప్లేట్ ఇడ్లీ లేదా చపాతి కూర, నూడుల్స్ ఏదో ఒకటి తెచ్చి పెడతారు.

అందరికీ సీత అంటే అదో విధమైన ఆపేక్ష.

ఆ ఇళ్లలో ఆటో నడిపే డ్రైవర్లు ఉన్నారు. వాళ్ళు ఆ సమయానికి అటువైపుగా వస్తుంటే సీత కోసం ఆగి దిగబెట్టి వెళ్తారు. సీత లేచిందా, తిన్నదా లేదా అని చూసుకుంటారు. అదంతా గుర్తు చేసుకుంది.

ఈ పని వదిలేసి వేరేచోటకి వెళ్లినా అక్కడా ఇటువంటి పనే చేయాలి. కూరలు తరగడం లేదా చెత్త ఎత్తటం అంతే. పెళ్లి కదా అని తన చేత తలంబ్రాలు కలిపించరు. మంగళ హారతి పట్టించరు. అవన్నీ అట్లా వుంచి ఇన్నేసి ఆహార పదార్థాలు పనివాళ్లకు ఇవ్వరు.

ఇక్కడ నా బతుకు నేను బతుకుతూ సాటి వాళ్ళకి ఇంత పెట్ట గలుగుతున్నాను.

ఇక ఆ వాతావరణం .. చావులు ఏడుపులు అంటే..మరి తప్పదు. రాజైనా, బంటైనా అందరి ప్రయాణం అక్కడ ముగియాల్సిందే. సంతోషంగా ఉన్న సమయంలో పది మంది వస్తారు సాయం చేయడానికి. దుఃఖంలో ఉన్న వారికి సాయం చేయడం పుణ్యం కూడాను. దేవుడు నాకు ఇదే ఉత్తమం అనుకున్నాడేమో. పరమాత్ముడి నిర్ణయం ముందు మనం ఎంత అనుకుంది. తేలిక పడిన మనసుతో నిద్రపోయింది.

మర్నాడు పొద్దున్నే లేచి, స్నానం చేసి దీపం పెట్టుకుని, మూల గూట్లో ఉన్న రెండు ఖాళీ ప్లాస్టిక్ కవర్లు తీసుకుని గదికి తాళం పెట్టి బయలుదేరింది. రోడ్డు మీదికి వచ్చి నాలుగు అడుగులు వేసేసరికి, ఆటో పక్కన ఆగింది. యాదయ్య..!

"దిగబెట్టి పోతాను రా!' అన్నాడు.

ఆశ్రమం గేటు దగ్గర దిగబెట్టాడు. గేటు దాటి లోపలికి వెళ్ళేసరికి ఎదురుగుండా కామధేనువులాంటి గోమాత. గోవుకు ప్రదక్షిణం చేసి దండం పెట్టుకుని ప్రశాంతంగా పనిలోకి వెళ్ళిపోయింది సీత.

***0***



# ప్రమాదాల అంచులలో

ఘండికోట విశ్వనాథం

ప్రతి సంవత్సరంలాగే ఆ ఏడు కూడా మార్చి నాలుగవ తేదీన జాతీయ భద్రతా వారోత్సవాలు మొదలయ్యాయి. వారోత్సవాలు మొదలైన మూడవ రోజు "సౌత్ ఇండియా కన్స్ట్రక్షన్స్" వారి సైటులో జరిగిన ప్రమాదంలో ఒక శ్రామికుడు మరణించాడు. రికార్డుల ప్రకారం, మృతుడు పెల్లూరు రమేష్ గా గుర్తించారు.

ఆరోజు, సేఫ్టీ కమిటీ విచారణలో మొదటి రోజు. సరిగ్గా జాతీయ భద్రతా వారోత్సవాల సమయంలో ఫేటల్ ఆక్సిడెంట్ జరగడం అందరినీ కలవరపరుస్తోంది.

"సౌత్ ఇండియా కన్స్ట్రక్షన్స్" దేశంలోని నిర్మాణ రంగంలో ఉన్న పెద్ద సంస్థలలో ఒకటి. వారు వంగ రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద ఉక్కు కర్మాగారం ఆధునికీకరణలోని భాగంగా, ఒక మెగా ప్రాజెక్టుని చేజిక్కించుకున్నారు. ఆ సంస్థకి కర్మాగారాల ప్రాజెక్టులలో అనుభవం లేకపోయినప్పటికీ, ఆ రంగంలో అనుభవమున్న ఒక విదేశీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని ఈ ప్రాజెక్టు చేపట్టింది.

ప్రాజెక్టు మొదలుపెట్టిన దగ్గర నుంచీ పని సజావుగా సాగిపోతోంది. దురదృష్టవశాత్తూ, రెండు రోజుల క్రితమే జరిగిన ప్రమాదంలో ఒక కార్మికుడు మరణించడం, ఉక్కు కర్మాగార యాజమాన్యం చాలా సీరియస్ గా తీసుకుంది. సైటులోని ప్రమాదాలలో జరిగే చావులకి వారు ప్రభుత్వానికి జవాబుదారీగా ఉంటారు.

ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్న జనరల్ మానేజరు స్థాయి అధికారి చటర్జీగారు సేఫ్టీ కమిటీకి అధ్యక్షులు. అదే సంస్థ తరఫున సేఫ్టీ అధికారి భాస్కర్ గుప్తా, ప్రాజెక్టు మేనేజరు తివారి, పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారి సక్సేనా.. కమిటీలో సభ్యులు. కాంట్రాక్టర్లు తరఫున సైటు ఇంఛార్జ్ రావుగారు, హతుని తరఫున కార్మిక సంఘం నాయకులిద్దరు పాల్గొన్నారు.

చటర్జీగారు విచారణ ప్రారంభించారు.

"కాంట్రాక్టు ఒప్పందంలో సేఫ్టీకి ప్రాధాన్యత ఇచ్చినా, ఈవిధంగా ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం శోచనీయం. జరిగినదానికి మనమేమీ చేయలేము కాని, మున్ముందు ఈ విధమైన ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను చర్చించుకోవడం ఎంతైనా అవసరం...."

చటర్జీగారి మాటలకు కార్మిక నాయకుడు దూబే అడ్డు తగిలాడు.

"ఏమిటి సాబ్, అయినదేమో అయిపోయిందని అంటున్నారు. కంట్రాక్టరుగారి అజాగ్రత్త ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. చనిపోయినవాడి కుటుంబం గతి ఏమిటి? కుటుంబమంతా అతని సంపాదన మీదనే

ఆధారపడి ఉన్నారు. పది లక్షలకు తక్కువ కాకుండా కాంపెన్సేషను, మృతుడి భార్యకి పెర్మనెంటు ఉద్యోగం డిమాండు చేస్తున్నాము."

దూబేని మనసులో తిట్టుకుంటూ, పైకి మాత్రం ముఖానికి నవ్వు పులుముకున్నాడు చటర్జీ.

"అవును, ఆ విషయానికే వస్తున్నాము. ఎవరి అశ్రద్ధ వలన ఈ ప్రమాదం జరిగిందో తేల్చాలి. తరవాత కాంపెన్సేషను అవీ అన్నీ ఉన్నాయి. ముందు విచారణ జరగనీయండి దూబేజీ..." అప్పటికి కొంత శాంతించాడు దూబే.

"సార్, ముందు ప్రమాదమయిన వెంటనే ఘటనాస్థలికి వెళ్ళివచ్చిన మన సేఫ్టీ డిపార్ట్మెంట్ వారి నివేదిక, స్థలంలో హతునితో బాటు పనిచేస్తున్న వారిచ్చిన వాంగ్మూలాలు పరిశీలిస్తాం. గుత్తేదారు సైటు ఇంఛార్జి రావుగారి స్టేట్మెంట్ కూడా తీసుకుంటాం..." అంటూ మధ్యలో కలుగచేసుకున్నాడు తివారి.

"మీ పని పూర్తి చేయండి గుప్తాజీ, నివేదిక భద్రతా వారోత్సవాలు ముగిసే లోపుగా నాకు చేరాలి. భద్రతా విషయంలో మన సంస్థ, ప్రభుత్వ సంస్థలన్నిటిలోను మిన్నగా నిలిచింది. ఈ సంవత్సరం మొదటి బహుమతిగా 'సేఫ్టీ షీల్డు' కోల్పోవడం సమంజసం కాదు. "

చటర్జీ గారు తమ ఆఖరి వాక్యంలో విచారణ కమిటీకి అంతర్లీనంగా ఏదో ఆదేశించినట్లనిపించింది రావు గారికి. విచారణలో మొదటిరోజు తోటి పనివాళ్ళ వాంగ్మూలాలు పరిశీలించడంతోను, సాధారణ ప్రశ్నలతోను పూర్తయింది.

***

రెండవ రోజు విచారణ భాస్కర్ గుప్తా నేతృత్వంలో జరుగుతోంది. గుప్తాతోబాటు తివారి, సక్సేనా, రావుగారు ఉన్నారు.

"నిన్న మనం చాలా విషయాలు పరిశీలించాం." అన్నాడు భాస్కర్ గుప్తా.

"నిన్న పరిశీలించిన వాటిలో కొన్ని డాక్యుమెంట్లు లేవు. రావుగారూ...! మృతుడి ఐడెంటిటీ కార్డు దొరికిందా?" ప్రశ్నించాడు సక్సేనా.

"ఇంకా దొరకలేదు సార్. ఆసుపత్రికి తీసుకుని వెళ్లే హడావిడిలో ఎవరి దగ్గర అది ఉండిపోయిందో తెలియడం లేదు. మా ప్రయత్నాలు మేము చేస్తున్నాము."

"మీరు ఎంత తొందరగా అది సంపాదిస్తే అంత మంచిది మనకందరికీ. తివారీ...! ఈ రోజు రావుగారి స్టేట్ మెంట్ తీసుకోవాలి....." టేబిలు మీద నున్న నీళ్ళ బాటిలు తెరచి గొంతు తడుపుకుని, భాస్కర్ గుప్తా మళ్ళా ప్రశ్నించాడు రావుగారిని.

"రావుగారు, మీ స్టేట్ మెంట్ వ్రాసి ఇచ్చేముందు కొన్ని రొటీన్ ప్రశ్నలు.. మీ సైటులో ప్రమాదం జరిగిన రోజు ఎంతమంది పనిచేస్తున్నారు?"

"ప్రతిరోజు మాదిరిగానే వేయిమందికి పైగానే ఉంటారు. పదిహేను రోజుల క్రితం మీ సంస్థ నుండి సైటులో పని చురుకుగా అవటంలేదని మా యాజమాన్యానికి ఫిర్యాదు వెళ్ళింది. అప్పటినుండి పనివాళ్ళ సంఖ్య

పెరిగింది. కరోనా దృష్ట్యా పనివాళ్ళు దొరకడం కష్టమవుతోంది. ఎక్కడెక్కడి నుంచో పనివాళ్ళను రప్పించేసరికి మా పని అయిపోతున్నాది."
"పనివాళ్ళ సంఖ్య పెంచమంటే భద్రతా నియమాలు ఉల్లంఘించమని కాదుగా రావ్ జీ!" తివారీ మధ్యలో కలుగజేసుకున్నాడు
"అవుననుకోండి. అయినా మీకు తెలుసుగా! వంద శాతం వర్కర్లకు సేఫ్టీ ఇండక్షన్ ట్రైనింగు ఇచ్చి, పెర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్మెంట్ ఇస్తాము."
రావుగారి జవాబుతో తృప్తిపడలేదు గుప్తా. మళ్ళా భద్రతా విషయాల మీద ప్రశ్నలు సంధించాడు.
"వాటెబౌట్ వర్కింగ్ ఎట్ హైట్స్? ప్రమాదం జరిగే సమయంలో మృతుడు ఇరవై మీటర్ల ఎత్తులో పనిచేస్తున్నాడు. అక్కడ నుండి జారినవాడు అంచెలంచెలుగా నేలమీద పడ్డాడు. తలకి తీవ్రమైన గాయాలతో అతడిని ఆసుపత్రికి తీసుకువెళ్ళేరు. డాక్టరు రిపోర్ట్ లో 'బ్రాట్ డెడ్' అని ఉంది."
"ఫ్యాబ్రికేటెడ్ నిచ్చెనలు ఎక్కుతున్నప్పుడు మెట్లకు ఒక లాన్యార్డ్ తగిలించుకుంటూ వెళ్ళాలి. రెండవ లాన్యార్డ్ ని నిచ్చెనకి సమానాంతరంగా కట్టిన బలమైనతాడుతో బాటు ఉన్న ఫాల్ అరెస్టర్ కి తగిలించాలి. కాని మృతుడు నిచ్చెన దిగేటపుడు ఫాల్ అరెస్టరు ఉపయోగించలేదు."
"మరి ఉదయం నిచ్చెన ఎక్కేటప్పుడు ఫాల్ అరెస్టరు ఉపయోగించాడా?"
"సూపర్వైజరు రిపోర్ట్ లో మృతుడు నిచ్చెన ఎక్కేటప్పుడు హెల్మెట్ ధరించి, డబల్ లాన్యార్డు, ఫాల్ అరెస్టరు కూడా ఉపయోగించినట్లు ఉన్నాది కదా?"
"మేము మీ సూపర్విజన్ ని సందేహించడం లేదు. బట్ సంథింగ్ వెంట్ హారిబ్లీ రాంగ్ రావ్ జీ."
విచారణ ముగిసింది. సైటు ఆఫీసుకి వెళ్ళకుండా నేరుగా లేబర్ కాలనీ వైపు దారితీసారు రావుగారు.

***

ఆరోజు రావుగారు సూర్యోదయం కాకముందే సైటుకి వచ్చేసారు. ఆఫీసు వరండాలో నిల్చున్న రావుగారి మనసుకి మంచు తెరలు చీలుస్తూ, కోక్ ఓవెన్ చిమ్నీ మీద ఉదయిస్తూన్న బాలభానుడు ఊరట ప్రసాదించలేక పోతున్నాడు. అతని ఆలోచనలలో గత జీవితం కదలాడింది.
సివిల్ ఇంజనీరింగులో పట్టభద్రులైన రావుగారు దేశ విదేశాలలోని నిర్మాణ రంగంలో ఉన్న పెద్ద పెద్ద సంస్థలలో పనిచేసి, విశేషమైన అనుభవం, సంపద ఆర్జించారు. వారి భార్య గత ఏడాది క్యాన్సర్ వ్యాధితో మరణించారు. ఎంత సంపద ఉన్నా భార్యను కాపాడుకోలేకపోయాననే బాధ ఎప్పుడూ పీడిస్తుంటుంది ఆయనని. కొడుకు, కూతురు విదేశాలలో స్థిరపడ్డారు. కొడుకు తనతో బాటు విదేశాలలో స్థిరపడమని, రిటైరయిన తర్వాత మన దేశంలో పని ఏమిటని అడుగుతాడు. రావుగారికి పై దేశాలలో స్థిరపడడానికి మనస్కరించలేదు. ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉంది. వీలైనంత కాలం క్రియాశీలకంగా గడిపితే తరువాతి సంగతి చూసుకోవచ్చని అతని అభిప్రాయం. విశాఖపట్నంలో సముద్రతీరంలో వారిది అన్ని ఆధునిక వసతులతో కూడిన పెద్ద ఇల్లు ఉంది. దానిని చూసుకోవడానికి ఒక మనిషిని జీతానికి పెట్టుకున్నారు.

ఆయన ఆలోచనలకి అంతరాయం కలిగింది.
"సాబ్, చాయ్.." ఆఫీసు మెసెంజరు కిషన్ టీ కప్పుతో ప్రత్యక్షమయ్యాడు. రావుగారు టీ కప్పు అందుకున్నాక, ఆయన కూర్చోడానికి కుర్చీ, పక్కనే స్టూలు పెట్టి బిస్కట్ల ప్లేటు పెట్టాడు. ఆకలితో ఉన్న రావుగారికి అవే అమృతప్రాయంగా తోచాయి. మళ్ళా ఆయన ఆలోచనలలో క్రితం రోజు సాయంత్రం జరిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.
సాయంత్రం విచారణ తర్వాత ఆయన లేబర్ కాలనీకి వెళ్ళారు. ఐడెంటిటీ కార్డు విషయం తేల్చకపోతే ప్రభుత్వ సంస్థవారు వదిలేలా లేరు.
కొడుకు మరణవార్త విని, గ్రామం నుండి మృతుడి తల్లిదండ్రులు, భార్య, సంవత్సర ప్రాయమున్న కొడుకు అదే లేబర్ కాలనీలో బస చేసారు. రావుగారు మృతుడి తండ్రితో చాలాసేపు వివరాలన్నీ మాట్లాడేరు. మృతుడి ఐడెంటిటీ కార్డు దొరికింది. దానితోబాటే ఆధార్ కార్డు కూడా తీసుకుని వాటిని అక్కడే పరిశీలించి చూసేక ఆయనకి ముచ్చెమటలు పట్టాయి. తండ్రిని చాలసేపు ప్రశ్నించి అనేక విషయాలు రాబట్టారు రావుగారు.
విషయం పూర్తిగా అవగతమయింది రావుగారికి. ఇక ఆలస్యం చేస్తే లాభంలేదని లేబర్ కాలనీ నుండి నేరుగా భాస్కర్ గుప్తా ఆఫీసుకి వెళ్ళారు. రాత్రి ఎనిమిదయినా భాస్కర్ గుప్తా ఆఫీసులోనే ఉన్నాడు. భద్రతా వారోత్సవ ఏర్పాట్లలో తలమునకలై ఉంది భద్రతా విభాగం.
"రావ్, ఏమిటి ఈవేళ వచ్చారు.. ఎనీ సీరియస్ ఆక్సిడెంట్?" ఆ సమయంలో రావు గారు తన దగ్గరికి వచ్చారంటే సైటులో ప్రమాదమేమైనా జరిగిందేమోననే సందేహం కలిగింది గుప్తాకి.
మృతుడి ఐడెంటిటీ, ఆధార్ కార్డులు గుప్తా ముందుంచారు రావుగారు. బయటపడ్డ విషయాలు గుప్తాగారికి విశదీకరించి చెప్పారు. సంగతి విన్న గుప్తా అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. చాలా సేపు వారిద్దరిమధ్యా తర్జన భర్జనలు జరిగాయి. చివరకు చేయడానికి మరేమీ లేక రావుగారు ఖిన్న వదనులై బసకు చేరేసరికి రాత్రి పదయింది. ఆకలి ఎప్పుడో చచ్చిపోయింది. ఏమీ తినకుండానే మంచం మీద వాలారు.
టీ కప్పు, ప్లేటు తీసుకువెళ్ళడానికి వచ్చాడు కిషన్. ఆలోచనలలోంచి బయటకు వచ్చారు రావుగారు.
"సాబ్, అంతా సరిగానే ఉందా." రావుగారంటే కిషన్ కి ఎనలేని గౌరవం, భక్తీను.
"బాగానే ఉంది కిషన్. నేను లేనప్పుడు ఆఫీసు జాగ్రత్తగా చూసుకో. ఎవరికీ నా అనుమతి లేకుండా ఏ కాగితాలు ఇవ్వకు."
"సరే సార్, అలాగే చేస్తాను" అంటూ కిషన్ నిష్క్రమించాడు.
ఈ రోజు సాయంకాలానికి విచారణ కమిటీ తుది నివేదిక వస్తుంది. సాధారణంగా ఈ కమిటీల నివేదికలలో కాంట్రాక్టరు మీద బాధ్యత నెట్టివేయడం సర్వ సామాన్యం. దానికి భిన్నంగా ఈ నివేదిక ఉండదనే రావుగారి నమ్మకం.

***

భద్రతా వారోత్సవాలలో  ఈ ఏడు సేఫ్టీ బడ్జెటు పెంచిన దృష్ట్యా అధికారులు శ్రామికులలో  భద్రత పట్ల జాగరూకత పెంచేలా, ఎన్నో విషయాలలో శ్రామికులను, తదితర సిబ్బందిని ప్రోత్సహించడానికి పోటీలు నిర్వహించారు. బహుమతి ప్రదానం వారోత్సవాలలో ఆఖరి రోజు ఉంటుంది.

ఆరోజు భద్రతా వారోత్సవాల ఆఖరి రోజు.

ప్రభుత్వ సంస్థ ఎం.డి. గారు ముఖ్య అతిథిగా ముగింపు సభ జరిగింది. జాతీయ భద్రతా దినోత్సవ పూర్వాపరాలు తెలియజేసిన తర్వాత వారు నిర్మాణ రంగంలోని భద్రతా విషయాల గురించి ఇలా తెలియజేసారు.

“మన దేశంలో, వ్యవసాయ రంగం తర్వాత అత్యధికంగా ఉపాధి కల్పించేది నిర్మాణ రంగం. ఈ రంగంలోని జరిగే ప్రమాదాలకి మన దేశం అగ్రస్థానం వహించింది. ఈ మధ్యనే ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ జరిపిన సర్వేలో తేలింది ఏమంటే ప్రతి వెయ్యిమంది నిర్మాణ శ్రామికులలో నూట అరవై ఐదు మంది పనిచేస్తూ ప్రమాదాలలో గాయపడుతున్నారు లేదా మృత్యువువాత పడుతున్నారు.  దేశంలోని అన్ని పారిశ్రామిక రంగాలలోను సంభవించే మరణాలలో సుమారు పావు వంతు నిర్మాణ రంగంలోని మరణాలే. అంటే శ్రామికుల భద్రతకి మనమెంత  ప్రాధాన్యతనిస్తున్నామో అవగత మవుతుంది. భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు, తద్వారా జరిగే ప్రాణహానిని చాలవరకు తగ్గించవచ్చు. విష్ యూ ఆల్ ఎ సేఫ్ డే అండ్ సేఫ్ లైఫ్…"

ఇంతలో చటర్జీ గారు ఎం.డి. గారి చెవిలో ఏదో చెప్పారు.

"ఫ్రెండ్స్, ఇప్పుడే హెడ్డాఫీసు నుంచి కబురు వచ్చిందని చటర్జీగారు చెప్పేరు.. ఈ  ప్రాజెక్టు సైటులో మిగతా యూనిట్లలో కన్న అతి తక్కువ ‘ఫెటల్ ఆక్సిడెంట్స్’ రికార్డు అయినందుకుగాను మన సంస్థకి మొదటి బహుమతి వచ్చింది. ఈ విజయసాధనలో పాల్గొన్నవారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. శెలవ్.”

సభ కరతాళధ్వనులతో ప్రతిధ్వనించింది.

ఈ వార్త వింటూన్న రావుగారికి తల తిరిగినట్లయింది. అదెలా సాధ్యమయిందో ఆయనకి అంతుపట్టలేదు.

***

ఆరోజు సాయంత్రం చీకటిపడే వేళకి క్లబ్ బార్ రూమ్ కోలాహలంగా ఉంది. భద్రతా విషయంలో జాతీయ స్థాయిలో వారి సంస్థ  మొదటిదిగా నిలిచినందుకు కంపెనీ ఎం.డీ. హై లెవెల్  పార్టీ  ఇస్తున్నారు.

ఎం.డీ. గారిని పరివేష్టించిన బృందంలో చటర్జీగారు ఉన్నారు. వాళ్ళకు దూరంగా తివారీ, గుప్తా, సక్సేనా, ఇంకొంతమంది అధికారులు స్నాక్స్ సేవిస్తూ  చర్చించుకుంటున్నారు.

“సార్, రమేష్ మరణం తర్వాత మన సంస్థ ఫెటాలిటీ రేట్ పెరిగి, మనకి ఈ సేఫ్టీ కితాబు రాదేమోనని భయపడ్డాం…” తివారీ మాట పూర్తి కాలేదు.

“అమాయకుడిలా ఉన్నావ్ తివారీ, ఢిల్లీ లో కూర్చున్నవాళ్ళకి ఇక్కడి సైటు సంగతులు తెలియవనుకున్నావా? లాబీయింగ్ అయ్యా, లాబీయింగ్. హైలెవెల్ లో మ్యానేజ్ చేస్తేనే కాని అవలేదు. అవన్నీ ఎం.డీ.గారు చూసుకున్నారు. ఇంతకీ మన విచారణ కమిటీ రిపోర్టు చూడలేదా? కళ్ళుమూసుకుని సంతకం చేసేవేమో!” గుప్తా ఎద్దేవా చేసేడు.

“లేదు లేదు, మృతుడి ఐడెంటిటీ కార్డులో రమేష్ అన్న పేరుంటే, అతడి తండ్రి ఇచ్చిన ఆధార్ కార్డులో పేరు సురేష్ అని ఉంది. అంటే ప్రమాదంలో మరణించినది, మన రికార్డులలోవున్న రమేష్ కాదని, వేరెవరో సురేష్ అని అర్ధమౌతూంది. అసలు ఆ సమయంలో సురేష్ సైటులో ఎలా ఉన్నాడో ఎవరికీ తెలియదనీ, అందుచేత అతనిని ట్రెస్పాసరుగా పరిగణించి, ఈ మరణానికి మన సంస్థకి ఏమీ సంబంధం లేదని చాలా బాగా రిపోర్టులో చూపించారు సార్ మీరు.” తివారీ నివేదికలోని ముఖ్య విషయాలు బయటపెట్టాడు.

"మరి సురేష్ అనే అతడు సైటులోకి ఎలా వచ్చేడు? పనిచేస్తూ ఎలా ప్రమాదానికి లోనై మరణించాడు? అన్నీ సందేహాలే మాకు." ఒక అధికారి అన్నాడు.

“పదిరోజుల క్రితమే రమేష్ తల్లిదండ్రులకు కరోనా వచ్చిందని, గ్రామానికి వెళ్ళిపోయాడు. తను పనిలో చేరడానికి ఎక్కువ రోజులు పడుతుందని గ్రహించిన అతడు వెల్డింగ్ లో కొద్దిపాటి అనుభవమున్న పక్క గ్రామంలోని సురేష్ అనే కుర్రాడిని సైటుకి పంపేడు. తన సైటులోని లేబర్ సప్లై సూపర్వైజరు ఫోన్ నంబరు కూడా ఇచ్చాడు. కరోనా కాలంలో పనిలేక తల్లడిల్లిపోతూన్న సురేష్ కి ఈ ఏర్పాటు నచ్చింది.

"ఇక్కడ సైటులో పని వత్తిడి ఎక్కువయింది. పనివాళ్ళు కావాలి. కొత్తగా వచ్చేవాళ్ళకి ఐడెంటిటీ కార్డు తయారుచేయడానికి సమయం పడుతుందని, లేబర్ సప్లై సూపర్వైజరు రమేష్ కార్డు సురేష్ కి ఇచ్చాడు. సురేష్ పేరున కొత్త కార్డు వచ్చేవరకు జాగరూకతతో ఉండమని హెచ్చరించాడు కూడా. సురేష్ తన దగ్గరకు వచ్చిన మొదటిరోజే, రమేష్ పనిచేసిన సైటుకి అక్కడ పనిచేసే కళాసీని సాయమిచ్చి పంపేడు.” సక్సేనా మిగతా విషయాలు తేటతెల్లం చేసేడు.


“పాపం మొదటి రోజే ఆఖరి రోజయింది సురేష్ కి. పూర్ ఫెలో”

"మరి రావ్ జీ విషయం?"

"సురేష్ మరణానికి నైతిక బాధ్యత వహిస్తూ రావుగారు రాజీనామా చేసేరు. సురేష్ కుటుంబ బాధ్యత తను తీసుకుంటున్నాని ఈ రోజు మధ్యాహ్నమే గుప్తాజీతో చెప్పేరుట.”

“ప్రమాదాల అంచులలో పనిచేసే శ్రామికులు, వారిచేత పని చేయించే అధికారులు భద్రతా నియామాలు కఠినంగా అనుసరించ గలిగితే ప్రమాదాల కారణంగా సంభవించే మరణాలను అదుపులో ఉంచవచ్చు. ఎనీవే, లెటజ్ బి మోర్ అలర్ట్.” అంటూ గుప్తాగారు అక్కడినుంచి లేచిపోయారు.

***0***




# లక్ష్యం

## చిత్రవెంకటేష్

మోనార్క్ అపార్ట్‌మెంట్ పద్నాలుగవ అంతస్థులో నిలబడి ఉన్నాడు విశాల్. కిందికి చూస్తున్నాడు. రోడ్డు మీద జనం లక్కపిడతల్లా కనిపిస్తున్నారు. కార్లు, బస్సులు, లారీలు బొమ్మల్లా కనిపిస్తున్నాయి. ప్రతి రోజు ఇక్కడ నిలబడటం విశాల్ కు అలవాటు. ఒక గంట సేపు కిందికి చూస్తాడు. కింద దృశ్యం అతనికి ఎంతో ఆసక్తిగా అబ్బురంగాను ఉంటుంది. ఎంతసేపు చూసిన తనివి తీరదు. విసుగు రాదు. అతని దైనందిత జీవితంలో అది ఒక అలవాటుగా మారిపోయింది.

విశాల్ యువ వ్యాపారస్థుడు. ఒక చిన్న బాల్ బేరింగ్స్ కంపెనీకి యజమాని. సరిగ్గా అయిదు సంవత్సరాలకు ముందు ఈ కంపెనీ స్థాపించాడు. రాత్రి పగలు అని తేడా లేకుండ కష్టపడ్డాడు. ఫైనాన్స్ నుంచి మార్కెటింగ్ వరకు అన్ని స్వయంగా చూసుకున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక యంత్రంలా పనిచేశాడు. అతని కష్టం వృధా కాలేదు. సంవత్సరం సంవత్సరం అతని వ్యాపారం పెరిగింది. కస్టమర్స్ పెరిగారు. లాభాలు కూడా పెరిగాయి. స్టాఫ్ మెంబర్స్ కూడా పెరిగారు. దాంతో సంఘంలో అతని పరపతి కూడా పెరిగింది. తన వ్యాపారాన్ని ఇంకా అభివృద్ధి చేసి విదేశాలలో కూడా పేరు సంపాదించుకోవాలని ఉంది. అందుకే ఆ అవకాశం కోసం కూడా ఎదురుచూశాడు. సరిగ్గా ఆరునెలలకు ముందు ఆ అవకాశం వచ్చింది. బాల్ బేరింగ్స్ తయారుచెయ్యటంలో కొరియా కంపెనీ ముందు స్థానంలో ఉంది. ఆ కంపెనీతో కోలాబరేషన్ చేసుకోవాలని విశాల్ కు కోరిక. దాని వల్ల వ్యాపారం పెరుగుతుంది.. సరుకులో మంచి నాణ్యత ఉంటుంది. పైగా విదేశాలలో కూడా అతని కంపెనీకి మంచి పేరు వస్తుంది.

ఈ ఆలోచనతో విశాల్ వాళ్ళను కాంటాక్ట్ చేశాడు. తన కంపెనీ గురించి తన గురించి టర్నోవర్ అన్ని వివరాలు పంపించారు. వాళ్ళ దగ్గరనుంచి వెంటనే జవాబు వచ్చింది. ఫలాన తేదిలో తమ అధికారులు

ఇండియా వస్తున్నారని తెలియచేశారు. ఆ రోజు విశాల్ ఖరీదైన సూటు వేసుకుని కొరియన్ డెలిగేషన్ ను రిసివ్ చేసుకున్నాడు. పెద్ద ఫైవ్ స్టార్ హోటల్ లో వాళ్ళకు రూమ్ బుక్ చేశాడు.

ఆ రోజు మద్యాహ్నం విశాల్ కొరియన్ అధికారులతో సమావేశం అయ్యాడు. తన కంపెనీ గురించి పూర్తిగా చెప్పాడు. ముందు సంవత్సరం ఫైనాన్షియల్ స్టేట్ మెంట్స్, ఆడిటర్స్ రిపోర్ట్ అంతా ఇచ్చాడు. వాళ్ళు చాల ఇంప్రెస్ అయ్యారు. విశాల్ లో మంచి టాలెంట్ ఉందని గుర్తించారు. పైగా యువకుడు. స్వయం కృషితో వచ్చాడు.  ఇంకా పైకి రావాలని ఆశపడుతున్నాడు.  అంతకంటే ఇంకేం కావాలి. విశాల్ లో వాళ్ళకు ఎంతో పొటెన్షియల్ కనిపించింది. అందుకే అతనితో కొలాబరేట్ కావటానికి తీర్మానించుకున్నారు.

వెంటనే అగ్రిమెంట్ రాసుకున్నారు. ఆ ఆగ్రిమెంట్ ప్రకారం కొరియన్ సాంకేతిక నిపుణులు విశాల్ కంపెనీకి వస్తారు.  విశాల్ కంపెనీలో పనిచేస్తున్న సాంకేతిక నిపుణులకు తర్ఫీదు ఇస్తారు. ఆరునెలలపాటు ఆ ట్రయినింగ్ కొనసాగుతుంది.. అంతవరకు విశాల్ కంపెనీ వాళ్ళకు జీతం ఇవ్వాలి. ఉండటానికి ఇల్లు ఏర్పాటు చెయ్యాలి. సరుకు పూర్తిగా తయారయిన తరువాత మొత్తం సరుకుని కొరియన్ కంపెనీకి అమ్మాలి. వాళ్ళు అడిగిన రేటుకు అమ్మాలి.  అయినా సరే అన్నాడు విశాల్. వాళ్ళు ఇచ్చే రేటు ఇండియాలో నిర్ణయించిన రేటు కంటే ఎక్కువ. పైగా సరుకు అమ్మటానికి కష్టపడవలసిన పనిలేదు.  తయారయిన సరుకును వాళ్ళకు పంపించేస్తాడు. సరుకు అందిన వెంటనే వాళ్ళు డబ్బు విశాల్ బ్యాంకుకు ట్రాన్స్ ఫర్ చేస్తారు.
ఇందులో మంచి లాభం తప్ప నష్టం ఏం కనిపించలేదు.
అందుకే విశాల్ ఉత్సాహంతో కష్టపడ్డాడు. కంపెనీ పనివాళ్ళతో సమానంగా పన్నెండు గంటలు పనిచేశాడు. క్వాలిటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. రాత్రి పగలు అని తేడా లేకుండ శ్రమించాడు. అనుకున్న టైంకు సరుకును తయారుచెయ్యగలిగాడు. సరిగ్గా మొన్నటితో ఆరునెలలు పూర్తి అయ్యాయి. కొరియన్ స్టాఫ్ వెళ్ళిపోయారు.
సరుకును నీట్ గా ప్యాక్ చేశాడు విశాల్. మెత్తం సరుకును స్వయంగా హర్బర్ కు తీసుకువెళ్ళాడు. అతనితో కంపెనీ మేనేజర్ మాత్రం ఉన్నాడు. ఇద్దరు కలిసి జలసూర్య ఓడలో సరుకును దగ్గర ఉండి ఎక్కించారు. తరువాత సంతోషంతో తిరిగి వచ్చారు. మేనేజర్ ఇంటికి వెళ్ళిపోయాడు. విశాల్ మాత్రం ఆఫీసులో కూర్చున్నాడు.

జరిగినదంతా ఒకసారి బేరీజు వేసుకున్నాడు. తలుచుకుంటే  అతనికే ఆశ్చర్యంగా ఉంది. సాధించింది తక్కువేం కాదు. ఈ పని విజయవంతంగా పూర్తవుతుందా అని ఆందోళనపడ్డాడు. సమాయానికి అతని స్నేహితుడు అగర్వాల్ ఏకాంబరం సహాయపడ్డారు. చాల డబ్బు అప్పుగా ఇచ్చారు. వాళ్ళు సహాయం చెయ్యకపోతే ఈ పని విజయవంతం అయ్యేది కాదు.

ఓడ కొరియా చేరుకోవటానికి వారం రోజులు పడుతుంది. ఈ రోజు రెండో రోజు. నిన్న ఓడ బయలుదేరేటప్పుడు వాతావరణం అనుకూలంగా ఉంది. ఆకాశం ప్రశాంతంగా ఉంది. ఎక్కడా తుఫాను వచ్చే సూచనలు కనిపించలేదు. అయిన ప్రకృతిని నమ్మటానికి వీలులేదు. ఏ సమయంలో ఏం జరుగుతుందో ఎవరు చెప్పలేరు. సరుకు గమ్యస్థానం చేరుకునే వరకు కొంచం ఉద్వేగంగానే ఉంటుంది.

"సార్ కాఫీ తెమ్మంటారా?" అడిగాడు అటెండర్.

"వేడిగా తీసుకురా!" అని చాంబర్స్ లో కూర్చున్నాడు. క్షణంలో కాఫీ తీసుకువచ్చి విశాల్ ముందు పెట్టాడు అటెండర్.

కాఫీ తాగుతూ టీవి ఆన్ చేశాడు. వార్తలు వస్తున్నాయి. వాతావరణం గురించి ప్రత్యేకంగా ఏం చెప్పలేదు. బహుశా వాతావరణంలో మార్పులు వచ్చి ఉండకపోవచ్చు. ఇంకో రెండు మూడు చానల్స్ చూశాడు. ఎక్కడ ప్రత్యేకంగా వాతావరణం సూచన లేదు.

అప్పుడే అతని సెల్ ఫోన్ చప్పుడు చేసింది. అగర్వాల్ చేశాడు.

"బెస్ట్ ఆఫ్ లక్ యంగ్ మ్యాన్" అన్నాడు అగర్వాల్. "చాల గొప్ప విజయం సాధించావు. పెద్ద పెద్దవాళ్ళు సాధించలేనిది నువ్వు తేలికగా సాధించావు. నీకు మంచి భవిష్యత్తు ఉంది."

"థ్యాంక్యూ అగర్వాల్ జీ. ఇది నా గొప్పతనం కాదు. మీది ఏకాంబరం గారిది. ఆ రోజు మీరు సహాయం చెయ్యకపోతే ఇది సాధ్యం అయ్యేది కాదు. ఏం ఇచ్చిన మీ రుణం మాత్రం తీర్చుకోలేను!" అన్నాడు విశాల్.

"ఈ సబ్మిసివ్ నెస్ నాకు నచ్చింది. ఎనివే ఇంకోసారి కంగ్రాట్స్!" అన్నాడు అగర్వాల్.

తరువాత వివరాలు అడిగాడు అగర్వాల్. అంతా చెప్పాడు విశాల్. తరువాత లైన్ కట్ చేశాడు అగర్వాల్.

ఆ వెంటనే ఏకాంబరం కాల్ చేశాడు.

"నువ్వు మన తెలుగువాడివి అయినందుకు సంతోషంగా అభినందిస్తున్నాను. ఇంతటితో నువ్వు ఆగిపోకూడదు. ఇంకా సాధించాలి. ప్రపంచంలోనే గొప్ప బిజినెస్ మ్యాన్ గా పేరు తెచ్చుకోవాలి!" అన్నాడు.

"అంతా మీరు చేసిన సహాయం. ఎప్పటికి మీకు రుణపడి ఉంటాను!" అన్నాడు విశాల్.

ఏకాంబరంతో మాట్లాడిన తరువాత కాఫీ తాగి రిలాక్స్ అయ్యాడు విశాల్. ఎందుకో అతనికి రెస్ట్ లెస్ గా ఉంది. దానికి ప్రత్యేకమైన కారణం అంటు ఏంలేదు. సాయంత్రం వరకు ఆఫీసులోనే కూర్చున్నాడు. మధ్యలో తల్లికి కాల్ చేశాడు. ఆమెతో మాట్లాడాడు.

అతని తల్లి, తండ్రి ఊరులో ఉంటున్నారు. అక్కడ వాళ్ళకు పది ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. తండ్రి దాన్ని స్వయంగా సాగుచేసుకుంటున్నాడు. తండ్రితో కూడా మాట్లాడాడు. జరిగినదంతా చెప్పాడు. ఆయన కూడా చాల సంతోషంగా ఫీలయ్యారు. కొడుకుని మనసారా అభినందించారు.

“అనుకున్నది సాధించావు. ఈ సంవత్సరమైన పెళ్ళి చేసుకుంటావా?"అడిగాడు తండ్రి.

“ఇప్పుడు మీ మాట కాదనను. అలాగే కానివ్వండి!"అన్నాడు విశాల్.

దాదాపు రెండు సంవత్సరాలనుంచి తన పెళ్ళిని వాయిదా వేస్తున్నాడు విశాల్. ఏదో సాకు చెప్పి తప్పించుకుంటున్నాడు..

“సరే ఇంటికి ఎప్పుడు వస్తున్నావు?" తిరిగి అడిగాడు తండ్రి.

“వీలు చూసుకుని, రెండు మూడు రోజులలో వస్తాను. అమ్మను కంగారుపడవద్దని చెప్పండి. ఉంటాను మరి!"అని లైన్ కట్ చేశాడు.

తరువాత అతనికి ఏం తోచలేదు. చెయ్యటానికి ఏం పనిలేదు. స్టాఫ్ అందరు ఇంటికి వెళ్ళిపోయారు. రెండు రోజులు అందరికి సెలవు ఇచ్చాడు. ఆఫీసు అంతా నిశ్శబ్ధంగా, నిస్తేజంగా ఉంది. ఏం తోచక కొంచం సేపు ఫ్యాక్టరీ అంతా తిరిగాడు. మెషినరీని ఆప్యాయంగా ముట్టుకుని ముద్దుపెట్టుకున్నాడు. సాయంత్రం వరకు గడిపాడు. తరువాత తన చాంబర్స్ కు వచ్చి కూర్చున్నాడు.

క్రమంగా చీకటి పడుతోంది. చలికాలం వల్ల తొందరగా చీకటి వ్యాపిస్తోంది. ఏం తోచక టీవి ఆన్ చెయ్యబోయాడు. అప్పుడే లాండ్ లైన్ ఫోన్ రింగ్ అయింది. ఈ టైంలో ఎవరు చేశారా అనుకుంటు రిసివర్ ఎత్తాడు. అవతలనుంచి అతని మేనేజర్ మాట్లాడాడు.

“సార్ కొంప మునిగింది!" అన్నాడు కంగారుగా.

“ఏం జరిగింది?" అడిగాడు మాములుగా విశాల్. లోపల మాత్రం కొంచం ఆందోళనగా ఉంది అతనికి.

“మన సరుకు తీసుకువెళుతున్న ఓడకు ప్రమాధం జరిగింది.”

“ఏం జరిగిందో వివరంగా చెప్పు.”

“మొదటి రోజు ప్రయాణం సుఖంగానే జరిగింది. వాతావరణంలో చాల అనుకూలంగా ఉంది. కాని ఈ రోజు మద్యాహ్నం ఏమైందో తెలియదు. వాతావరణంలో విపరీతమైన మార్పు వచ్చింది. ఆకాశం నల్లచీర కప్పుకున్నట్టు మేఘాలతో నిండిపోయింది. మెల్లగా వర్షం పడింది. తరువాత అది తుఫానుగా మారింది. అంతవరకు మాత్రం తెలుసు. తరువాత ఏమైందో తెలియదు. అధికారులు ఓడ కెప్టన్ ను కాంటాక్ట్ చెయ్యటానికి ప్రయత్నించారు. కాని లాభం లేకుండ పోయింది. ప్రస్తుతం ఆ ఓడ ఎక్కడుందో తెలియటం లేదు. అది మునిగిపోయి ఉంటుందని అనుకుంటున్నారు!" అన్నాడు.

హతాశుడయ్యాడు విశాల్. రిసివర్ పట్టుకున్న అతని చెయ్యి అప్రయత్నంగా వణికింది. అతని మైండ్ పూర్తిగా బ్లాంక్ అయిపోయింది. నిస్తేజంగా కుర్చీలో కూలబడ్డాడు. ఆ షాక్ నుంచి తేరుకోవటానికి అతనికి చాల టైం పట్టింది.

***

కారు పార్క్ ముందు ఆపి లోపలికి వెళ్ళాడు విశాల్. ఆ రోజు పార్క్ చాల సందడిగా ఉంది. చిన్న పిల్లలు పెద్దలు అందరు వచ్చారు. ఒకచోట చిన్న పిల్లలు అరుస్తూ ఆటలు ఆడుకుంటున్నారు. పెద్దవాళ్ళు కూర్చుని

పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు.. అతనికి ఎదురుగా ఒక సిమెంట్ బెంచి ఉంది. దాని మీద ఒక పెద్దమనిషి కూర్చున్నాడు. ఖరీదైన దోవతి లాల్చీ వేసుకున్నాడు. మొహంలో ఠీవి దర్పం కనిపిస్తున్నాయి. వెళ్ళి ఆయన పక్కన కూర్చున్నాడు.

జరిగింది సామాన్యమైన విషయం కాదు. ఓడతో పాటు అతని సరుకు కుడా మునిగిపోయింది. ఈ సంఘటనతో అతనికి ఏం మిగలలేదు. ఉన్నదంతా  వ్యాపారంలో పెట్టాడు. మిగిలింది అప్పులు మాత్రమే. ఇప్పుడు ఏం చెయ్యాలో తోచలేదు. వ్యాపారం మళ్ళీ చెయ్యాలని ఉంది. కాని దానికి పెట్టుబడి కావాలి. కొంచం పెట్టుబడి చాలు. దాంతో మెల్లగా పుంజుకోవచ్చు. ముందున్న పరిస్థితికి రావచ్చు.  విషయం అగర్వాల్ కు, ఏకాంబరానికి తెలిసింది. వాళ్ళు చాల బాధపడ్డారు. నిజంగానే విచారించారు. భయపడవద్దని ధైర్యంగా ఉండమని ఓదార్చారు. అలాగని వాళ్ళను తిరిగి అప్పు అడగటానికి విశాల్ కు మనస్సు ఒప్పలేదు. అందుకే మనశ్శాంతి కోసం పార్క్ కు వచ్చాడు.

"ఏం బాబు అలా ఉన్నావు. ఒంట్లో బాగాలేదా!" పలకరించాడు ఆ పెద్దమనిషి.

"ఏం లేదు బాగానే ఉన్నాను!" అన్నాడు విశాల్.

"నీ మనస్సు బాగాలేనట్టుగా ఉంది.  ఏదో కష్టంలో ఉన్నట్టు ఉన్నావు! అవునా?"

"అవును మీకెలా తెలుసు" అన్నాడు విశాల్. లేదు అని చెప్పటానికి అతని మనస్సు ఒప్పలేదు.

పెద్దమనిషి చిన్నగా నవ్వి "అనుభవంతో తల పండిపోయింది.. మనిషి మొహం చూస్తే, అతని గురించి చాల విషయాలు చెప్పగలను. సరే ఆ విషయం పక్కన పెట్టు. ఏమిటి నీకు వచ్చిన కష్టం. నాతో చెప్పు. నేను నీకు పెద్దగా సహాయ పడకపోవచ్చు. కాని తగిన సూచనలు సలహాలు ఇవ్వగలను!" అన్నాడు.

ఆ మాటలకు పూర్తిగా కరిగిపోయాడు విశాల్. అంతవరకు దాచుకున్న బాధ, దుఖం లావాలా బయటకు పొంగింది. జరిగినదంతా పూసగుచ్చినట్టు చెప్పాడు.

అంతా విని ఆ వృద్ధుడు తలపంకించాడు. జేబులోంచి చెక్ బుక్ తీసి, ఒక కోటి రూపాయలకు చెక్ రాసి ఇచ్చాడు. విశాల్ ఆశ్చర్యంగా చూశాడు.

"ఇంత కంటే నేను ఏం చెయ్యలేను. ఇది అప్పుగా భావించు. నీకు ఒక సంవత్సరం టైం ఇస్తాను. ఈలోగా నువ్వు నా అప్పుతీర్చాలి. వడ్డీ అవసరం లేదు!" అన్నాడు.

"మీరు ఎవరో నాకు తెలియదు. నేను ఎవరో మీకు తెలియదు. ఏం చూసి నాకు సహాయం చేస్తున్నారు. అది ఇంత మొత్తం!" అన్నాడు విశాల్.

"నమ్మకం! నీ మొహంలో రాచకళ ఉంది. నీ కళ్ళలో ఏదో సాధించాలనే తపన, పట్టుదల కనిపిస్తున్నాయి. అవి చాలు నీకు సహాయం చెయ్యటానికి! వెళ్ళు మళ్ళీ నీ వ్యాపారం మొదలుపెట్టు. ఈ సారి అన్ని జాగ్రత్తలు తీసుకో. "FAILURE IS THE STEPPING STONE TO SUCCESS" అన్నాడు.

***

చెక్ తీసుకుని ఇంటికి చేరుకున్నాడు విశాల్. అతనికి చాల ఉద్వేగంగా ఉంది. ఆ చెక్ పట్టుకుంటే అతని శరీరం సన్నగా కంపించింది. అది ధైర్యంతో వచ్చిన వణుకు! దాంతో పాటు అతని ఆత్మవిశ్వాసం కూడా పెరిగింది. అనూహ్యమైన సంఘటలు అప్పుడప్పుడు జరుగుతాయని విన్నాడు. ఈ రోజు అతనికి అది అనుభవం అయింది. ఆ పెద్దమనిషి అతని కథ వినటం ఏమిటి.. కోటి రుపాయలు చెక్ ఇవ్వటం ఏమిటి... అంతా కలలో జరిగినట్టుగా ఉంది!
అప్పటికి అప్పుడు చెక్ క్యాష్  చేసుకోలేదు విశాల్. దాన్ని జాగ్రత్తగా డ్రాయర్ లో పెట్టాడు. అవసరానికి ఉపయోగించుకోవాలని అతని ఉద్దేశం. మళ్ళీ అప్పు చెయ్యటానికి ఆ చెక్ ఉపయోగపడుతుంది. దాన్ని చూపిస్తే ఎవరైన అప్పు ఇస్తారు. ఆ నమ్మకం తోనే అగర్వాల్ దగ్గరకు వెళ్ళాడు. జరిగినదంతా చెప్పాడు. ఆయన కూడా ఆశ్చర్యపోయాడు. విశాల్ కు మళ్ళీ సహాయం చెయ్యటానికి మనసారా ఒప్పుకున్నాడు. అలాగే  ఏకాంబరం కూడా సహాయం చేశాడు.

దాదాపు కోటి రూపాయలు వాళ్ళ దగ్గర తీసుకుని, మళ్ళీ వ్యాపారం మొదలుపెట్టాడు. పాత పనివాళ్ళను తీసుకున్నాడు. ఈసారి అతను విదేశీ మార్కెట్ మీద ఆశ పెట్టుకోలేదు. స్వదేశీ మార్కెట్టు మీద దృష్టిని లగ్నం చేశాడు. ఈ సారి ప్రతి విషయంలోను తగిన జాగ్రత్తలు తీసుకున్నాడు. పోయినసారి ఇన్స్యూరెన్స్ చెయ్యటం మరిచిపోయాడు. అందుకే విపరీతంగా నష్టపోయాడు. ఈ సారి మాత్రం చేశాడు. కట్టవలసిన ప్రిమియం ముందే కట్టేశాడు.

అతని కష్టం వృధా కాలేదు. బిజినెస్ వేగంగా పుంజుకుంది. సంవత్సరం తిరిగేసరికి అతని వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా పెరిగింది. దాదాపు సగం అప్పు తీర్చిశాడు. సరిగ్గా ఆ రోజుతో సంవత్సరం పూర్తవుతుంది. డ్రాయర్ లో పెట్టిన చెక్ తీసుకున్నాడు. కారులో పార్కుకు బయలుదేరాడు. అదృష్టవశాత్తు అదే సిమెంటు బెంచి మీద ఆ పెద్దమనిషి కూర్చుని ఉన్నాడు. ఆయన పక్కన ఒక అందమైన అమ్మాయి ఉంది. బహుశా ఆయన కూతురై ఉంటుంది."
చెక్ ఆయన చేతిలో పెట్టి ఏదో చెప్పబోయాడు విశాల్. అప్పుడే ఆ అమ్మాయి అడ్డుకుంది. అతన్ని పక్కకు రమ్మని సైగ చేసింది. విశాల్ ఆశ్చర్యంగా వెళ్ళాడు.
"నా పేరు శృతి. ఆయన అమ్మాయిని. ఏమిటి ఈ చెక్!" అడిగింది.
జరిగినదంతా చెప్పాడు విశాల్.
"ఈ చెక్ వల్ల నాకు ఎక్కడలేని బలం వచ్చింది. పోయిన ఆత్మవిశ్వాసం తిరిగి వచ్చింది. ఇది నా చేతిలో ఉంటే ఏమైన చెయ్యగలననే నమ్మకం ఏర్పడింది. అయినా ఈ చెక్ ను నేను క్యాష్ చేసుకోలేదు. జాగ్రత్తగా దాచిపెట్టుకున్నాను. కాని ఈ చెక్కును అడ్డం పెట్టుకుని అప్పు తీసుకున్నాను. ఇప్పుడు ఆ అప్పులన్నీ దాదాపు తీరిపోయాయి. చెక్ తిరిగి ఇద్దామని వచ్చాను!"

“ఈ చెక్ మీరు బ్యాంకులో వేసి ఉంటే క్యాష్ అయ్యేది కాదు!" అంది శృతి నవ్వుతూ.
“ఆయన అకౌంటులో డబ్బు లేదు కనుక. ఒకప్పుడు మా నాన్నగారు పెద్ద వ్యాపారస్థులు. అడిగిన వాళ్ళందరికి సహాయం చేసేవాడు. ఎవరు ఏ సహాయం చేసిన కాదనేవాడు కాడు. వెంటనే చెక్ ఇచ్చేవాడు. ఆయన అమాయకత్వం, మంచితనం చూసి, కొంతమంది తమ లాభానికి వాడుకున్నారు. అయినవాళ్ళు వ్యాపారంలో అయన పార్టనర్స్ మోసం చేశారు. దాంతో ఆయన ఆస్థి అంతా కరిగిపోయింది. ఒక ఇల్లు మాత్రం మిగిలింది. ఇంత జరిగిన ఆయన మనస్తత్వం మారలేదు. ఎవరు కష్టాలలో ఉన్నా చెక్ ఇస్తాడు. అది చెల్లదని ఆయనకు తెలియదు.” ఒక్క నిమిషం చెప్పడం ఆపింది.
విశాల్ ఆత్రుతగా ఆమె వైపు చూసాడు.
“ఆయనకి మతి స్థిమితం లేదు!” తల దించుకుని కన్నీరు తుడుచుకుంటూ అంది ఆమె.
ఒక సునామీ అల తాకినట్టుగా కంపించిపోయాడు విశాల్. ఇది నిజమా అన్నట్టు ఆ వృద్ధుడి వైపు చూశాడు. ఆయన ఈ లోకంలో లేడు. తనలో తానే మాట్లాడుకుంటున్నాడు.
“మీరేం చేస్తున్నారు!" అడిగాడు విశాల్.
“కంప్యూటర్ లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ను. ఒక కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. కాని జీతం తక్కువ. మంచి కంపెనీలో ఆఫర్ కోసం ఎదురుచూస్తున్నాను!" అంది.
“దయచేసి మా కంపెనీలో చేరండి. ప్రస్థుతం నలభై వేలు జీతం ఇస్తాను. తరువాత పెంచుతాను. మీకు అభ్యంతరం లేకపోతే...!" అన్నాడు.
“తప్పకుండా వస్తాను. జీతం ఎక్కువ ఇస్తున్నప్పుడు నేను మాత్రం ఎందుకు కాదంటాను. అలాగే చేరుతాను!”
“ఒకటి అడుగుతాను కాదనరుగా?" అన్నాడు విశాల్.
“అడగండి!" అంది శృతి.
“ఈ చెక్ నా దగ్గరే ఉంచుకుంటాను. మీకు అభ్యంతరం లేదుగా!" అన్నాడు.
“ఉంచుకోండి... దాని వల్ల నాకేం నష్టం లేదుగా!" అంది నవ్వుతూ.

ఆమెకు బై చెప్పి తన కారు దగ్గరకు చేరుకున్నాడు విశాల్. కారు స్టార్ట్ చెయ్యబోతూ చెక్ ను బయటకు తీశాడు. దాన్ని భక్తితో కళ్ళకు అద్దుకుని తిరిగి జేబులో పెట్టుకున్నాడు. తరువాత కారు స్టార్ట్ చేశాడు.

***0***



# శివాలయం గూడు

## సి. వి. శాస్త్రి

ఆఫీస్ లో లంచ్ చేస్తుంటే పావని ఫోన్ చేసింది. "మీ పెద్దనాన్నగారు పొద్దునే పోయారుట".

ఒక్క క్షణం షాక్ లా అనిపించింది. పెద్దనాన్న చిన్నవాడేం కాదు. పోవాల్సిన వయసు కన్నా ఎక్కువే. వయస్సు తొంభై దాటి ఉంటాయి. కానీ పెద్దనాన్నతో నాకున్న అనుబంధం, ఆప్యాయత షాక్ అనిపించేలా చేసాయి.

"తొందరగా వచ్చేయండి. వెంటనే బయల్దేరితే రాత్రి ఏదో టైం కి చేరుకోవచ్చు. అసలే పల్లెటూరు. ఇవాళ పొద్దున్న పోయారంటే, రేపు ఎక్కువసేపు ఉంచరు. వాళ్ళ పిల్లలంతా కూడా దగ్గర్లోనే ఉన్నారు!" నేనేం మాట్లాడకపోవడం చూసి పావనే మాట్లాడుతోంది.

"సరే నేనొక్క పది నిమిషాల్లో ఫోన్ చేస్తాను బాస్ తో మాట్లాడి!"

పెద్దనాన్నని చివరిసారి చూడ్డం అవసరమే. బాస్ కూడా వెళ్తానంటే అభ్యంతరం చెప్పడు. కానీ అక్కడికి రమ వస్తుంది. రమని చూడ్డం, మాట్లాడ్డం చేయగలనా? నాకు ఆ శక్తి లేదు. పావనికి ఫోన్ చేశాను.

"పావని... బాస్ పర్మిషన్ ఇవ్వలేదు. రేపు ఇన్స్పెక్టర్ వస్తారట. నేను ఉండి తీరాలట! అయినా ఇప్పటికిపుడు బయలుదేరి వెళ్లడం కూడా కష్టమే. పదవ రోజుకి వెళదాం!"

"ఏం మనిషండి, మనిషి చావుకన్నా ఈ పని ఎక్కువా? అంత ఆలోచన లేని వాడేంటండీ మీ బాస్!" తనకి తోచిన తిట్లన్నీ తిట్టి ఫోన్ పెట్టేసింది పావని.

మనసంతా ఏదోలా ఉంది. ముప్పయ్ సంవత్సరాల క్రితం జ్ఞాపకాలు బయటకొచ్చి, ఆఫీస్ ఆవరణలో ఉన్న మావిడి చెట్టు కింద నించుని రోడ్డుపై పోయే జనాల్ని, వాహనాల్ని చూస్తూ గతంలోకి వెళ్ళిపోయాను.

***

రమ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే పదహారణాల బాపు బొమ్మ. మా పెద్దనాన్న భార్యకి అన్నగారి అమ్మాయి. ప్రతి సంవత్సరం వేసవి సెలవులకి రమ, వాళ్ళ అక్కలు, వాళ్ళ అన్నయ్యలు అంతా వచ్చేవారు. దాదాపు నెల రోజులుండేవారు. మా కాలనీలో ఓ పదిహేను ఇళ్ళుండేవి. అందరూ బంధువులే. వేసవిలో దాదాపు అందరిళ్ళకి కలిపి యాభై మంది పిల్లలు వచ్చేవారు. ఆటలే ఆటలు. పగలంతా గెంతులు.

సాయంత్రం చేల మధ్యనున్న నూతుల దగ్గర స్నానాలు. రాత్రి అంతా ఊరి చివర శివాలయంలో ఓ గంట కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం. సెలవులు మరో పది రోజులున్నాయనగా ఎవరి ఊరికి వాళ్ళ ప్రయాణం. ఆ పది రోజుల్లో కొత్త పుస్తకాలూ కొనుక్కోవడం, అట్టలేసుకోవడం, తరువాత తరగతిలోకి వెళ్ళడానికి సిద్ధపడ్డం. ఈ యాభై మందిలో దాదాపు అన్ని తరగతుల వాళ్ళు ఉండేవారు. ఒక్కళ్ళ పుస్తకాలు ఒకళ్ళు తీసుకోవడం, నోటు బుక్స్ లో మిగిలిన తెల్ల కాగితాలన్నీ చింపుకొని, పుస్తకంలా కట్టుకుని రఫ్ వర్క్ కి ఉపయోగించుకోవడం - అందమైన జ్ఞాపకాలు.

ఒక రోజు రమ పట్టు పరికిణి కట్టుకుని అందంగా తయారయ్యి వచ్చింది. తలంటుకున్న తల్లో ఆమె పెట్టుకున్న మల్లె దండ ఆ వేసవి సాయంకాలం సువాసనలను వెదజల్లుతోంది. ఓ కవర్లో, మా దొడ్డమ్మ అందరికీ యిమ్మని యిచ్చిన కొబ్బరి ఉండలు పట్టుకుని మరీ వచ్చింది. ఆ రోజు రమ పుట్టినరోజట. శివాలయం దగ్గర పండు వెన్నెల్లో అందరం కూర్చుని ఎన్ని కబుర్లు చెప్పుకున్నాము! ఆ వెన్నెల రాత్రి ఆమెను చూస్తుంటే 'నువ్వు చాల బాగున్నావు' అని చెప్పాలని చాలా సార్లు అనిపించింది. కానీ... సిగ్గు, మొహమాటంతో ఏం మాట్లాడలేకపోయాను. మరునాడైనా చెప్పాలనుకున్నాను... కానీ ఒక్క రోజులో సిగ్గు తగ్గిపోదుగా! అందుకనే ఓ కాగితం మీద "రమా! నిన్న నువ్వు చాల అందంగా ఉన్నావు" అని రాసాను. సాయంత్రం అంతా శివాలయం మండపంలో కూర్చున్నాము. ఆ కాగితాన్ని రమకు ఎలా యివ్వాలా అని ఆలోచిస్తూంటే అప్పుడు నాకో ఆలోచన వచ్చింది. శివాలయంలో మండపంపైన చిన్న గూడు ఉంది. రమకు మాత్రమే తెలిసేలా ఆ కాగితాన్ని ఆ గూట్లో పెట్టాను. మెల్లగా సంజ్ఞలు చేస్తూ రమని ఆ కాగితం తీసుకోమని చెప్పాను. తీరా ఆమె ఏమంటుందోనని మనసులో భయం. అంత చల్లటి సమయంలో కూడా నాకు చెమటలు పట్టసాగాయి. మెల్లగా లేచి నేను అందరికంటే ముందుగా యింటికొచ్చేసాను. నాకు మరునాడంతా ఒకటే టెన్షన్. రమ ఆ కాగితాన్ని తీసుకుందా? తీసుకుని చూస్తే నా గురించి ఏమనుకుంటుంది? నా మనసులో అదేదో గాబరా. అసలు యిదంతా ఏమిటి...? అది... ప్రేమా..? అదే నిజమయితే ప్రపంచంలో అతి చిన్న ప్రేమలేఖ అదేనేమో!

మరునాడు మామూలుగానే అందరం కలిసాం. కానీ రమ నా వైపు చూడలేదు, మాట్లాడలేదు. రాత్రి గుడి దగ్గర కూడా ఏం మాట్లాడలేదు. డల్ గా అనిపించింది. అలా రాయకుండా ఉండాల్సిందనిపించింది నాకు. వెళ్ళిపోతూ నా వైపు చూసింది, వేలు శివాలయం గూడువైపు చూపించింది. ఏం రాసి ఉంటుంది. ఆత్రుత. అందరూ వెళ్లే వరకు క్షణం ఒక యుగంలా గడిచింది. అందరితో వచ్చినట్టే వచ్చి, వెనక్కి వెళ్లి కాగితం తీసుకున్నాను. ఇంటికొచ్చి దీపం వత్తి కొంచెం పెద్దది చేసి చదివాను. "నిజంగానా, రోజూ బావుండనా!!" ముత్యాలు నవ్వినట్టు అనిపించి, భలే ఆనందం వేసింది.

అప్పటినుండి ఎప్పుడు ఏం చెప్పాలన్నా కాగితం మీద రాసి శివాలయం గూట్లో పెట్టడం. ఎన్ని ఉత్తరాలు రాసుకున్నామో! సెలవులయిపోతే ఎవరి దారి వారిదే. మళ్ళీ సంవత్సరం తర్వాతే కలుసుకోవడం. ఆ నెల రోజులూ కథలూ, కబుర్లూ, ఆటలూ, పాటలు, శివాలయ గూటిలో ఉత్తరాలు.

కొన్నేళ్లు గడిచాయి. ఆ సంవత్సరం నేను, రమ, మరి కొందరు డిగ్రీ చివరి సంవత్సరం పరీక్షలు రాసాం. రిజల్ట్స్ వస్తే ఏదో జాబ్ వెతుక్కోవాలి.

ఆ రోజు మధ్యాహ్నం టెలిగ్రామ్ వచ్చింది. రమ వాళ్ళ అమ్మమ్మగారికి సీరియస్ గా ఉందట, వెంటనే బయల్దేరి వచ్చేయమని. చాల బెంగగా అన్పించింది. మరో పది రోజులు కలిసుంటామనుకున్నాం. ఆ రోజు యింటికి వెళ్తూ వెనక్కి వెనక్కి చూస్తూ వెళ్ళింది. చేతులతో సంజ్ఞలు చేసింది.

గబగబా పరిగెత్తుకుని వెళ్లి, శివాలయం గూటిలో నాకోసం ఎదురుచూస్తూన్న ఉత్తరం తీసుకుని చదివేను.

"ఫ్రెండ్"

ఉత్తరాల్లో నన్నలాగే సంబోదించేది. రమ నా పక్కకొచ్చి కూర్చున్నట్లనిపించింది. పల్లెటూరి స్వచ్ఛమైన పైరగాలి పరిమళం నాసికని తాకుతున్నటుగా ఉంది.

"అనుకోకుండా పది రోజుల ముందుగానే నేను వెళ్ళిపోతున్నాను. ఈసారి నీతో చాలా చాలా మాట్లాడాలనుకున్నాను. ఏమి చెప్పకుండానే వెళ్ళిపోతున్నాను. పది సంవత్సరాలుగా వేసవి సెలవుల్ని చాలా ఆనందంగా ఆస్వాదించాం. యివి మన జీవితాల్లో చివరి సెలవులు. మనం ఇంకా జీవితంలో సెటిల్ కావాల్సిన క్షణాలు వచ్చేసాయి. గోదారి గట్టు, వేపచెట్టు, పచ్చని చేలు, పిల్ల కాలవలు, చెట్లెక్కి కోసుకు తిన్న మామిడికాయలు, ముంజెలు, తరవాణి అన్నాలు, వెన్నెల్లో కబుర్లు, ముఖ్యంగా శివాలయం గూడు. ఫ్రెండ్! నిన్ను విడిచి ఉండాలని లేదు. పెళ్లి చేసుకుందామా? ఎప్పుడూ చెప్పలేదు కదూ, నువ్వంటే చాల యిష్టమని! నీ కళ్ళు యిష్టం, నీ నవ్వు యిష్టం, నీ జుట్టు యిష్టం, నీ జట్టు యిష్టం. మా అత్తయ్యగారబ్బాయి రాముం తెలుసుగా నీకు, తనకి నాకు పెళ్లి చేయాలనుకుంటున్నారు. హైదరాబాద్ లో ఏదో మంచి ఉద్యోగం చేస్తున్నాట్ట. అమ్మ నన్నడిగింది, నాకేం చెప్పాలో తెలియలేదు. 'నేను టైపు హయ్యర్ కి వెళ్తున్నాను కదమ్మా, నాలుగు నెలల్లో పరీక్షా అయిపోతుంది. అప్పుడు….' అమ్మాయిని, అంతకన్నా ఏం చెప్పగలను నేస్తం! ఈ సెలవుల్లో నీతో మాట్లాడి, నువ్వుకూడా సరే అంటే ఏం చెయ్యాలో ఆలోచిద్దాం అనుకున్నాను. అనుకోకుండా వెళ్లిపోవాల్సి వస్తోంది. నిన్నొదిలి ఉండలేను ఫ్రెండ్, నువ్వేం చేస్తావో తెలియదు.. మన పెళ్లి జరగాలి. అంతే. బై బై నేస్తం. మనం మళ్ళీ కలుస్తాంగా?

ప్రియ నేస్తం రమ.

రమ ఉత్తరం చదివిన తర్వాత చాల అలజడి. ఏమైనా రమని పెళ్లి చేస్కోవాలి. రమ పెళ్లి గురించి మావాళ్ళందరి మాటలు వినబడుతూనే ఉన్నాయి. "రమ చాల అదృష్టవంతురాలు. మంచి సంబంధం. సెంట్రల్ గవెర్నమెంటు ఉద్యోగం. హాయిగా హైదరాబాద్ లో మకాం. అతని వాటాకి పాతిక ఎకరాలు పొలం వస్తుందట. డబ్బుకి లోటులేదు. పిల్లాడు చాల అందంగా ఉంటాడు" యించుమించు అందరి భావం అదే.

అందరి మాటలు విన్నాక నా నిర్ణయంలో మార్పు వచ్చింది. పెళ్లికొడుకుతో నన్ను నేను పోల్చుకున్నాను. ఉద్యోగం లేదు. డబ్బు లేదు. రమ ఏదో అంది కాని, అతనంత అందగాడ్ని కాదేమో. రమ నాకన్నా అతనితోనే సుఖంగా ఉంటుంది. రమకి కోపం వస్తే రావచ్చు, కానీ రమ సుఖమే నాకు ముఖ్యం. అందుకే నా నిర్ణయం మార్చుకున్నాను. ఉత్తరం చూడనట్టే ఉండిపోయాను. మా మధ్య నిశ్శబ్దానికి నేనే కారణం అయిపోయాను.

***

ఆ ఉత్తరం యిప్పటికీ భద్రంగా నాతోనే ఉంది. ముప్పయ్ సంవత్సరాల క్రితం రమ నాకు రాసిన చివరి ఉత్తరం. యిప్పుడెలా ఉందో!

ఆరు గంటలకి ఆఫీసు నుంచి యింటికొచ్చేసాను. భోజనం కూడా సరిగా చేయలేదు. అన్యమస్కంగా ఉన్నాను.

"పెద్దాయన ఏం బాధపడకుండా వెళ్లిపోయారు. ఎక్కువ ఆలోచించకండి. ఆ వయసులో, కాళ్ళు చేతులూ ఆడుతూండగా, ఎవరి చేతా చేయించుకోకుండా వెళ్లిపోయే అదృష్టం ఎంతమందికొస్తుంది చెప్పండి!" పావని మాట్లాడుతోంది.

నిజానికి నేనలా ఉండడానికి సగం కారణం పెద్దనాన్న మరణం అయితే, సగం రమ జ్ఞాపకాలు. అంతా పడుకున్నాక, రమ రాసిన ఆ ఆఖరి ఉత్తరం తీసి మరోసారి చదువుకున్నాను. నాలో నిద్ర కన్నీటి రూపంలో బయటకెళ్లిపోయింది. రాత్రంతా ఆలోచనలే. గతమంతా సినిమాలా కనబడుతూనే ఉంది.

పదవ రోజుకి పెద్దనాన్నకి ధర్మోదకాలు యివ్వడానికి వచ్చాను. ఉదయం స్నానాలు, అందర్నీ పలకరించడాలు, భోజనాలు అయ్యాయి. నాలుగు గంటలకి బయటకొచ్చాను. మాటల్లో తెల్సింది, రమ రెండు రోజుల క్రితం వచ్చి వెళ్లిపోయిందట. మళ్ళీ రానని చెప్పిందట. కొంచెం రిలీఫ్ గా అనిపించింది. రమకి ఎదురుపడక్కర్లేదు.

ఊరంతా మారిపోయింది. తెలిసినవాళ్ళు చాలా  తక్కువమంది ఉన్నారు. ఉద్యోగాల కోసం ఎక్కడెక్కడికో వెళ్లిపోయారు. కొందరైతే విదేశాలక్కూడా వెళ్ళిపోయారు. గోదారి ఒడ్డున కొంచెం సేపు కూర్చున్నాను. పొలం గట్లన్నీ తిరిగాను. శివాలయం దగ్గరకొచ్చాను. గుడి ఏం మారలేదు. అలాగే ఉంది. పూజారిగారు అప్పుడే వచ్చారు. "బావున్నారాండి" అంటూ పలకరించాను.

"బావున్నానయ్యా, ఆ పెద్దాయన ధర్మమా అని అంతా వచ్చారు. మొన్న రమ కూడా వచ్చింది. యిక్కడ ఓ గంట కూర్చుని వెళ్ళింది."

రమ పేరు రాగానే ఒక్కసారి ఏదోలా అయిపోయాను. గుండె వేగంగా కొట్టుకోసాగింది. అయన లోపలకెళ్లాక గుడి మండపం కొంచెం ఎక్కి గూటిలో చేయిపెట్టాను. చేతికి కాగితం తగిలింది.

ఫ్రెండ్!

బావున్నావా? నాకు తెలుసు నువ్వు వస్తావని. అప్పుడు నేను రాసిన ఉత్తరం చదివావు కదూ . చదివే వుంటావులే. నాలుగు నెలలు ఎంతగా ఎదురు చూసానో తెలుసా? ఏదో రోజు నువ్వు వస్తావని, మన పెళ్లి జరుగుతుందని.. ఎన్నో ఆశలు! ఫ్రెండ్, ఎందుకలా చేసావు?

ఉద్యోగం లేదని భయపడ్డావా? ఉద్యోగానిదేముంది, చిన్న స్కూలు పెట్టుకుని హాయిగా బతకలేక పోయేవాళ్లమా? ఈ ఊళ్ళో, నీ పక్కన, ఈ గోదారి, పంట పొలాలు, ఈ శివాలయం అన్నీ చూసుకుంటూ ఉండిపోవాలనుకున్నాను. ఎక్కవలసిన రైలు, జీవితకాలం లేట్ అంటే ఇదేనేమో! మనం సినిమాలు గురించి మాట్లాడుకునప్పుడు ఎక్కువగా దేవదాసు గురించి మాట్లాడుకునే వాళ్ళం. మనిద్దరికీ చాలా ఇష్టమైన సినిమా. మనం కూడా అలాగే విడిపోయాం, కారణం ఏదైనా. నువ్వు దేవదాసువీ కాలేదు. నేను పార్వతినీ కాలేదు. జీవితం సినిమా కాదుగా. ఎలా ఉన్నావు? నిజానికి ఇది జవాబు లేని ప్రశ్న. మళ్ళీ నీ జవాబు కోసం ఈ ఊరు శివాలయానికి రాలేనుగా. నా గురించి చెప్పాలంటే 30 ఏళ్ళ సంగతులు చెప్పాలి. అంత రాసే ఓపిక లేదు ఫ్రెండ్. అయినా అన్ని కాగితాలు ఈ శివాయలం గూట్లో పడతాయా చెప్పు. నిజానికి యిప్పుడన్నీ మారిపోయాయి. కావాలంటే మనం ఉత్తరాలు రాసుకోవచ్చు. ఫోన్ కూడా చేస్కోవచ్చు. కానీ కొన్ని జ్ఞాపకాలుగా ఉండిపోతేనే అందంగా ఉంటుంది. అందుకే నా ఫోన్ నంబరు రాయటల్లేదు. నేను మావయ్య పోయిన రోజునే వద్దామనుకున్నా. కానీ నువ్వు వస్తావేమోనని రాలేదు. నీతో ఎలా మాట్లాడాలి, ఏం మాట్లాడాలి తెలియక కాదు. నువ్వు చాల మారిపోయి ఉంటావు. నిన్నలా చూడలేను. నా దృష్టిలో నువ్వెప్పుడూ అంత అందంగా, అంత అమాయకంగా, అలాగే ఉండాలి. నవ్వొస్తోందా? నవ్వినా సరే, అది నిజం. రాగానే అడిగాను నువ్వు వచ్చావా అని. అడగడానికి ముందే శివాలయం గూడు చూసాను, వచ్చి ఉంటే తప్పనిసరిగా ఉత్తరం రాసి ఉండేవాడివని. నువ్వు రాసిన ఉత్తరాలన్నీ నా దగ్గర భద్రంగా ఉన్నాయి. నా ఉత్తరాలున్నాయా? యిది కూడా దాచుకో. ఓ గంటసేపు యిక్కడ కూర్చున్నాను. పూజారి గారితో మాట్లాడాను. వచ్చే నెల్లో ఈ గుడి మరమ్మతులు చేస్తారట. మొత్తం సిమెంట్ చేసేస్తారట. యింక మన శివాలయం గూడు ఉండదు. పోన్లే, మన అవసరాలన్నీ తీరిపోయాయి. మనం మళ్ళీ ఇక్కడికి రాముగా? ఆల్ ది బెస్ట్. ఉంటామరి, జ్ఞాపకాలు మెదడుని మొద్దుబారుస్తున్నాయి. కన్నీళ్లు కళ్ళను మసకబారుస్తున్నాయి, పెన్ను మొరాయిస్తోంది. ఫ్రెండ్!! అపుడప్పుడు నన్ను గుర్తు చేస్కో. నన్ను చూడాలని కానీ, నాకు కనపడాలని కానీ ప్రయత్నించకు ప్లీజ్,


నీ ప్రియ నేస్తం రమ.

ఆ ఉత్తరాన్ని అక్కడే గూటిలో పెట్టి వెనక్కి తిరిగాను.

“మీ పెదనాన్నగారిని మర్చిపోవడం చాలా కష్టమైన పనే.. కాని తప్పదు కదా!” నా కళ్ళల్లో నీళ్ళని చూస్తూ పుజారిగారు అన్నారు.

కాని.. కారణం ఆ గూట్లో ఉత్తరం అని ఇప్పుడెలా చెప్పగలను??

***0***



# ముందు సూపు

మద్దూరి నరసింహ మూర్తి

“ఇంత ఎండలో డప్పు దండాసిగాడు ఈడకెందుకు ఒస్తున్నాడ్రా” అంటూ రావిచెట్టు దగ్గర పులి, మేక ఆడుతున్న పదిమంది ఆట ఆపి చూడసాగేరు.

ఆడి డప్పు గోల విని అక్కడికి మరో పదిమంది, ఆళ్ళ ఎనకాల మరో పాతికమంది, ఇలాగా ఆ తండాలో ఉన్న అన్ని పెద్దతలలు, పిల్లకాయలు, ఆడోల్లు... మొత్తం అందరూ ఒచ్చిన వరకూ ఆ దండాసిగాడు డప్పు కొడుతూనే ఉన్నాడు.

"అపహె. ఎంతసేపూ డప్పు కొట్టడమేనా, ఏదేనా సెప్పేదుందా?" ఒక పెద్ద తలకాయ నిలదీసింది.

డప్పు కొట్టడం ఆపి, దండాసిగాడు "కాలువొడ్డున పెసిరెంటుగోరి మావిడితోటలో ఆదోరం మజేనం సుట్టుపక్కలున్న పాతిక తండాల జనానికి పెసిరెంటుగోరి దావతు. పెద్దా పిల్లా మగా ఆడా అందరూ రావాలి అని పెసిరెంటుగోరి హుకుం. ఆ దినం అందరూ తినగలిగినంత బిరియాని తిని, తాగ గలిగినంత తాటికల్లు తాగండహో" అని గట్టిగా అరిచి చెప్పి, మళ్ళా డప్పుకొట్టి.. మరో తండా వేపుగా పోయేడు.

మూగిన జనం అందరూ "దావతో" అని ఖుషీగా అరుచుకుంటూ, తండాలోని గుడిసెల వేపుగా పోతే, ముందుగా అక్కడ పులి-మేక ఆట ఆడుకుంటున్న జనం మిగిలిపోయేరు.

"అవునోరేయి! పెసిరెంటు ఇప్పుడు దావతుకెందుకు పిలుస్తున్నట్టు?" రామిగాడు భుజంమీది తుండుగుడ్డ విదిల్చి సందేహం వెలిబుచ్చేడు.

"ఎందుకైతే మనకేటి. ఉట్టిపున్నేనికి బిరియాని తాటికల్లు ఒస్తుంటే..!" కిష్టిగాడు పుసుక్కుమంటూ నవ్వేడు.

"అలా నవ్వమాకురా. ఓతూరి బుర్రకి పనెట్టు. ఇంతమందికి బిరియాని తాటికల్లు అంటే ఎంతకర్సు అవుతాది. అలాంటిది ఉత్తిపున్నేనికి కర్సుసేయడానికి పెసిరెంటు పెర్రోడేమి కాదుగా. ఏదో తిరకాసుండే ఉంటుంది!" అని లచ్చన్న కూడా అనేసరికి...

"అవునోరేయి. ఆటలో పడి సెప్పడం మర్సిపోయెను. ఈ పొద్దుకాల రేడియోలో సెప్పేడు.. రెండుమాసాలు పోతే ఎన్నికలంట!" అన్నాడు సూరిగాడు.

"అదీ మెలిక. మనందరికీ ఇంత తిండి పడేసి, ఇంత కల్లు తాగనిచ్చి.. ఆ పెసిరెంటు ‘ఒరేయి మీరందరూ ఈ పెద్దాయనకే ఎన్నికల్లో ఓటెయ్యాలి. నేను మాటిచ్చేసినాను. ఓటు వేసినాళ్ళకి ఓ చిన్న నోటు, ఓ సీసా

ఇస్తారు' అని హుకుం జారీచేసేస్తాడు.  మనం అందరం 'జీహుజూర్' అంటూ ఆయన సెప్పినట్టు సేయడానికే ఈ దావతు!" అని, పెద్ద తలకాయ  నర్సిములు  వివరించేడు.
వెంటనే రామిగాడు "చిన్న నోటంటే..  వొందనోటా, రెండొందలనోటా? " అని సందేహం లేవదీసేడు.
నర్సిములు నవ్వి, "ఒందరెండొందలకి ఎవరూ ఓటెయ్యరని ఆళ్ళకిఎరికే.  చిన్న నోటంటే ఐదొందల నోటే!"అన్నాడు.
ఆ వివరణ విన్నలచ్చన్న "అందరం కలిసి, పెద్ద నోటిమ్మని అడుగుదామా?" అని ప్రశ్న లేవదీసేడు.
అందుకు సూరిగాడు, "పెద్ద నోటంటే రెండువేలే కదా. తప్పకుండా అడుగుదాం!" అంటూ తేల్చి చెప్పేసాడు.
“ఓసోస్...అలా అడగడానికి దమ్ముండాలి.  నీకుందా?” నర్సిములు భయంగా అన్నాడు.
"మన తండాలంతా ఒక్కమాట మీదుండి అడిగితే ఇవ్వకుండా ఏడకి పోతాడు. అయినా ఎప్పుడూ నోట్లేనా, మనకి మరేమీ ఒవుసరం నేదా?" అన్నాడు లచ్చన్న.
“ఇంకేటుంటాయిరా.  పోనీ నువ్వే సెప్పు.” అన్నాడు సూరిగాడు.
“రోడ్డు బాగుచేయించమనో, లేదో కుళాయిలెట్టించి నీళ్ళొచ్చేట్టు సేయమనో అడుగుతే!" అన్నాడు లచ్చన్న.
"నువ్వు సెప్పింది ఇనడానికి బాగుందిరా. కానీ, ఆ పనులు సేపిస్తే, పెసిరెంటుకేటి  లాభం. మనకి రొండు ఇధాల నష్టం." అన్నాడు నర్సిములు.
"అదెలాగా...?”
"రోడ్డు ఏపిస్తే దానికి ఎంతకర్సయితే, అంతకి పదింతలు కర్సు లెక్కలో సూపించి, బోలెడంత రొక్కం ఆడి బోషాణంలోకే ఒచ్చేటట్టుగా సేసుకుంటాడు. ఏసిన రోడ్డు ఓ వానకే కొట్టుకుపోతుంది. మనం, ఆ గతుకుల రోడ్డు మిగులుతాం. అలాగే, కుళాయి లేయించి దానికి ఎంత కర్సయితే, అంతకి పదింతలు కర్సు లెక్కలో సూపించి బోలెడంత రొక్కం మింగుతాడు. ఓ పదిహేను దినాల తరోత, కుళాయిలోకి రావాల్సిన నీళ్లు ఎండిపోయాయి, మరిప్పుడు రావు. బాగుసేయించి చూడాలంటాడు. మనం, నీళ్లురాని కుళాయిలు మిగులుతాం. రెండు పనుల్లోని మనకి ఒరిగేది ఏమీ ఉండదు. కానీ, పెసిరెంటు బోషాణంలోకే బోలెడంత డబ్బొచ్చి పడతాది." నర్సిములు వివరించేడు.
"మరి మనకి రొండో నష్టమంటివే. అదేటి..?"
"మనకి తలా ఓటుకి ఇచ్చే రొక్కం మరి ఇవ్వోడుగా"
"అయితే, మరిప్పుడేటి సేద్దాం."
“ఆదోరంకి ఇంకా మూడు దినాలున్నాయి కదా. ఈ లోగా అన్ని తండాలాళ్ళతో మాటాడి అందరం ఒక్కమాట మీద నిలబడి ఓటేసిన మగ ఆడ అందరికి తలా ఒక పెద్దనోటు ఇచ్చి తీరాలి అని పెసిరెంటుకి అడుగుతాం!” అన్నాడు నర్సిములు.
“నువ్వోన్నది సక్కగా ఉంది ఇనడానికి.  సరే అనీసి, పెసిరెంటు తరోత సిన్న నోటియ్యడమో మొండిసెయ్యి సూపిస్తేనో...?”  సిమాద్రి పెద్ద సందేహం లేవదీసేడు.

“కొద్దిగా ముందుసూపు ఉండాలర్రా, నేకపోతే మనల్ని ఈడబ్బున్నోళ్ళు నాకేస్తారు.”
"అదేందో కూడా నువ్వే సెప్పు నర్సిములు. అందరం ఇనుకుంటాం!" అన్నారంతా.
“సరేరా! అంతా పెసిరెంటుకి ఇసయం సెప్పి, అప్పుడే బయానాగా తలా రొండు సిన్న నోటులు అడిగేయాల. అవిస్తేనే దావతు కెళ్లాల. లేకుంటే, దావతుకి రామని సెప్పేయాల. మిగులు రొక్కం ఇస్తేనే ఓటేస్తాం.. లేకుంటే ఎయ్యం అని కూడా కరాకండీగా సెప్పేయాల. ఒక్కరూ కూడా ఏరే మాట లేకుండా, అందరం ఒకే మాట మీద ఉంటే, తలా పెద్ద నోటియ్యకుండా ఏడకి పోతాడు. ఇయ్యకపోతే, మన ఓటే ఉండదు ఆళ్ళకి!” అని నర్సిములు వివరించేడు.
“అద్గదీ బుర్రంటే. తండాలన్నీ తిరిగి అందరకీ ఇసయం సెప్పేదాం, పదండి.”
“పదరా” అంటే “పదరా” అంటూ పదిమందీ... ఒక్కటిగా ముందుకి నడిసేరు.
ఈ పేదోళ్ల ప్రస్తుత లక్ష్యం అధర్మం అనైతికం అనిపిస్తున్నా, వాళ్లలో ఇప్పుడిప్పుడే 'ముందు సూపు' తో మొలకెత్తుతున్న ఐకమత్యం, వాళ్ళకి ఏదో ఒకరోజు తప్పకుండా మంచిరోజులు తెచ్చి పెడుతుంది అని ఆశ...!!

***0***



# ఆశ్చర్యం!

## రంగనాయకమ్మ

బస్సు కిటకిటలాడుతోంది కొత్త సినిమా మొదటి ఆట లాగా. కండక్టరు జనాన్ని తోస్తూనే ఉన్నాడు, చాకలి బుట్టలోకి మాసిన బట్టలు కూరినట్టు. దిగేవాళ్ళు లేకపోయినా ఎక్కేవాళ్ళని సర్దుతూనే ఉన్నాడు.

కొండ మీద దేవుడి కళ్యాణం. బస్సుల రాకపోకలకి అంతూపంతూ లేదు. భక్తుల ఇక్కట్లకీ, తిరిగివస్తున్న గుళ్ళకీ కూడా లెక్కా జమా లేదు.

“ఓయ్! ఓయ్!” అంటూ ఒగరుస్తూ పరుగెత్తుకొచ్చాడు షావుకారు. కదలబోయిన బస్సు కదలలేదు.

షావుకారు ఫుట్ బోర్డ్ మీద కాలు పెట్టడం ‘రైట్’ అంటూ కండక్టరు అరవడం - బస్సు ఒక్క ఊపుతో కదలడం - షావుకారు త్రుళ్ళిపడి నిలదొక్కుకోడం – అన్నీ ఏకకాలంలో జరిగిపోయాయి.

“ఏంటోయ్! మనిషి పూర్తిగా ఎక్కక్కర్లేదూ?” అంటూ షావుకారు కొంచెం కోపం చేశాడు కండక్టరు మీద.

“ఇహిహి..! లేట్ లో పోతం సార్ బండి. ఎల్లుండి .. ఎల్లుండి. ఆ కుర్రాడి పక్కన కూచోండి” అంటూ ఓ మందహాసం విసిరి షావుకార్ని చల్లబరిచాడు కండక్టరు. షావుకారి కొట్లో కండక్టరుకి వంద రూపాయల పైనే అప్పు ఎకౌంటు ఉంది.

షావుకారు రెండో మెట్టు కూడా ఎక్కి వస్తుంటే అప్పలకొండకి దడ పుట్టింది. పాపం అప్పలకొండ నిజంగా నాగేశ్వర్రావులాగా ఉంటాడు. అయినా వాళ్ళ మామ్మ మనవడి మంచి చెడ్డలమీద పెత్తనం తీసుకుని, సింహాద్రి అప్పన్న మీద తనకున్న భయభక్తులన్నీ కూడగట్టి - ఆ ముద్దు పేరు పెట్టింది.

పెరిగి పెద్దవాడై కాలేజీలో చదువుతున్న అప్పలకొండకి తన పేరు బొత్తిగా ముద్దు అనిపించలేదు. ఓ రోజు అమ్మాయిలు ఫక్కుమని నవ్వుకోవడం విని, ఇంటికి వెళ్ళీ వెళ్ళగానే వాళ్ళ మామ్మ మీద విరుచుకుపడ్డాడు.

“అసలు నీకేం హక్కుందీ” అన్నాడు వెళ్ళీ వెళ్ళగానే.

“ఏవిట్రా? అసలు గొడవేవిటీ?”

“అదే నేనడుగుతున్నాను. నీకెందుకీ వెధవ గొడవంతాను”

"ఛా! భడవా! నోర్ముయ్! అసలు సంగతి చెప్పవేం?"

"నేనేం చెప్పను - నా పేరు మార్చేసుకుంటాను – ప్రదీప్ అని పెట్టేసుకుంటాను. కిషోర్ అని పెట్టేసుకుంటాను. లేకపోతే అక్కినేని నాగేశ్వరరావు అని పెట్టేసుకుంటాను. ఆ!అంతే!"

"అయ్యో! అయ్యో! అపచారంరా అప్పన్నా! ఇంకెప్పుడు అనామాకు"

"అంటాను, అంటాను. నువ్వుకూడా నన్ను సురేష్ అని పిలు తెలిసిందా? లేకపోతే నేను పలకను"

"ఒరేయ్! అప్పన్నా!"

"ఎందుకూ?"

"లెంపలేసుకో! సింహాద్రి దేవుడికి కోపం జాస్తి! వెర్రి వెర్రి వేషాలేస్తే పరీక్ష పోగొట్టేగల్డు"

హడలిపోయాడు అప్పలకొండ. దీనంగా చూశాడు మామ్మకేసి.

టపటపా లెంపలు వాయించుకున్నాడు.

"పోనీ మామ్మా! ఆ పేరే ఉంచుకుంటాలేవే!"

"నాకు చెప్పటంకాదు. దేవుడికి చెప్పిరా" అంది మామ్మ.

బయల్దేరాడు అప్పలకొండ. పోనీలే, పేరులో ఏముంది? అంది పెరల్ టక్కే కాటోలు. బాగా చెప్పింది. పేరులో ఏముంది? అందంలో ఉందిగానీ. జేబులోంచి అద్దంతీసి ఓసారి చాటుగా అందం చూసుకుని ధైర్యంగా బస్సెక్కాడు. అప్పటికీ కొంచెం చోటు దొరికింది.

"కొంచెం జరగవయ్యా కుర్రోడా" అన్నాడు షావుకారు. అంటూనే సగం ఒళ్ళోకి కూర్చున్నాడు.

అప్పడంలా అణిగి కెవ్వుమని అరవబోయిన అప్పలకొండ చిరునవ్వే నవ్వుతూ – 'ఫరవాలేదులెండి, పరవాలేదులెండి' అనేసి ఓ బెత్తెడు చోటు ఇచ్చేసి నైస్ గా కాలుమీద కాలు వేసుకుని, సీటు చివర పడీ పడకుండా కూర్చున్నాడు.

నిజానికి గొప్ప త్యాగధనం సంపాదించడానికి బస్సు ప్రయాణం చాలు, చాలనుకున్నాడు అప్పలకొండ.

కండక్టరు తోసుకుంటూ, గెంటుకుంటూ, జనాన్ని చీల్చుకుంటూ పద్మవ్యూహంలో జొరబడుతున్న అభిమన్య కుమారుళ్ళా వచ్చాడు.

షావుకారు పర్సు తీసి డబ్బులిచ్చాడు.

అప్పలకొండ దూరంగా సీటులో కూర్చున్న అందమైన ఆడపిల్ల కేసి చూస్తున్నాడు. "అవును చాలా బ్యూటిఫుల్ గా ఉంది. పేరు చారులత అయితే బావుంటుంది. లేకపోతే జానకి అయినా బాగానే వుంటుంది. జానీ అని పిలవచ్చు తాను. ఈ రోజుల్లో అంతా అలానే పిల్చుకుంటున్నారు."

బస్సు మళ్ళా ఆగింది. బిలబిల్లాడుతూ వచ్చి పడ్డారు జనం. చారులతకీ, అప్పలకొండకీ అడ్డం నిల్చి కలలలోకం చెదరగొట్టేశారు. వెధవ జనం. ఇళ్ళల్లో వుండేవాళ్ళకన్నా ప్రయాణాలు చేసేవాళ్ళే ఎక్కువ. బొత్తిగా ఇండియాలో పాపులేషన్ పాపంలా పెరిగిపోతోంది. ఛ! ఈ గవర్నమెంట్ ఎందుకూ పనికిరాదు.

ఆఖరికి మనుషుల్ని కూడా చంపలేదు. తను దిగేక ఈ బస్సుమీద ఒక్క బాంబు వేస్తే సరి. అరెరె! జానకి కూడా దిగాలి ..

జనం వస్తూనే ఉన్నారు. ఎక్కుతూనే వున్నారు.

ఇద్దరు కుర్రాళ్ళు తోపుల్లకి షావుకారు వొళ్ళో కూర్చుని మరీ లేచారు.

అప్పలకొండకి నవ్వొచ్చింది.

షావుకార్ని చూసి అణుచుకున్నాడు.

బస్సు కదిలింది .. పోతోంది .. పోతోంది.

ఇబ్బందిగా కదిలాడు షావుకారు. చేతులు అటూ ఇటూ వేశాడు.

కెవ్వుమన్నాడు.

అదిరిపడ్డాడు అప్పలకొండ.

"బాబోయ్! నా పర్సు! నా పర్సు! నా పర్సు! నా పర్సయ్యా! పర్సు!" అంటూ పొలికేకలు పెడుతున్నాడు షావుకారు.

కంగారుతో చిందులు తొక్కాడు. అప్పలకొండ కాళ్ళు విరగదొక్కాడు. అయినా సహించుకుంటూ చిరునవ్వు నవ్వాడు. వెధవది. కోపం తెచ్చుకుంటే బావుండదు. చారులత చూస్తూంది. "వెదకండీ! అదే వుంటుంది. సరిగ్గా చూడండీ!" అన్నాడు ధైర్యంచెప్తూ. "ఛ! వూరుకోవయ్యా! నీ బోడి సలహా నువ్వూనూ. ఇంకా ఎక్కడ వెదకమంటావ్? ఎవడో కొట్టేశాడు. కాస్త వెతికి పెట్టరాదూ?" అంటూ కస్సుమన్నాడు షావుకారు.

అప్పలకొండ లేచి నుంచున్నాడు. తప్పు గ్రహించుకుని "వెదికేస్తాను. చెప్పండి. ఎక్కడ వెదకను? వీరావేశంతో షావుకారు లాల్చీ జేబులో చేతులెట్టి కెలికిపారేశాడు. అప్పలకొండ చేతులు రెండూ విసిరికొట్టాడు షావుకారు. "అయ్యా! డ్రైవరు బాబూ! కాస్త బస్సు ఆపుదూ! నా పర్స్ కనబట్టంలేదయ్యా! ఏవయ్యో! కండక్టరూ! అలా నించుని చోద్దెం చూస్తావేం? నలుగుర్నీ సోదా చెయ్యవయ్యా! వందరూపాయాల పైనే వున్నాయి." ఏడుపు మొహం పెట్టాడు షావుకారు. జాలేసింది అప్పలకొండకి.

"ఎవరికన్నా పర్సు దొరికితే యిచ్చేయండోయ్ బాబూ! షావుకారు మంచి బహుమతి ఇస్తార్లెండి." అంటూ అరిచాడు కండక్టరు.

"దొరకటం ఏమిటయ్యా? నేనేం పారేసుకున్నానా? నీకు టిక్కెట్టు డబ్బులిచ్చి జోబీలో పెట్టేసుకున్నాను చూసావుకాదూ? ఏ దొంగముండా కొడుకో కాజేసి కూచున్నాడు. వీధి నుంచీ గుర్రప్పిల్లల్లాగా పరిగెత్తారు. నాది నాకివ్వటానికి బగుమతీ ఒకటా? బగుమతీ!" అంటూ గోలపెట్టాడు షావుకారు.

చారులత కర్చీఫు అడ్డం పెట్టుకుని నవ్వుతోంది.

అది చూసి అప్పలకొండ కూడా నవ్వుతెచ్చుకున్నాడు. "నువ్వు కూడా నవ్వు తెచ్చుకో అన్నట్టు" షావుకారు కేసి చూశాడు. "ఏంటయ్యా! నీ ఇకిలింపూ నువ్వూనూ! పర్సు పోయి నేనేడుస్తూంటే" షావుకారు విదిలింపుతో అప్పలకొండ బిక్క మొహం వేశాడు.

షావుకారు మీదనుంచి గుర్రప్పిల్లల్లా లంఘించిన కుర్రవాళ్ళకి పౌరుషం వచ్చింది. "మాకేం భయమా? చూసుకోవయ్యా!నువ్వే చూస్కో!" అంటూ ఉక్కు గుళ్ళలాంటి సంచులు రెండూ షావుకారు పొట్టమీదకి గిరావాటెట్టారు. మళ్ళా ఓ బుట్ట వచ్చిపడింది. వాటి వెనకే ఓ తట్ట వచ్చి పడింది.

"వెదుక్కో, వెదుక్కో, బస్సంతా వెదికేసుకో."

ఆశకొద్దీ – సంతోషంకొద్దీ – షావుకారు నడ్డి వంచి సంచులూ, తట్టలూ, బుట్టలూ కెలికి కెలికి పారేశాడు.

అప్పలకొండ కూడా చాలా సాయం చేశాడు.

"ప్చ్! లేనట్టుంది షావుకారుగారూ!" నుదురు తడుంకున్నాడు చెమటకోసం.

"ఊహు! వున్నట్టు లేదు" బిక్కమొహం వేశాడు షావుకారు. "అయ్యో! అయ్యో! నీళ్ళ ధారేనా! వంద రూపాయలు .. వంద రూపాయలు .. కండక్టరుబాబూ! ఏంటీ అన్యాయం" అంటూ ఘొల్లుమన్నాడు.

షావుకార్ని ఓదార్చటం తన కర్తవ్యం అనుకున్న కండక్టరు తోరణంలా వెళ్ళాడుతున్న జనాన్ని గెంతుకుని .. తోసుకుని ఇవతలి ఒడ్డుకి వచ్చాడు.

"షావుకారుగారూ! మీరల్లా అధైర్యం పడమాకండి. దిగే వోళ్ళనందర్నీ సూద్దాం దేవుడికి మొక్కుకోండి. అదే దొరుకుద్ది."

"అందుకే కాదంటయ్యా కొండకి పోతున్నానూ, దొరికితే ఇస్తానూ, లేకపోతే లేదు. దేవుడికి మాత్రం నేనెక్కడ తప్పుకురానూ?" మొండికేశాడు షావుకారు.

"అద్గదీ! ఆ మాట మీదుండండి. దొరికినా పోయినా అది దేవుడి సోమ్మే కదా?"

షావుకారుకి ఏడవాలో నవ్వాలో తోచలేదు.

అప్పలకొండకి మాత్రం కొంచెం భయం వేసింది. "దేవుడి మొక్కు ఎగ్గొట్టచ్చునా? అమ్మో దేవుడేవన్నా చేస్తే – కీచు కీచుమని ఆరావాల్సిందే?" అనుకున్నాడు.

కండక్టరు ఓ అడుగు వెనక్కి వేసి అందరూ చూస్తుండగా చటుక్కున పైకి తొంగిచూస్తున్న పర్స్ తీశాడు అప్పలకొండ జేబులోంచి.

తెల్లపోయాడు అప్పలకొండ.

అమాంతం కాండక్టర్ని కావలించుకున్నాడు షావుకారు.

"ఉండండి. వుండండి. ఊపిరాడనివ్వండి" అంటూ పెనుగులాడాడు కండక్టరు.

"అరే! ఎలా దొరికింది?" విస్మయంగా అన్నాడు అప్పలకొండ.

"దొరకదూ? తమరు సరిగ్గా దాచుకోలేదులెండి" ఛలోక్తి విసిరారెవరో.

"ఆదేమిటండి?నేను తియ్యందే!"

"చాల్లేవయ్యా! నోరు మూసుకో. ఎముకలో సున్నం లేకుండా తన్నీగల్ను. పక్కన చేరి కూచుని ఇదా నీ ఎత్తు? పైగా నా జేబులే వెతుకుతావా? నాకు సాయం చేసినట్టు నటిస్తావా? నన్ను కంగారు పడద్దని ఓదారుస్తావా? దొంగ భడవా! .. భడవానీ .." అంటూ రంకెలు వేశాడు షావుకారు.

బిక్కచచ్చిపోయాడు అప్పలకొండ.

"ఏం ఇచిత్రం.  కుర్రోడేమో మెరికాలా వున్నాడు.  ఎదవబుద్ధి "

"అలా టిప్పుటప్పుగా లేకపోతే ఎవరు దగ్గిర కూచోనిత్తార్లే."

"అయినా ఇండియాలో పిక్ పాకెట్స్ ఎక్కువైపోయారండీ!  గవర్నమెంటలా ఏడుస్తోంది"

"పట్టుమని పద్దెనిమిదేళ్ళుండవు, ఎంత ఒడుపుగా తీశాడయా! మనం కూడా నేర్చుకుంటే బతికిపోతాం"

"ఆ! ఆ పెద్దమనిషి గాబట్టి ఈపు చీరైకుండా ఒగ్గేశాడు"

బావురుమని ఏడ్చేయబోయాడు అప్పలకొండ.

కిక్కురుమనకుండా తల దించేసుకున్నాడు.

దేవుడు తోడుగా తను పర్సు తియ్యలేదే! అది తన జేబులోకెలా వచ్చింది?  పర్సు తెరిచి నోట్లు లెక్కపెట్టుకున్నాడు షావుకారు.  చెక్కు చెదరలేదు.  ఇకిలిస్తూ – అందరికేసీ చూశాడు.  గట్టిగా పట్టుకుని మళ్ళా జేబులో పెట్టుకుని, అదిమి పట్టుకుని కూచున్నాడు.  పర్స్ దొరికిన సంతోషంతో ఆలోచిస్తుంటే షావుకారుకి కొంచెం అనుమానం వచ్చింది.  ఇందాకా పర్స్ దాచినప్పుడు తన చెయ్యి యిరుకు జేబులోకి వెళ్ళినట్టు తోచిందిస్మీ !!

***0***

(జ్యోతి రజతోత్సవ ప్రత్యేక సంచిక 1963-1988)

# కథ.. ఇతివృత్తం,శిల్పం

ఎల్ .ఆర్ .స్వామి

నేడు సాహిత్యంలో అత్యంత ప్రాచుర్యం పొందిన ప్రక్రియ కథ!! కథ అని ఉదహరింపబడుతున్న ఈ సాహిత్య ప్రక్రియ, 19వ శతాబ్దం మలి దశకంలో కానీ, 20 వ శతాబ్దపు తొలి దశకంలో కానీ వివిధ భారతీయ ప్రాంతీయ భాషల్లో మొలకెత్తిన విత్తనం. అనతికాలంలోనే ఎదిగి విస్తరించిన ప్రక్రియ ఇది. ఈ ప్రక్రియ ఆంగ్ల భాషా సాంగత్య ప్రభావం వల్లనే భారతీయ ప్రాంతీయ భాషల్లో పుట్టుకొచ్చిందని చెప్పే విమర్శకులు ఉన్నారు, కాదని వాదించేవారూ ఉన్నారు. ఏది ఏమైనా ఈ నాటికీ సాహిత్య పత్రికలు కనుమరుగవుతున్న ఈ రోజుల్లో కూడా, సాహిత్యరంగంలో కథా రచయితలే ఎక్కువ.. కథలు చదివేవారే ఎక్కువ అనేది వాస్తవం!

కథలకు కొన్ని లక్షణాలు నిర్దేశించి... కొన్ని కథలు మంచివి అనీ, కొన్ని గొప్పవి అనీ చెబుతూ వుంటారు సాహితీ విమర్శకులు. ఇక్కడ మనం ఒకటి గుర్తుంచుకోవాలి. మంచి చెడులు సాపేక్షికాలు. అంతే కాదు విత్తు ముందా చెట్టు ముందా అనే వివాదాన్ని గుర్తు తెచ్చుకుంటే, ఇక్కడ ఖచ్చితంగా కథయే ముందు అనేది గుర్తించాలి. ఆ తరువాతనే విమర్శకుడు నిర్దేశించిన లక్షణాలు పుట్టాయి. వందల వేల కొద్ది కథలు వచ్చిన తరువాత, వాటిని పరిశీలించాక కథ మంచిచెడ్డల మీద ఒక అభిప్రాయం ఏర్పరిచుకోవటం జరుగుతుంది. అంటే ఆ లక్షణాల పరిధిలో రానివి మంచి కథలు కావు అని అనుకోకూడదు. ఏ సాహిత్య ప్రక్రియనైనా ఒక నిర్దిష్ట పరిధిలో బంధించటం కష్టం. చదువరి గుండెను తాకిందా లేదా అనేదే సాహిత్య రచనకి కొలమానం. సాహిత్యం చదువరి గుండెను తాకి, గుండె ద్వారా మెదడుని తాకాలి. కేవలం మేధోపరమైన మథనం సాహిత్యం అవుతుందని నేను అనుకొను. ఎంత గొప్ప వైజ్ఞానిక విషయానైనా ఆర్థిక, సామాజిక విషయానైనా సాహిత్యం ద్వారా ఆవిష్కరించవచ్చు. కాని రచనా విధానం శిల్పం గుండెను తాకేలా వుండాలి. చదివించేదిగా ఉండాలి. ఒక వ్యాసంలా సాగకూడదు సాహిత్య రచన. ఏ విషయానైనా చదువరి గుండెకు తగిలేలా చెప్పగలగటం రచయితకి ఉండవలసిన కనీస నైపుణ్యం కాదేదీ కవితకి అనర్హం.. అన్నట్టు, కథ కూడా ఏ విషయం గురించైనా అల్లవచ్చు. జీవితం ఎంత వైవిధ్యభరితమో, జీవితం నుంచి పుట్టుకొచ్చే సాహిత్యం కూడా, అంత వైవిధ్యభరితంగానే ఉండవచ్చు.. ఉంటుంది కూడా! అందువల్ల కథకునికి విషయపరిమితి లేదు. తన అనుభవానికి వచ్చిన విషయాన్ని గురించి వ్రాస్తే, కథ వాస్తవికతకు దగ్గరగా ఉండడానికీ, చదువరి హృదయాన్ని ఆకట్టుకోవడానికీ అవకాశం ఎక్కువ ఉండుంది. వివరాలు సేకరించి కూడా వ్రాయవచ్చు. కానీ అలాంటి రచన చదువరి గుండెకు చొచ్చుకుపోయి వెలుగు వెదజల్లాలి అంటే రచయితకి అపూర్వ సృజనాత్మకత ఉండాలి. నేడు ఒక విషయం గురించి చెప్పటం కోసమో, చర్చ చేయటం కోసమో, పాత్ర రూపకల్పన చేసి కథలు వ్రాసే విధానం తక్కువ

కనబడుతుంది. తన చుట్టూ వున్న తను చూసిన జీవితాన్నే ఆవిష్కరిస్తున్నారు రచయితలు. జీవితానుభవాలు వివిధం.. ఒక్కొక్కప్పుడు పరిమితం, వ్యక్తిపరం కూడా. అందువల్ల కేవలం ఇతివృత్తాన్ని మాత్రం ఆధారం చేసుకొని కథను మూల్యాంగనం చేయటం సబబు కాదు. ఇతివృత్తం ముఖ్యం. కానీ ఇతివృత్తమే అంతా కాదు. ఇతివృత్తం ఎంత ముఖ్యమో, శిల్పం అంతే ముఖ్యం. బహుశా శిల్పం దాని కన్నాఎక్కువ ముఖ్యమేమో కూడా! ఒక విషయాన్ని కథగా మలిచేది, మార్చేది, వ్యాసం నుంచో లేదా మరో సాహిత్య ప్రక్రియ నుంచో భిన్నంగా చేసేది శిల్పం, చదువరి చేత కథ చదివించేది కూడా శిల్పామే! అతిసాధారమైన ఇతివృత్తంతో వ్రాసినా, కేవలం కథ చెప్పిన తీరునిబట్టి నిలబడిన కథలు ఉన్నాయి. అందువల్ల కథావిమర్శలో కథానిర్మాణ శైలికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంది

ఒక మాటలో చెప్పాలంటే ఒక కథ కాని, కవిత కాని చదివినప్పుడు చదువరికి ఒక అనుభూతి కలుగుతుంది, కలగాలి కూడా! అదే పఠనానుభూతి [READING EXPERIENCE]. గొప్ప పఠనానుభూతి కలిగించిన రచనలు గొప్ప రచనలు. గురజాడ నుంచి నేడు కొత్తగా వ్రాస్తున్నవారు వరకు ఎందరో గొప్ప రచయితలు ఉన్నారు! వారె కాకుండా నాలుగైదు గొప్ప కథలు మాత్రమే వ్రాసి, రచనా రంగం నుంచి నిష్క్రమించిన వారు కూడా ఉన్నారు. కొందరు విషయపరంగా గొప్ప రచనలు చేస్తే, కొందరు శిల్పపరంగా గొప్ప రచనలు చేసేరు. అందువల్ల నేను ప్రత్యేకంగా ఏ ఒక రచయితకీ అభిమాని కాదు. నేను ఒక ప్రత్యేక కథను మెచ్చుకుంటాను. నాకు అభిమాన రచయిత లేరు [ఏ భాషలో కూడా ]టెండూల్కర్ కానీ కోహ్లీ కానీ చక్కగా ఆడి మొదటి ఇన్నింగ్స్ లో సెంచురి కొట్టవచ్చు . వెంటనే రెండో ఇన్నిగ్స్ లో డక్ కొట్టవచ్చు. బాగా ఆడినప్పుడు ఆ ఆటను మెచ్చుకుంటాను. వ్యక్తిని కాదు!! అలాగే కవిత్వము, కథ కూడా కదిలేదీ, కదిలించేదిగా ఉండాలి. అలాంటి కథలను, ఆ కథకుడ్ని మెచ్చుకుంటాను .

కొందరు కథలో ఇతివృత్తం ముఖ్యమని, దానికే పెద్ద పీట వేస్తారు. శైలి, శిల్పం కూడా ఇతివృత్తం అంత ఎక్కువ కాకపోయినా, అవి ముఖ్యమని అనుకుంటూ వుంటాను నేను. అందువల్ల శైలికి కథానిర్మాణ రీతికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాను. ఇతివృత్తం మామూలే అయినా నూతన రీతిలో వ్రాయడానికి ప్రయత్నిస్తాను. అనుభవించి, అనుభవిస్తూ వ్రాస్తాను. నా రెండు వందల కథల్లో నాకు నచ్చిన ఒక కథని ఎన్నుకోవటం కష్టం. అయినా ఇతివృత్త పరంగా షక్కీల అనే కథనూ శిల్ప పరంగా నిమజ్జనం, గుర్రాలు అనే కథలనూ ఇష్టపడతాను.

***0***

# మరి శలవు

## వస్తానని బెదిరిస్తున్న "ఓమిక్రాన్" ని దూరంగా ఉంచుదాం.

## క్రిస్టమస్ శుభాకాంక్షలతో

